అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 10-04-2025
సంపుటి : 11 సంచిక : 49
Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam
12 పేజీలు వెల : 6.50

సాధారణ వర్షపాతమే
సీజన్ రెండో భాగం మెరుగు
బలహీనంగా, స్వల్పకాలికంగా లా నినా
దక్షిణ, పశ్చిమ భారత్‌లో తగినంత వర్షాలు
ప్రయివేటు వాతావరణ ఏజెన్సీ స్కైమెట్ అంచనా




న్యూఢిల్లీ : భారత్‌లో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సాధారణ వర్షపాతమే నమోదు కానున్నది. ప్రయివేటు వాతావరణ ఏజెన్సీ స్కైమెట్ దీనిని అంచనా వేసింది. స్కైమెట్ అంచనా ప్రకారం.. ఈ పీరియడ్‌లో వర్షపాతం దీర్ఘకాల సగటు 868.6 మిల్లీమీటర్ల కంటే మూడు శాతం అధికంగా నమోదు కానున్నది. దీర్ఘకాలిక సగటులో నాలుగుశాతం వర్షపాతం సాధారణంగా పరిగణించ బడుతుంది. "ఈ సీజన్‌లో లా నినా బలహీనంగా, స్వల్పకాలికంగా ఉన్నది. లా నినా కీలక ...11లో

బ్రిటిషర్ల కంటే బీజేపీనే ప్రమాదకరం




గాడ్సే ఆలోచనల్ని మోడీ విస్తరింపజేస్తున్నారు
గాంధేయవాదులు రాహుల్‌కు అండగా నిలవాలి :
సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు అత్యంత ప్రమాదకారులని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్టే, రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలని చెప్పారు. దీనికోసం గాంధేయవాదులు రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలవాలని కోరారు. గాడ్సే ఆలోచనా విధానాన్ని దేశంలో వ్యాపింపజేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బుధవారం అహ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గాడ్సే వారసుల ఆలోచనా ధోరణిని అడ్డుకునేందుకు గాంధీ కుటుంబసభ్యులతో కలిసి దేశం నలుమూలల ఉన్న ప్రజలు మోడీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ అధికారం చేపట్టినప్పటి నుంచీ విభజన రాజకీయాలు చేస్తున్నారనీ, దానికి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రధాని మోడీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చారనీ, వాటికి వ్యతిరేకంగా రైతులు 14 నుంచి 15 నెలలు ధర్నాలు చేసినా చర్చలకు రాలేదని విమర్శించారు. మణిపూర్‌లో మంటలు రాజేసి, దేశ మూలవాసుల జీవన హక్కుల్ని కాలరాసే ప్రయత్నం చేశారని అన్నారు. దేశ సమగ్రత, ఐక్యత, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కుల గణన, రైతు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారనీ, ఆ మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 25 లక్షల కుటుంబాలకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. రాష్ట్రంలో కుల గణన చేసి చూపించామని చెప్పారు. కుల గణనపై రాహుల్ గాంధీ మాట్లాడాతారనే భయంతోనే లోక్‌సభలో మోడీ ఆయనకు మైక్ ఇవ్వలేదని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోడీ హామీ ఇచ్చారనీ, ఆ ప్రకారం 11 ఏండ్లపాలనలో 20 కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయంలో యువతరం తీవ్రంగా నష్టపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మోడీ చెప్పిన ఏ ఒక్క వాగ్దానం కూడా అమలుకు నోచుకోలేదని ఆక్షేపించారు. రైతులు, యువత, మహిళల కోసం సీడబ్ల్యూసీలో ఆసక్తికరమైన చర్చలు సాగాయని ప్రశంసించారు. తెలంగాణలో ఎట్టి పరిస్థితుల్లో బీజేపీకి అవకాశం ఇవ్వబోమన్నారు. తమ ప్రాంతం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేతృత్వంలో స్వాతంత్ర్యం వచ్చిందనీ, తెలంగాణ స్వరాష్ట్రాన్ని సోనియాగాంధీ తమకు అందించారని వివరించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏండ్లు అనేక పోరాటాలు చేశారనీ, కానీ బ్రిటిషర్లు ఏనాడూ ఆయనపై లాఠీ ప్రయోగం చేయలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ...11లో



మోడీ దేశాన్ని అమ్మేస్తారు
ఏఐసీసీ చీఫ్ ఖర్గే

దేశాన్ని ఎక్స్‌రే తీయాలి
రేవంత్ పంపిన బిల్లుపై కేంద్రం చర్యలు తీసుకోవట్లేదు : రాహుల్ గాంధీ



వివరాలు 2లో..

వడ్డీ రేట్లు మరో పావు శాతం తగ్గింపు
జీడీపీపై టారిఫ్ దెబ్బ
ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడి



ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుసగా రెండో సారి వడ్డీ రేట్లను తగ్గించింది. మూడు రోజుల పాటు సాగిన మానిటరింగ్ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమీక్షలో రెపోరేటులో 0.25శాతం కోత పెట్టాలని నిర్ణయించామని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దీంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గనుందన్నారు. ఇంతక్రితం ఫిబ్రవరిలో జరిగిన ద్రైమాసిక ద్రవ్య పరపతి సమీక్షలోనూ వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. ఆర్బీఐ తాజా నిర్ణయంలో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయి. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చి తులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపించనున్నాయని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. భారత జీడీపీపై ...11లో

పెరుగుతున్న ఎండలు
వచ్చే మూడ్రోజులు 40 నుంచి 43 డిగ్రీలు పెరిగే అవకాశం
పలు జిల్లాల్లో వర్ష సూచనలు

వివరాలు 2లో..

ఫ్రాన్స్ నుంచి రాఫెల్ మెరైన్ జెట్‌లు
- 700కోట్ల డాలర్లతో 26 యుద్ధ విమానాలు కొనుగోలు
- భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర



క్యాబినెట్ వివరాలు వెల్లడిస్తున్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ : భారత నావికాదళం కోసం 700కోట్ల డాలర్లు విలువ చేసే 26 రాఫెల్ మెరైన్ జెట్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు ఫ్రాన్స్‌తో ఒప్పందానికి భారత్ ఆమోద ముద్ర వేసింది. బుధవారం సమావేశమైన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) ఈ మేరకు నిర్ణయం తీసుకుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందం కింద 26 రాఫెల్ విమానాలు భారత్‌కు అందుతాయి. వీటిలో 22 సింగిల్ సీటర్ జెట్‌లు కూడా వున్నాయి. విమాన వాహక నౌకల నుండి వీటిని నిర్వహించవచ్చు, మరో నాలుగు ట్విన్ సీటర్ జెట్‌లు వుంటాయి. రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన ఈ ఒప్పందానికి సీసీఎస్ ఆమోద ముద్రే తుది చర్య. ఈ నెలాఖరులో ఫ్రాన్స్ రక్షణ మంత్రి భారత్‌లో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా లాంఛనంగా ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని భావిసున్నారు. ఫ్రాన్స్ నుండే కొనుగోలు చేయాలని భావిస్తున్న మరో మూడు స్కార్పియన్ సాంప్రదాయ జలాంతర్గాములకు కూడా సీసీఎస్ ఆమోదం ఇంకా అందాల్సి వుంది. కాగా ఒప్పందంపై సంతకాలు అనంతరం రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలను నాలుగేళ్ళలో ఫ్రాన్స్, భారత్‌కు అందచేయాల్సి వుంటుంది. భారత నావికా దళానికి చెందిన రెండు విమాన వాహక నౌకల నుండి రాఫెల్-ఎంలను నిర్వహిస్తారు. 2016 సెప్టెంబరు రూ.60వేల కోట్లతో కుదిరిన ఒప్పందంలో భాగంగా భారత వైమానిక దళానికి 36 రాఫెల్ జెట్‌లు అందాయి. 2023 జులై 13న ప్రధాని పారిస్‌కు వెళుతున్న సమయంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశం ఈ ఒప్పందం ఆవశ్యకతను గుర్తించింది.

జిరక్‌పూర్ బైపాస్ రోడ్ ప్రాజెక్టుకు ఆమోదం
పంజాబ్, హర్యానాలోని 19.2కిలో మీటర్ల జిరక్‌పూర్ బైపాస్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ.1878.31కోట్లు ఖర్చవుతుందని భావిస్తున్నారు. ఆరు లైన్లలో ...11లో

శ్రీకాంత్‌కు కన్నీటి వీడ్కోలు
అంతిమయాత్రలో వేలాదిగా ప్రజలు, పార్టీ శ్రేణులు



(ఫైల్)

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ, కార్యదర్శివర్గం సంతాపం
- పొలిట్‌బ్యూరో సభ్యులు అరుణ్‌కుమార్ నివాళి
- పాడె మోసిన అరుణ్, పోతినేని, నున్నా, ఎంపీ వద్దిరాజు
- సంతాప సభలో శ్రీకాంత్ ఔన్నత్యాన్ని స్మరించుకున్న నేతలు
- పార్టీకి తీరని లోటు : జాన్‌వెస్లీ

ఖమ్మంలో సీపీఐ(ఎం) అంటేనే 'యర్రా' కుటుంబం: తమ్మినేని

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి
సీపీఐ(ఎం) అఖిల భారత 24వ మహా సభకు ప్రతినిధిగా హాజరై అకస్మాత్తుగా మృతిచెందిన యర్రా శ్రీకాంత్‌కు బుధవారం ఖమ్మంలో అంతిమ వీడ్కోలు పలికారు. అంతిమయాత్రకు వేలాదిగా జనం, పార్టీ శ్రేణులు కదిలివచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హాజరయ్యారు. శ్రీకాంత్ భౌతికకాయంపై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో శ్రీకాంత్ పాడెను అరుణ్ కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మోశారు. శ్రీనివాసనగర్‌లోని శ్రీకాంత్ గృహం నుంచి మొదలైన ...3లో

జనాగ్రహం
గ్యాస్ ధర పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి:
రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసనలు
రోడ్లపై కట్టెల పొయ్యిలు, సిలిండర్లు



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ- విలేకరులు
కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరపై జనాగ్రహం వ్యక్తమవుతోంది. పెంచిన రూ.50 వెంటనే ఉపసంహరించుకోవాలంటూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. వంట గ్యాస్ సిలిండర్లు పెట్టి రాస్తారోకోలు చేశారు. పలు చోట్ల సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. ఇల్లందు-మహబూబాబాద్ రహదారిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని జప్తి వీరప్పగూడెం, ఉట్లపల్లి, యాదగిరిపల్లి, బాదులాపురం గ్రామాల్లో నిరసన తెలిపారు. నకిరేకల్ పట్టణ కేంద్రంలోని మెయిన్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. నల్లగొండ పట్టణ కేంద్రంలో పొయ్యిపెట్టి నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని మునగాల, జగన్నాథపురం గ్రామాల్లో ధర్నా నిర్వహించారు. మఠంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు.
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీలో గ్యాస్ బండతో నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ఆదిలాబాద్ మండలం రాములుగూడలోనూ నిరసన తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట గ్యాస్ సిలిండర్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో, మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఖాళీ గ్యాస్ సిలిండర్లతో ...11లో

శాశ్వత పరిష్కారం చూపండి



తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ అసోసియేషన్
అరెస్ట్ అక్రమం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వివరాలు 3లో..

లోకో పైలట్లకు విరామం కుదరదు
భోజనం, కాలకృత్యాలకు బ్రేక్ సాధ్యం కాదు
తేల్చి చెప్పిన రైల్వే బోర్డు
- ఉద్యోగ సంఘాల ఆగ్రహం



వివరాలు 3లో..

ముదిరిన వాణిజ్య యుద్ధం
ట్రంప్‌పై ఎదురుదాడి | అగ్రదేశాల మధ్య సుంకాల రగడ తీవ్రరూపం

- చైనాపై 104 నుంచి 125శాతానికి టారిఫ్ పెంపు
- యూఎస్‌పై చైనా 84శాతం సుంకాలు
- కొరడా ఝుళిపించిన కెనడా.. ట్రంప్ యూటర్న్

అగ్రదేశాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చింది. చైనా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 104 శాతం టారిఫ్‌లు అమలు చేస్తున్నట్టు అమెరికా తెలిపింది. ఇవి ఏప్రిల్ 9 నుంచి అమలులోకి రానున్నాయని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ వెల్లడించారు. దీనికి మరోమారు చైనా కూడా దీటుగా బదులిచ్చింది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను 84 శాతానికి పెంచుతున్నట్టు చైనా తెలిపింది. కొత్త సుంకాలను ఏప్రిల్ 10 నుంచి అమలు చేయనున్నట్టు స్పష్టం చేసింది. కాగా తాజాగా అమెరికా చైనాపై టారిఫ్‌ను 125 శాతానికి పెంచింది. మిగతా దేశాలపై సుంకాలను తాత్కాలికంగా 90 రోజులపాటు నిలిపివేసింది.

వాషింగ్టన్/బీజింగ్ : ఏప్రిల్ 2 నుంచి చైనా దిగుమతులపై 54 శాతం సుంకాలు విధించనున్నట్టు ట్రంప్ ప్రకటించారు. దీనికి ప్రతీకారంగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 34 శాతం సుంకాలు అమలు చేయనున్నట్టు వెల్లడించింది. దీనిపై ట్రంప్ తీవ్ర అభ్యంతరం, ఆగ్రహం వ్యక్తం చేశారు. 34 శాతం సుంకాలను వెనక్కి తీసుకోకపోతే అదనంగా 50 శాతం టారిఫ్‌లు అమలు చేస్తానని సోమవారం హెచ్చరించారు. ట్రంప్ హెచ్చరికను లెక్కచేయకపోవడంతో సుంకాలను 104 శాతానికి పెంచారు. ఇందుకు ప్రతిగా చైనా 84 శాతానికి పెంచింది. ఆ తర్వాత అమెరికా ఈ సుంకాన్ని 125 శాతానికి చేర్చింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు వాణిజ్య యుద్ధానికి దిగడంతో ప్రపంచ దేశాలు తీవ్ర కలవరపడుతున్నాయి. ఈ పరిణామాలు వర్ధమాన దేశాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా కేవలం 10 శాతం సుంకాలు విధిస్తూ వచ్చింది. దీన్ని తాజాగా పది రెట్లకు పెంచినట్టయ్యింది. చైనా బాటలోనే కెనడా కూడా కొరడా ఝుళిపించింది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే వాహనాలు, వాటి పరికరాలపై 25 శాతం సుంకాలను విధిస్తున్నట్టు స్పష్టం చేసింది. యూఎస్ నుంచి ఆ దేశం ప్రతీ ఏడాది 67వేల యూనిట్ల వాహనాలను దిగుమతి ...11లో

మిగతా దేశాలపై తాత్కాలికంగా 90 రోజులపాటు సుంకాల నిలిపివేత

సుదీర్ఘ పోరాటం కష్టమే
ఆర్థికాంశాల్లోనేకాక, అమెరికాతో పోలిస్తే అనేక అంశాల్లో చైనా బలంగా, స్థిరంగా ఉంది. ట్రంప్‌పై అమెరికా ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఆ సమస్య లేదు. చైనాలో ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీ అమలులో ఉంది. భవిష్యత్తులోనూ దానిని కొన సాగించే సత్తా చైనాకు ఉంది. దేశీయ వినియోగ మార్కెట్‌ను పెంచుకునే అవకాశాలూ ఉన్నాయి. అమెరికా ప్రజలు తమ రోజువారీ అవసరాల కోసం చైనా దుస్తులు, బూట్లు, వినియోగ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ట్రంప్ సుంకాల దెబ్బతో వాటి ధరలు పెరిగి అమెరికన్లు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా భవిష్యత్తు లో ట్రంప్‌పై ఒత్తిడులు పెరగవచ్చు. ఇలాంటి వాతావరణం లో చైనాతో సుదీర్ఘ పోరాటం చేయడం అమెరికాకు కష్టమే. అమెరికా దీర్ఘకాలిక వాణిజ్య యుద్ధానికి దిగితే చైనా తన ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ మార్కెట్ల కోసం అన్వేషిస్తుంది. అది యూరోపియన్‌యూనియన్ కావచ్చు. భారత్ కావచ్చు. అయా మార్కెట్లలో తన ఉత్పత్తులను చైనా కుమ్మరించే అవకాశం ఉన్నదని జీటీఆర్ఐ పరిశోధనా సంస్థ పేర్కొంది.

త్వరలో ఔషధాలపై యూఎస్ టారిఫ్‌ల మోత
11లో..



బస్సు కోసం రోడ్డెక్కిన మహిళలు

2 గంటల పాటు ధర్నా..

ఆర్టీసీ డీఎంతో మాట్లాడించిన ఎస్ఐ

నవతెలంగాణ-రామారెడ్డి

గ్రామానికి ఆర్టీసీ బస్సు ట్రిప్పులు తగ్గించడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు బస్సు కోసం రోడ్డెక్కారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మద్దికుంట మర్రివద్ద గ్రామ మహిళా సంఘం, వీడీసీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్సులు నడపాలని సుమారు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. గ్రామానికి గతంలో ఆర్టీసీ బస్సులు 8 ట్రిప్పులు తిరిగేవని, కానీ ప్రస్తుతం టార్గెట్ రావటం లేదన్న సాకుతో పొద్దున, సాయంత్రం మాత్రమే బస్సులు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి పూర్తిస్థాయిలో బస్సులు నడిపించాలని కోరారు. ఆందోళన సమాచారంతో ఎస్ఐ నరేష్ అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. ఆర్టీసీ డిఎంతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. గ్రామస్తులు కామారెడ్డి వెళ్లి ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో ఇద్దరే అభ్యర్థులు

ఎంఐఎం, బీజేపీ మధ్యే పోటీ

స్క్రూటినీలో స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక ఉత్కంఠగా మారింది. నామినేషన్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసిన విషయం తెలిసిందే. గత నెల 28 నుంచి ఈ నెల 4వరకు నామినేషన్లు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంత్ స్వీకరించారు. బీజేపీ నుంచి ఎన్.గౌతమ్‌రావు, ఎంఐఎం నుంచి మీర్జా రియాజ్ ఉల్ అసన్ ఎఫెంది, స్వతంత్ర అభ్యర్థులు చంద్రశేఖర్ చాలిక, కంటే సాయన్న నామినేషన్ దాఖలు చేశారు. అయితే, స్క్రూటినీలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురవ్వగా.. పోటీలో బీజేపీ, ఎంఐఎం అభ్యర్థులు మాత్రమే నిలిచారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీకి దూరంగా ఉండటంతో బీజేపీ, ఎంఐఎం మధ్యే ఆసక్తికరమైన పోటీ నెలకొంది. ఈనెల 23న పోలింగ్, 25న కౌంటింగ్ జరగనున్నది. మొత్తం 110 మంది ఓటర్లు ఉండగా ఎంఐఎంకు 49, బీఆర్ఎస్‌కు 25, బీజేపీకి 22, కాంగ్రెస్‌కు 14 ఓట్లు ఉన్నాయి.

దేశాన్ని ఎక్స్‌రే తీయాలి

రేవంత్ పంపిన బిల్లుపై కేంద్రం చర్యలు తీసుకోవట్లేదు : రాహుల్ గాంధీ



అహ్మదాబాద్: దేశ సమస్యలు తీర్చాలంటే.. దేశాన్ని ఎక్స్‌రే తీయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దళితులు, ఆదివాసీల సమస్యలపై ద ృష్టిపెట్టాలన్నారు. దళితులు, ఆదివాసీలకు న్యాయం జరుగుతోందా ?అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ విమర్శించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. "చనిపోయాక నా గురించి ప్రజలు ఏం ఆలోచిస్తారనేది అనవసరం. నేను అనుకున్న పనులు పూర్తి చేశాక ప్రజలు మరిచిపోయినా నాకు అభ్యంతరం లేదు. బీసీల రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిల్లు కేంద్రానికి పంపారు. రేవంత్‌రెడ్డి పంపిన బిల్లుపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణలో కులగణనను విజయవంతంగా నిర్వహించారు. కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కులగణన వల్ల దేశంలో బీసీల సంఖ్య ఎంతో తెలుస్తుంది. కులగణన విషయంలో తెలంగాణ దేశానికి మార్గం చూపింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అంశాన్ని తొలగిస్తాం. తెలంగాణలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారు. తెలంగాణ సంపదలో మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన భాగస్వామ్యం లేదు. వారి జనాభాకు అనుగుణంగా సంపదలోనూ తగిన వాటా అవసరం" అని రాహుల్ గాంధీ అన్నారు. "ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోడీ ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నారు. ఇద్దరు వ్యాపారవేత్తలకే వాటిని అప్పగిస్తున్నారు. ఎయిర్‌పోర్టులు, గనులు, సిమెంట్, స్టీల్ సహా కీలక పరిశ్రమలన్నీ ఓ పారిశ్రామికవేత్తకే కట్టబెడుతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అక్రమాల ద్వారా గెలిచింది. ఆర్ఎస్ఎస్, బీజేపీ రోజూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. దేశంలో కులగణన చేపట్టాలని ప్రధాని మోడీని కోరాం. దీనికి ప్రధాని సహా ఆర్ఎస్ఎస్ తిరస్కరించింది. లౌకిక భావనకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకం. దళితుడైన రాజస్థాన్ పీసీసీ నేతను ఆలయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. వక్ఫ్‌సవరణ చట్టం మత స్వేచ్ఛపై దాడి" అని రాహుల్ వ్యాఖ్యానించారు..

పెరుగుతున్న ఎండలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే మూడ్రోజుల పాటు ఎండలు క్రమంగా పెరుగుతాయనీ, గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల మేర పెరిగి 43 డిగ్రీలకు చేరుకునే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న వెదర్ బులిటెన్‌లో వివరించారు. అదే సమయంలో శుక్రవారం పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపారు. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జిల్లాలో ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురియొచ్చని తెలిపారు.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

ఆదిలాబాద్	41 డిగ్రీలు
నిజామాబాద్	40.8 డిగ్రీలు
మెదక్	39.8 డిగ్రీలు
ఖమ్మం	38.6 డిగ్రీలు
రామగుండం	38 డిగ్రీలు

మోడీ దేశాన్ని అమ్మేస్తారు : ఏఐసీసీ చీఫ్ ఖర్గే

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోడీపై తీవ్ర విమర్శలు చేశారు. మోడీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తారని ఖర్గే ఆరోపించారు. మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సమావేశాలు జరుగుతున్నాయి. అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం నెలకొల్పబడుతోంది. ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు భూములకు అప్పగిస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాలు) రిజర్వేషన్ దెబ్బతింది. వారు బలహీన వర్గాల వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదు. వారు ప్రభుత్వరంగాన్ని ఒక్కొక్కటిగా అమ్మేస్తూ.. తమ స్నేహితులకు సహాయం చేస్తున్నారు. ఇదే కొనసాగితే.. మోడీ ఏదో ఒకరోజు ఈ దేశాన్ని అమ్మేస్తారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించి న ప్రభుత్వ రంగ కర్మాగారా లను నాశనం చేస్తున్నారు. మీరు, నేను దేశం కోసం ఏం చేస్తున్నాం? భవిష్యత్ తరాలకు మనం ఏమి ఇవ్వాలనుకుంటున్నాము? కాంగ్రెస్‌ను దుర్భాషలాడడం తప్ప మోడీ దగ్గర వేరే సమాధానాలు లేవు అని ఆయన అన్నారు. నేడు ఎన్నికల సంస్థలు కూడా వారి నియంత్రణలోకే వెళ్లాయి. ప్రభుత్వం ప్రతిదానిలో జోక్యం చేసుకుంటూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఎన్నికల్లో మోసాలు జరుగుతు న్నాయి. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో.. ప్రపంచ ంలోని అభివ ృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్‌పేపర్స్ వైపు మళ్లాయి. ప్రపంచంలో ఈవీఎంలు ఎక్కడా అందుబాటులో లేవు. దేశంలో 140 కోట్ల మంది ప్రజాస్వామ్యాన్ని నమ్ముతారు. ఇప్పుడో లేక తరువాతో.. ఈ దేశ యువత మనకు ఇవిఎంలు వద్దు.. బ్యాలెట్ పేపర్లు కావాలని నినదిస్తారు అని ఖర్గే అన్నారు.

భారత్‌పై అమెరికా 26 శాతం పన్నులను విధించింది. ఈ విషయంపై పార్లమెంటు చర్చించనీయలేదు. ముఖ్యమైన ప్రజా సమస్యలను చర్చించడానికి బదులుగా.. ప్రభుత్వం పార్లమెంటులో మత విభజన గురించి చర్చించింది. దీనికోసం తెల్లవారుజామున 3-4 గంటల వరకు చర్చలు నిర్వహించింది. మణిపూర్ వంటి అంశాలపై ఉదయం 4.40 గంటలకు ప్రారంభమైంది. ఆరోజు మణిపూర్ అంశంపై మేము తరువాత రోజు మాట్లాడతామని అమిత్‌షాకు చెప్పాము. దీంతో ఈ విషయంపై మమ్మల్ని చర్చకే అనుమతించలేదు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ నేతలు ఇలాంటివి చేస్తున్నారు అని ఖర్గే విమర్శించారు.

హనుమాన్ జయంతికి భద్రత కట్టుదిట్టం

మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఏర్పాట్లు

ప్రభుత్వ అధికారులు, నిర్వాహకులతో సమన్వయ సమావేశం



నవతెలంగాణ- సిటీబ్యూరో

ప్రశాంత వాతావరణంలో శ్రీరామ నవమి శోభయాత్ర పూర్తి కావడంతో ఇక హనుమాన్ జయంతి వేడుకలపై పోలీసులు దృష్టిసారించారు. ఈనెల 12న హనుమాన్ జయంతి సందర్భంగా జరిగే శ్రీవీర హనుమాన్ విజయయాత్ర ఏర్పాట్లపై హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు మూడు పోలీస్ కమిషనరేట్ పరిధిల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్ వివిధ ప్రభుత్వ శాఖలతోపాటు హనుమాన్ విజయయాత్ర నిర్వాహకులతో మూడు పోలీస్ కమిషనరేట్ల అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో హనుమాన్ జయంతి వేడుక నిర్వహించే విధంగా పలు సూచనలు, సలహాలతోపాటు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో శ్రీవీర హనుమాన్ విజయయాత్ర నిర్వహించాలని కోరారు. విజయయాత్ర సందర్భంలో ఎవరైనా కొత్త వారు వచ్చి చేరితే, వారిపై దృష్టిసారించడంతోపాటు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరేగింపు సమయంలో నిర్వాహకులు సంయమనంతో ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సూచించారు. నిర్వాహకులు విగ్రహాల ఎత్తు విషయంలో ముందే జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఎవరైనా రైల్వే బ్రిడ్జ్ కన్నా ఎక్కువ ఎత్తు విగ్రహాలు పెట్టినచో వేరే మార్గం ద్వారా పంపిస్తామన్నారు. ఊరేగింపులో డీజే సిస్టమ్‌లను ఉపయోగించకపోవడమే మేలన్నారు. నిర్వాహకులు రోప్ పార్టీ సభ్యులకు(వాలంటీర్లకు) సరైన శిక్షణ ఇచ్చి వారిని వినియోగించుకోవాలని అన్నారు. వాలంటీర్లను ఎక్కువ సంఖ్యలో పెట్టుకోవాలని సూచించారు. నిర్దేశించిన రూట్‌లోనే వెళ్తే ఎలాంటి సమస్యలూ తలెత్తవన్నారు. పోలీసు శాఖ ముందస్తు అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించరాదన్నారు. హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో సుమారు 150 విజయ యాత్రలు తీస్తుండగా, సైబరాబాదు, రాచకొండ పరిధిలో 46 విజయ యాత్రలు తీస్తున్నారని, ఇవన్నీ ప్రధాన యాత్రలో కలుస్తాయని వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని, రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, జాయింట్ సీపీ జోయల్ డెవిస్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

నగరంలో విజయ యాత్రకు 17000 మంది పోలీసులు

హైదరాబాద్‌లో ప్రధాన విజయ యాత్ర ఊరేగింపు రామ మందిరం గౌలిగూడ నుంచి ప్రారంభమై నారాయణగూడా, ఆర్‌టిసి చౌరస్తా, అశోక్‌నగర్, కవాడిగూడా, బైబిల్ హౌస్ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ వరకు దాదాపు 12.2 కిలోమీటర్లు జరగనుంది. ఈ మార్గాన్ని అధికారులు పరిశీలించారు..

బడ్జెట్‌లో పోకో నుంచి పోకో సి71

నవ తెలంగాణ - హైదరాబాద్

స్మార్ట్ ఫోన్ ఉత్పత్తుల కంపెనీ పోకో తన కొత్త పోకో సి71ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల చేసింది. బుధవారం హైదరాబాద్‌లో దీనిని పోకో ఇండియా కంట్రీ హెడ్ హిమాన్షు టాండన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిమాన్షు మీడియాతో మాట్లాడుతూ.. 4జిబి ర్యామ్, 64జిబి స్టోరేజ్ కలిగిన పోకో సి71 ధరను రూ.6,499గా, 6జిబి, 128 జిబి వేరియంట్ ధరను రూ.7,499గా నిర్ణయించామన్నారు.

లోకో పైలట్లకు విరామం కుదరదు

భోజనం, కాలకృత్యాలకు బ్రేక్ సాధ్యం కాదు

తేల్చి చెప్పిన రైల్వే బోర్డు

ఉద్యోగ సంఘాల ఆగ్రహం





జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న లోకో పైలట్లు

న్యూఢిల్లీ : విధి నిర్వహణలో ఉండగా భోజనానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి కొంత విరామం ఇవ్వాలంటూ లోకో పైలట్లు చాలా కాలంగా చేస్తున్న డిమాండ్‌ను రైల్వే బోర్డు తోసిపుచ్చింది. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసులకు ఆమోదం తెలుపుతూ డ్యూటీలో ఉన్న సమయంలో విరామం ఇవ్వడం సాధ్యపడదని స్పష్టం చేసింది. మానవ తప్పిదాల కారణంగా దేశంలో అధిక సంఖ్యలో రైలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న తరుణంలో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

లోకో క్యాబిన్‌లో సిబ్బంది మాటలు, చేతలను రికార్డు చేసే వ్యవస్థ ఏర్పాటును కూడా బోర్డు సమర్థించుకుంది. ఇది గోప్యతకు భంగకరం కాదని తేల్చింది. ఏదైనా సంఘటన జరిగితే దాని తర్వాత జరిగే విశ్లేషణలో సిబ్బందికి సహాయపడేందుకు, మద్దతుగా నిలిచేందుకు ఈ వ్యవస్థ ఉపకరిస్తుందని తెలిపింది.

'ఇది సిబ్బందిపై ఎలాంటి అదనపు పనిభారం మోపదు. నిర్వహణా సామర్థ్యాన్ని పెంచేందుకు, రైళ్లు సురక్షితంగా నడిచేందుకు ఈ వ్యవస్థ ఒక సాధనం మాత్రమే' అని జోనల్ రైల్వేల జనరల్ మేనేజర్లకు పంపిన సమాచారంలో రైల్వే బోర్డు తెలియజేసింది. రైల్వే బోర్డు, రైల్వేల పరిశోధనా విభాగమైన రిసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్ఓ)కు చెందిన ఐదుగురు సభ్యుల క్రమశిక్షణ కమిటీ చేసిన సిఫారసు మేరకు హై-స్పీడ్ రైళ్ల వేగాన్ని గంటకు 110 కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్లకు పెంచింది. తాము రైళ్లలో అసిస్టెంట్ లోకో పైలట్లను నియమించాలన్న సిఫారసుకు కూడా ఆమోదం తెలిపింది.

ఆమోదయోగ్యం కాదు

కాగా రైల్వే బోర్డు నిర్ణయాన్ని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఖండించింది. ఇది వాస్తవ దూరంగా ఉన్నదని, నిరాధారమైనదని విమర్శించింది. ఈ మేరకు అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ కేసీ జేమ్స్ రైల్వే బోర్డు ఛైర్మెన్‌కు లేఖ రాశారు. రైళ్ల వేగం పెంచితే లోకో పైలట్లపై పడే పని ఒత్తిడిని అంచనా వేయడంలో కమిటీ విఫలమైందని తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు లోకో పైలట్లకు విరామాన్ని నిరాకరించడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. లోకోమోటివ్స్‌లో టాయిలెట్ సౌకర్యం లేదని గుర్తు చేశారు. అనేక సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆరేడు గంటల పాటు ఎక్కడా ఆగకుండా ప్రయాణిస్తాయని అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.బాలచంద్రన్ చెప్పారు. 'న్యూఢిల్లీ-చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు రాత్రి 11.10 గంటలకు విజయవాడ చేరుతుంది. మరునాడు ఉదయం 6.35 గంటలకు చెన్నై చేరే వరకూ అది ఎక్కడా ఆగదు. అలాంటి పరిస్థితులలో మహిళా పైలట్ల ఇబ్బంది మరింత దుర్భరంగా ఉంటుంది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను అత్యవసర పరిస్థితిలో తప్ప మధ్యలో ఏదో ఒక స్టేషన్‌లోనో లేదా వేసైడ్ స్టేషన్‌లోనే ఆపడం కుదరదు' అని ఆయన తెలిపారు. లోకో పైలట్ మార్గమధ్యలో ఏదో తింటేనో లేదా కాలకృత్యాలు తీర్చుకుంటేనో తప్ప అప్రమత్తంగా ఉండలేడని రామచంద్రన్ చెప్పారు. లోకో పైలట్ల సుదీర్ఘ పని గంటలను, వారి పని పరిస్థితులను సమీక్షించాలని అనేక సిఫారసులు ఉన్నాయని తెలిపారు. లోకో క్యాబిన్లలో సిబ్బంది మాటలు, చేతలను రికార్డు చేయడం వారి గోప్యతను భంగపరచడం తప్ప మరేమీ కాదని అన్నారు. ఇది వారిని శిక్షించడానికి ఉపయోగించే వ్యవస్థ అని రామచంద్రన్ ఆరోపించారు. లోకో పైలట్లు బుధవారం జంతర్‌మంతర్ వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు.

కేంద్రమంత్రి మనవరాలు దారుణ హత్య

నాటు తుపాకీతో కాల్చిచంపిన భర్త



జితన్ రామ్ సుష్మా దేవి

గయ : కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ మనవరాలు సుష్మా దేవి దారుణ హత్యకు గురయ్యారు. ఆమె భర్తే నాటు తుపాకీతో కాల్చిచంపాడు. బీహార్‌లోని గయా జిల్లాలోని తెతౌ గ్రామంలో బుధవారం పిల్లలు, సోదరి పూనమ్ కుమారితో ఇంట్లో ఉన్న సమయంలో సుష్మాదేవి హత్య జరిగింది. పూనమ్ కుమారి పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం పని మీద పాట్నా వెళ్లిన సుష్మా దేవి భర్త రమేష్ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి తిరిగివచ్చాడు. ఈ తరువాత భార్యభర్తల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో రమేష్ నాటు తుపాకీ తీసుకుని సుష్మా దేవిపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ శబ్దం విని వేరే గదిలో ఉన్న పూనమ్, పిల్లలు అక్కడకు వచ్చారు. అయితే తీవ్ర గాయలతో రక్తపు మడుగులో సుష్మా పడి ఉంది. ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. స్థానికులు కూడా అక్కడకు చేరుకున్నారు. అయితే కాల్పులు జరిపిన తరువాత రమేష్ భర్త అక్కడ నుంచి పారిపోయాడు.

మృతురాలు సుష్మ వికాస్ మిత్రాగా పనిచేస్తున్నారు. బీహార్ మహాదళిత్ వికాస్ మిషన్ కింద అభివృద్ధి కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి, సమాజానికి మధ్య వారధిగా పనిచేయడం వికాస్ మిత్రాల విధి. రమేష్ పాట్నాలో ఒక ట్రక్కు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరికి 14 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరివి వేర్వేరు కులాలు. రమేష్‌ను పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు గయ సీనియర్ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) ఆనంద్ కుమార్ తెలిపారు. సంఘటనా స్థలంలో ఫోరెన్సిక్ బృందం, సాంకేతిక నిపుణులు ఆధారాలను సేకరిస్తున్నారని, విచారణ కొనసాగుతోందని చెప్పారు. కాగా, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ ఇప్పటి వరకూ ఈ ఘటనపై స్పందించలేదు. గయ లోక్‌సభ స్థానం నుంచి జితన్ రామ్ మాంఝీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మోడీ మంత్రి వర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్యతర పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్) వ్యవస్థాపకులే మాంఝీ. ఇది ఎన్డీఏలో భాగస్వామి పార్టీగా ఉంది.



లక్నోలో కదంతొక్కిన కరెంటోళ్లు

డిస్కంల ప్రయివేటీకరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్


మే 29 నుంచి నిరవధిక సమ్మె

యూపీ సర్కార్‌పై తిరుగుబాటు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉత్తర్‌ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యానాథ్ సర్కార్‌పై విద్యుత్ ఉద్యోగులు తిరుగుబాటు ప్రకటించారు. రాష్ట్రంలోని పూర్వాంచల్, దక్షిణాంచల్ విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) ప్రయివేటీకరణ ప్రయత్నాలను తక్షణం మానుకోవాలని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం రాజధాని లక్నోలో విద్యుత్ కర్మచారి సంయుక్త సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆలిండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ (ఏఐపీఈఎఫ్) చైర్మెన్ శైలేంద్ర దూబే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు లక్నో రోడ్లపై యోగి సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కదం తొక్కారు. తెలంగాణ నుంచి ఏఐపీఈఎఫ్ శాఖ నాయకులు పీ రత్నాకరరావు, సదానందం తదితరులు పాల్గొన్నారు. యూపీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోని పక్షంలో మే 29 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు నిరవధికంగా విధులు బహిష్కరిస్తారని హెచ్చరించారు. ఏప్రిల్ 16 నుంచి 30వ తేదీ వరకు ప్రజా అవగాహన ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. మే 1వ తేదీ బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఎనిమిది రోజులు నిరాహార దీక్షలు చేస్తారు. ఈ సందర్భంగా యూపీలోని పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలకు డిస్కంల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వినతిపత్రాలు అందించి నిరసనలు తెలుపుతామని సంఘర్ష్ సమితి నాయకులు తెలిపారు. డిస్కంలు నష్టాల్లో ఉన్నందున వాటిని ప్రయివేటీకరించాలని యోగి సర్కార్ నిర్ణయించింది. దీనిపై విద్యుత్ ఉద్యోగులు భగ్గుమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే దేశవ్యాప్త నిరసనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.

'మండే' రోజూ పచ్చతోరణమే



డాక్టర్ ఆపరేషన్ థియేటర్లో అడుగు పెట్టాడు. ఆపరేషన్ టేబుల్ మీద పేషెంట్ పడుకొని సిద్ధంగా ఉన్నాడు. డాక్టర్ పక్కనే టేబుల్ మీద ఉన్న సర్జరీ కత్తి తీసుకొని పేషెంట్‌ని కసకసా పొడిచాడు. ఆపరేషన్ గదిలో ఉన్న తోటి డాక్టర్లు, నర్సులు హతాశులై, భీతావహులై చూస్తున్నారు. రక్తం ధారగట్టి టేబుల్‌పై నుంచి కిందకి జారి, ఆపరేషన్ గది బయటకు ప్రవాహం కట్టింది. 'ఆపరేషన్ సక్సెస్' అని పెద్దగా అరిచాడు డాక్టర్ ట్రంప్.

ఈ సోమవారం ప్రపంచ స్టాక్ మార్కెట్‌లో జరిగింది ఇదే. ట్రంప్ రక్తం పారించాడు. స్టాక్ మార్కెట్లన్నీ కుప్పకూలాయి. అమెరికా పెంచిన టారిఫ్ 9వ తేదీ నుంచి అమలవుతుందనగా, ఒకరోజు ముందే స్టాక్ మార్కెట్లకు గుండె పగిలింది. ఇండియాలోని స్టాక్ మార్కెట్ ఆ ఒక్క రోజే 14 లక్షల కోట్ల రూపాయలకు పైగా సంపదను పోగొట్టుకుంది. ట్రేడింగ్ జరిగిన ఆరు గంటల్లో గంటకి 2.5 కోట్ల లక్షల రూపాయల చొప్పున మదుపరుల సొమ్ము 'ట్రంపార్పణం' అయింది. కట్టిన ఇల్లు కూల్చడం చిన్న పనే కావచ్చు, కానీ ఆ ఇంటినే తిరిగి కట్టాలంటే ఏండ్లు పడతాయి. ఇప్పుడు స్టాక్ మార్కెట్‌లోని చిన్న, చిల్లర (రిటైల్) మదుపర్ల పరిస్థితి ఇదే. సోమవారం కోల్పోయిన మొత్తాన్ని తిరిగి పొందాలంటే ఎంత కాలం పడుతుందో?

స్టాక్ మార్కెట్లు కుప్పకూలినప్పుడు బాగా ఎక్కువ నష్టపోయేది చిన్న మదుపరులు మాత్రమే. తమ సంపాదనలో మిగిలిన/మిగిల్చుకున్న పొదుపుతో షేర్లు కొని అమ్మి కొంత లాభం సంపాదించాలని మధ్యతరగతి ఉద్యోగస్తులు, చిన్న దుకాణదారులు తాపత్రయపడతారు. ఆర్థిక వ్యవస్థ సజావుగా నడుస్తున్నప్పుడు వీరికి ఈ స్టాక్ మార్కెట్ 'జూదం' కొద్ది సంపాదన తెచ్చిపెడుతుంది. కానీ అది ఏమి మేడలు, మిద్దెలు కట్టేంత సంపాదన కాదు. కానీ ఇప్పుడు ట్రంప్ చేసిన టారిఫ్ నిర్వాకం వల్ల గాని, హర్షద్ మెహతా లాంటి వాళ్ళు చేసిన కుంభకోణాల వల్ల గాని మొదట కోలుకోలేనంత నష్టపోయేది ఈ చిన్న ఇన్వెస్టర్లే. తిరిగి మార్కెట్లు పుంజుకుని చూస్తే వీరు దివాలా తీసి ఉంటారు, వీరి సంపద షేర్ల రూపంలో బడా బాబుల జేబుల్లోకి చేరి ఉంటుంది.

'బ్లాక్ మండే', 'బ్లడ్ బాత్' వీటితో నాకేం పని అని, స్టాక్ మార్కెట్ జోలికే వెళ్ళను అని చాలామంది అనుకోవచ్చు. మీరు ఉద్యోగస్తులు అయితే మీ పీఎఫ్ డబ్బులు, మీ పెన్షన్ నిధులు, అదే మీరు చిన్నపాటి దుకాణదారులు, గృహిణులు అయితే చిన్న పొదుపు మొత్తాల పథకాల్లో దాచిపెట్టుకున్న సొమ్ము షేర్ మార్కెట్‌లో వాడటం జరుగుతుంది. స్టాక్ మార్కెట్ కుదేలై, నష్టాలు వస్తే మీ పీఎఫ్ మీద, చిన్న పొదుపు మొత్తాల మీద వడ్డీ రేట్లు తగ్గిస్తారు. ఆ విధంగా షేర్ మార్కెట్‌లో ప్రత్యక్షంగా సంబంధం లేని వారు కూడా ఆదాయం నష్టపోతారు.

ఇటువంటి స్టాక్ మార్కెట్ కుదుపులకుగాని, లేక కుప్పకూలినప్పుడు గానీ బడా పెట్టుబడిదారులకు వచ్చే నష్టం ఏమీ లేదు. ఎందుకంటే వారు అంతకుముందే తమ దగ్గర ఉన్న షేర్లను బ్యాంకుకు తనఖా పెట్టి, ఇంకో పరిశ్రమకు కావాల్సిన పెట్టుబడికి వాడుకుంటారు. తనఖాలో ఉన్న షేర్లు భారీగా నష్టపోతే, బ్యాంకులు భరించాల్సి వస్తుంది. పూర్తిగా నష్టపోతే ఉండనే ఉంది 'మోడీ రైట్ ఆఫ్'. బడా పెట్టుబడిదారులందరికి స్టాక్ మార్కెట్ సంక్షోభం చిన్న ఝలక్ మాత్రమే. వారు పెద్దగా చలించరు.

స్టాక్ మార్కెట్‌లో ఈ గందరగోళం జరుగుతున్న రోజునే అదానీ ముంబయిలో ఒక ఎకరం స్థలం రూ.170 కోట్లు పెట్టి కొంటున్నట్టు వార్త వచ్చింది. ఇంకొక వార్త, 'దివాళా పరిష్కారం'లో వున్న జయప్రకాష్ అసోసియేట్స్‌ను కొనటానికి 26 కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఇందులో అదానీ గ్రూప్, రిలయన్స్ గ్రూప్, వేదంతా, రామ్‌దేవ్ పతంజలి వున్నాయి. ఇప్పుడు జేపీ అసోసియేట్స్ షేర్ ధర రూ.3.90 పైసలు. అదైనా ఈ కంపెనీలు కొనటానికి పోటీ పడుతున్నాయనే వార్త వల్ల పెరగటమే. లేకపోతే రూ.3.25 మాత్రమే. ఎన్నిసార్లు షేర్ మార్కెట్ పతనమైనా, కుంభకోణాలు జరిగినా జేబుకు చిల్లి పడేది చిన్న మదుపరులకే. బడా పెట్టుబడిదారుల, దొరబాబుల జీవితం నిత్యకల్యాణం పచ్చతోరణంగా గడిచిపోతూనే ఉంటుంది.

- కర్లపాలెం



శ్రీకాంత్‌కు కన్నీటి వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

అంతిమయాత్ర కాల్వొడ్డులోని వైకుంఠధామం వరకు సాగింది. కుటుంబసభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ప్రజా నాట్య మండలి కళాకారులు శ్రీకాంత్‌కు నివాళి అర్పిస్తూ ఆడిపాడారు. అంతకు ముందు సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన శ్రీకాంత్ స్వగృహం అక్షయ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన సంతాప సభలో నేతలు మాట్లాడారు. శ్రీకాంత్ ఔన్నత్యాన్ని చాటుతూ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని ఆర్.అరుణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. మహాసభకు ప్రతినిధిగా హాజరైన శ్రీకాంత్‌తో 4వతేదీ ఉదయం తాను మాట్లాడానని, ఎంతో కలుపుగోలుగా వ్యవహరించేవారని గుర్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో విద్యార్థి ఉద్యమా భివృద్ధికి తోడ్పడ్డారని చెప్పారు. తాను ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు శ్రీకాంత్ సీపీఐ(ఎం) ఖమ్మం పట్టణ కార్యదర్శిగా ఉండేవారని, అప్పటి నుంచీ ఆయనతో తనకు మంచి అనుబంధం ఉండేదని స్మరించుకున్నారు. ఆయన కుటుంబం పార్టీ కోసం నిలబడిందని, ఇప్పుడు పార్టీ ఆయన కుటుంబానికి అండగా నిలబడాల్సిన అవసరముందని అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ తరపున నివాళి అర్పిస్తున్నట్టు ప్రకటించారు.

సీపీఐ(ఎం) అంటేనే 'యర్రా' కుటుంబం: తమ్మినేని వీరభద్రం

సీపీఐ (ఎం) అంటేనే 'యర్రా' కుటుంబం.. 'యర్రా' కుటుంబం అంటేనే సీపీఐ (ఎం) అనేలా ఆ కుటుంబం పార్టీతో పెనవేసుకుందని కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశాన్ని మతోన్మాద ప్రభావం నుంచి రక్షించాలని ఆలిండియా మహాసభ దిశా నిర్దేశం చేసిందన్నారు. వామపక్షాలను బలోపేతం చేయటం ద్వారానే అది నెరవేరుతుందని భావిస్తున్న దశలో శ్రీకాంత్ లాంటి పోరాటయోధుడు మన నుంచి దూరం కావడం బాధాకరమన్నారు. మతోన్మాదంపై మహాసభ తీర్మానంపై చర్చల్లోనూ శ్రీకాంత్ పాల్గొన్నారని గుర్తు చేశారు. శ్రీకాంత్‌తోపాటు ఆయన భార్య యర్రా సుకన్య పిల్లలు కుటుంబం అంతా పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తున్నారని తెలిపారు.

శ్రామికవర్గాల రాజ్యస్థాపన శ్రీకాంత్ లక్ష్యం : జాన్‌వెస్లీ

శ్రామికవర్గాల రాజ్యస్థాపనకు పనిచేసిన నేత యర్రా శ్రీకాంత్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. అన్ని వర్గాల కోసం పనిచేసిన నాయకుడు మరణం తీరని లోటని చెప్పారు. శ్రీకాంత్ మరణం పార్టీకి తీరని లోటని, ఆయన మృతికి సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ తరపున సంతాపం ప్రకటించారు. శ్రీకాంత్‌తో తమకున్న జ్ఞాపకాలను, ఆయన పోరాటాలను సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎం.సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ గుర్తు చేసుకున్నారు. శ్రీకాంత్ ఉద్యమ సైనికునిలా పనిచేశారని చెప్పారు.

సంతాప సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, పి.ప్రభాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, మచ్చా వెంకటేశ్వర్లు, భూపాల్, బుర్రి ప్రసాద్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.జె.రమేష్, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

శిశు జనన, మరణాల నమోదులో నిర్లక్ష్యం

చట్టాలను ఉల్లంఘిస్తున్న ఆస్పత్రులు

21 రోజుల్లో నివేదించాలని ఆర్‌జీఐ హెచ్చరిక

న్యూఢిల్లీ : అనేక ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రులు.. శిశువుల జనన, మరణాల ధ్రువీకరణ నమోదు ప్రక్రియ ఆలస్యం వహిస్తున్నాయి. వైద్య సంస్థలు చట్టాన్ని ఉల్లంఘిస్తూ, సార్వత్రిక నమోదును ఆలస్యం చేస్తున్నాయని తేలినట్టు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) పేర్కొంది. దీంతో ప్రయివేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో శిశువుల జనన, మరణాల నమోదు 21 రోజుల్లో నివేదించాలని వైద్య సంస్థల్ని హెచ్చరించింది. చాలా ఆస్పత్రులు శిశువుల సంబంధిత బంధువులను నేరుగా రిజిష్టర్ దగ్గరకు వెళ్లి నివేదించమని సలహా ఇస్తున్నాయని ఆర్‌జీఐ తెలిపింది. ఈ నమోదు ప్రక్రియలో వంద శాతానికి చేరుకోవాలనే లక్ష్యం నెరవేరలేదని.. కేవలం 90 శాతమే చేరుకున్నామని గత నెల (మార్చి 17 2025) ఆర్‌జీఐ కార్యాలయ సర్క్యులర్ పేర్కొంది.

శాశ్వత పరిష్కారం చూపండి

తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాకులకు శాశ్వత పరిష్కారం చూపిన తర్వాతే రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎం. రామేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉన్నత విద్యామండలి ముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నిర్వహిస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం రామేశ్వర్ రావు, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్ మాట్లాడుతూ కొంత మంది అధికారులు అదే విధంగా వైస్ ఛాన్సలర్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కోవర్ట్‌గా మారి ఆ పార్టీని నాశనం చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా చేరి యూజీసీ రూల్స్‌కి భిన్నంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా జీవో నెంబర్ 21ని తెప్పించారని ఆరోపించారు. ఈ జీవో చట్ట విరుద్ధమని వారు స్పష్టం చేశారు. ఇలాంటి వారి మాటలు నమ్మొద్దని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాము. యూనివర్సిటీలో రిక్రూట్మెంట్ జరిగితేనే నాక్ గ్రేడ్లు వస్తాయని ఒక బూటకపు అబద్ధాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయానికి 2024లో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిందనీ, అక్కడ పని చేసే రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్ 69 మంది కాగా 370 మంది కాంట్రాక్టు, పార్ట్ టైం టీచర్లేనని ఉదహరించారు. వెంటనే తమకు శాశ్వత పరిష్కారం చూపించాలనీ, రెగ్యులరైజేషన్ లేదా అబ్సర్షన్ రెండింటిలో ఏదో ఒకటి చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల అరెస్ట్ అక్రమం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విశ్వ విద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల అరెస్ట్ అక్రమమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో విమర్శించారు. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి వద్ద గురువారం నిరసన తెలిపేందుకు తరలి వచ్చిన వారిని పోలీసులు అక్రమకంగా అరెస్ట్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే వారికి ఉద్యోగ భద్రతతో పాటు యూజీసీ సెవెంత్ పే బేసిక్ ప్లస్ హెచ్ఆర్ఏ 3 ఇంక్రిమెంట్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1270 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

'ఉపాధి' ఎండమావి

రాజ్యాంగబద్ధమైన పనిహక్కుకు గుర్తింపునిచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకం తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా నిర్వీర్యమవుతున్నది. నైపుణ్యంలేని గ్రామీణ ప్రజల కోసం వామపక్షాల ఒత్తిడి మేరకు యూపీఏ-1 హయాంలో శ్రీకారం చుట్టిందే ఈ మహోత్తర పథకం. రెక్కాడితేగాని డొక్కాడని కోట్లాది శ్రమజీవుల పాలిట అన్నపూర్ణగా వెలుగొందిన ఈ పథకాన్ని చట్టంగా మార్చి రక్షణ కల్పించారు. కాగా ప్రస్తుతం, కేంద్రంలోని మోడీ సర్కారు ని'బంధ'నాల్లో చిక్కుకున్నది. ఆధార్ లింక్ పేరుతో కూలీల వేతనాలకు ఎసరుపెట్టింది.కొత్తగా తెచ్చిన మార్గదర్శకాల పేర జాబ్‌కార్డులను నిర్దాక్షిణ్యంగా రద్దుచేస్తున్నది. ప్రతిశ్రామికుడికి కాదనకుండా ఉన్న ఊళ్లోనే ఏడాదికాలంలో రోజుకు

> రాయితీల పేర కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు దాదాపు రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఉచితంగా వండివార్చిన మోడీకి ఛిద్రమవుతున్న నిరుపేదల బతుకులు కనపడటం లేదా? అని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. నిబంధనలను సడలించాలని డిమాండ్ చేస్తున్నాయి. చట్ట ప్రకారం పనిప్రదేశాల్లో నీడ, నీళ్లు, వైద్యం, శిశువులకు ఆయా సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా, నిర్లక్ష్యం చేయడంతో తెలం గాణలోని జహీరాబాద్ జిల్లాలో చాంద్‌బీ అనే మహిళా కూలీ ఎండకు ప్రాణాలు కోల్పోయింది. దీనికి బాధ్యులెవరు? దేశవ్యాప్తంగా కూలీలందరికీ పనులు కల్పించాలంటే ప్రతియేటా బడ్జెట్‌లో రూ.2.64 లక్షల కోట్లు కేటాయించాలి. కాగా 2022లో రూ.25 వేల కోట్లు, ఆ తర్వాత ప్రతియేటా వేల కోట్లు కోత పెట్టింది.

రూ.307 కనీసవేతనంతో వందరోజులు పని కల్పించడం లక్ష్యం. తద్వారా దేశంలో మౌలిక సదుపాయాల కల్పన, నీటి పొదుపు, కరువు నివారణ, వరదల నియంత్రణ తదితర పనులను శాశ్వత ప్రాతిపదికన చేయడం ఉపాధి హామీ చట్టం ప్రాథమిక ఉద్దేశ్యం.కానీ, బీజేపీ సర్కారు చట్టం మౌలిక సూత్రాలను దెబ్బతీస్తున్నది. రకరకాల నిబంధనల తీసుకొస్తూ, నిధులకు కోతపెడుతూ పేదల కడుపుకొడుతున్నది.



తెలంగాణలో గత మూడు నెలలుగా ఉపాధి శ్రామికులకు రూ.900 కోట్ల నుంచి రూ.1000 కోట్ల వరకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. కోటి జాబ్‌కార్డులకు గాను కేవలం 56.78 లక్షల మందికే పనులు చూపించడం గమనార్హం. అలాగే పథకాన్ని అమలు చేసే ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా గత ఉగాది పండుగ రోజున పస్తులుంచింది. కూలీల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)కి మ్యాపింగ్ చేస్తేనే వేతనాలు చెల్లిస్తామంటూ కండిషన్ పెట్టి కోట్లాది మంది ఉసురు పోసు కుంటున్నది. సంక్లిష్టమైన ఈ ప్రక్రియను చేయలేక కూలీల వెతలు అన్నీఇన్నీ కావు. కూలీల నోటికాడి అన్నం ముద్దను నిబంధనల పేర బీజేపీ లాగేసుకుంటున్నది. దేశంలో 25 కోట్ల జాబ్‌కార్డులకుగాను 12.88 కోట్ల మంది కూలీలకు పనులిస్తున్నట్టు సర్కారీ లెక్కల సారాంశం. అందులోనూ వివిధ సాకులు చెబుతూ 7.6 కోట్ల మంది జాబ్ కార్డులను రద్దుచేసి పేదలకు పనులు ఇవ్వకుండా మోడీ సర్కారు మోకాలడ్డిందని లిబ్‌టెక్ ఇండియా సంస్థ విశ్లేషణలో బట్ట బయలైంది. సగానికిపైగా ఉపాధి కూలీల బ్యాంక్ అక్కౌంట్లు ఎన్‌పీసీఐతో అనుసంధానం కాకపోయినా, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు కోట్ల మందికి ఉపాధి హామీని ఎండమావిగా మార్చింది.

ఆధార్‌కార్డులతో వేలిముద్రలు సరిపోలేదనో, అక్షర దోషాలున్నాయనో, వివరాలు పొరపాటుగా నమోదయ్యాయనో మ్యాపింగ్ జరగకపోతే ఆ సాంకేతిక సాకు చూపి కోట్లాది మంది నిరుపేదల కడుపు మాడ్చడం ఏ సంక్షేమానికి మచ్చుతునక? ఏ అభివృద్ధికి ఆనవాలు? సాంకేతికత సాకుతో 8.9 కోట్ల మంది యాక్టివ్ కార్మికుల్లో 1.8 కోట్ల మంది పని హక్కును, వేతనాల్ని పొందే అవకాశాన్ని కోల్పోతున్నారనేది ప్రజాసంఘాల విమర్శ. ఉపాధి హామీకి నిధులు పెంచుతామంటూ భీకర వాగ్దానాలు చేసిన బీజేపీ ప్రభుత్వం, ప్రతియేటా నిధులకు కోత పెట్టడం వాస్తవం కాదా? రాయితీల పేర కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు దాదాపు రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఉచితంగా వండివార్చిన మోడీకి ఛిద్రమవుతున్న నిరుపేదల బతుకులు కనపడటం లేదా? అని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. నిబంధనలను సడలించాలని డిమాండ్ చేస్తున్నాయి. చట్ట ప్రకారం పనిప్రదేశాల్లో నీడ, నీళ్లు, వైద్యం, శిశువులకు ఆయా సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా, నిర్లక్ష్యం చేయడంతో తెలం గాణలోని జహీరాబాద్ జిల్లాలో చాంద్‌బీ అనే మహిళా కూలీ ఎండకు ప్రాణాలు కోల్పోయింది. దీనికి బాధ్యులెవరు? దేశవ్యాప్తంగా కూలీలందరికీ పనులు కల్పించాలంటే ప్రతియేటా బడ్జెట్‌లో రూ.2.64 లక్షల కోట్లు కేటాయించాలి. కాగా 2022లో రూ.25 వేల కోట్లు, ఆ తర్వాత ప్రతియేటా వేల కోట్లు కోత పెట్టింది.

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లల్లోనూ ఉపాధి హామీ పనులు చేపట్టాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏఈడబ్ల్యుయూ) డిమాండ్ చేసింది. కేరళ తరహాలో కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులివ్వాలని కోరింది. ప్రతియేటా పెంచుతున్న కూలీ రేటు విషయంలోనూ కేంద్రం వివక్ష చూపిస్తున్నది. కొన్ని రాష్ట్రాల్లో రూ.26 పెంచి, తెలంగాణలో రూ. 7 మాత్రమే అధికం చేయడం ఏం దుర్మార్గం? కుటుంబం ప్రాతిపదిక కాకుండా మనిషికో జాబ్‌కార్డు ఇవ్వడం, క్యూబిక్ మీటర్ రేటు పెంచడం, ఏడాది పనిదినాలు 200 చేయడం, దినసరి వేతనం రూ. 600కు పెంచడం, నిరుద్యోగ భృతి చెల్లించాలనే డిమాండ్లు దీర్ఘకాలికంగా మోడీ సర్కారు అలక్ష్యం చేస్తున్నది. వీటిని పరిష్కరించాల్సింది పోయి, అసలు వేతనాలకు ఎగనామం పెట్టడం కూలీలపాలిట శాపంగా మారింది.

మారింది ప్రభుత్వమే.. విధానాలు కాదు!



పాలడుగు భాస్కర్
9490098033

"ప్రభుత్వాలను చూసి ప్రజలు భయపడకూడదు. ప్రజల్ని చూసి ప్రభుత్వాలు భయపడాలని" ఒక రచయిత చెప్తే, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రభుత్వాన్ని చూసి ప్రజలు, కార్మికులు, ఉద్యమకారులు ఎవరైనా సరే, భయపడాల్సిందేనన్న తీరుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, పట్టించుకోకపోతే నిరసనలు తెలపడం ప్రజల కనీస హక్కు. ఈ హక్కును గత సర్కార్ అణిచివేసిందనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. కానీ, గత పదిహేను నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాల్ని చూస్తే చెప్పిన నీతులకు, చేతలకు పొంతనేలేదని నిరూపితమైంది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగిన ధర్నాచౌక్ ఘటనలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు,మేనిఫెస్టో అంశాల్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశా, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, బీడీ, భవన నిర్మాణ, విద్యుత్ ఆర్టిజన్స్, మున్సిపల్, వీఆర్‌ఏలు ఉద్యమబాట పట్టారు. అసెంబ్లీలో తమ సమస్యలపై చర్చకు వస్తే, దానికో పరిష్కారమార్గం దొరుకుతుందని ఆశపడ్డారు. కానీ ధర్నాలు, నిరసనలపై గత ప్రభుత్వంవలే రేవంత్ సర్కార్ కూడా ఉక్కుపాదం మోపడం ప్రజాస్వామ్య పునరుద్ధరణగా ఇచ్చిన 'ఏడోగ్యారంటీ' ప్రశ్నార్థకంగా మారింది.

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. పనిప్రదేశంలో ఆరోగ్యకరమైన పరిస్థితులు కల్పించడం, ఉద్యోగ భద్రత, పనికి తగ్గ వేతనాలు చెల్లించడం, అక్రమ తొలగింపులు తదితర అంశాలపై కార్మిక చట్టాలు ఏర్పాటు చేసి హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని, మరింత మెరుగైన సేవలందించి కార్మికుల పక్షాన నిలుస్తుందని పదకొండవ అంశంగా స్పష్టంగా పేర్కొంది. దీంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అన్ని రంగాల్లో ఉన్న కార్మికులకు సమాన పనికి - సమాన వేతనం వచ్చేలా చర్యలు తీసుకుని, శ్రమ దోపిడీకి గురికాకుండా చర్యలు చేపడతామని చెప్పింది. ఆర్టీసీ ఉద్యోగస్తులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీతాలు చెల్లిస్తామని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చింది. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం లాంటి స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తిస్తామని, మున్సిపల్, గ్రామ పంచాయతీ, యూనివర్సిటీ, వైద్య ఆరోగ్య రంగాల్లో పనిచేసే వారికి వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని పేర్కొంది. భవన నిర్మాణ కార్మికుల బోర్డును పటిష్టం చేసి సామాజిక భద్రత కల్పిస్తామని, ఓనర్ కం డ్రైవర్ స్వయం ఉపాధి కోసం పని చేస్తున్న ఆటో డ్రైవర్‌కు రూ.50 వేలు వరకు, ఓనర్ కం డ్రైవర్ క్యాబ్ డ్రైవర్లకు రూ. లక్ష వరకు రుణమాఫీ చేస్తామని చెప్పింది. ఆటో అండ్ ప్రయివేటు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందిస్తామని, బీడీ



> 2025 మార్చి 22న కేంద్ర కార్మిక సంఘాలు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఇందిరా పార్కులో ధర్నాకు పిలుపునిచ్చిచ్చాయి. ఆ ధర్నాకు హైదరాబాద్‌లో అనుమతిచ్చి కొత్తగూడెం, ఇల్లందు, సంగారెడ్డి ప్రాంతాల్లో కార్మికులను అరెస్టులు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని, తమ గోడు ప్రభుత్వానికి విన్నవించుకోడానికి వచ్చిన ఆశాలను హైదరాబాద్ నడిరోడ్డుపై కర్కశంగా అణచివేశారు. పోలీసుల తోపులాటలో స్పృహ తప్పిపోయిన మహిళా కార్మికులకు వైద్య చికిత్స కూడా అందించలేదు. మార్చి 24న మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నాకు అనుమతిచ్చారు. కానీ ముందు రోజు మధ్యాహ్నం నుండే జిల్లాల్లో అరెస్టుల పర్వం కొనసాగించారు. రాష్ట్రంలో సీఎం ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా అక్కడ సీఐటీయూ నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారు.

కార్మికులందరికీ రూ.2 వేల పెన్షన్ ఇస్తామని వివరించింది. బీడీ కార్మికులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకువస్తామని, ఎస్ఎంఆర్ డైలీవేజ్ కన్సాలిడేటెడ్ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనంతో సహా ఇతర చట్టబద్ధ హక్కులను అమలు చేస్తామని, ఇప్పటికే పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని పేర్కొంది. అసంఘటితరంగ కార్మికులకు నగరాల్లో, పట్టణాల్లో నివాస వసతి, వారు నివసిస్తున్న కాలనీల్లో, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించి వాటిని తక్షణం ప్రాధాన్యం ప్రాతి పదికన పూర్తి చేస్తామని పేర్కొంది. ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం కొత్త చట్టాలు తెస్తామని, మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను సాధ్యమైనంత వరకు నైట్ షిఫ్ట్‌లలో పనిచేయకుండా నియంత్రించాలని యాజమాన్యాలపై ఒత్తిడి తెస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పీపుల్స్ మేనిఫెస్టోలో పేర్కొంది.

ఏడోగ్యారంటీపైనే ఉక్కుపాదం!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలల కాలం గడిచింది. ఎన్నికల సందర్భంగా వారిచ్చిన హామీలు కాగితాలకే పరిమిత మయ్యాయి. ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు ఈ కాలంలో వివిధ రంగాల కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులిచ్చారు. ముఖ్యమంత్రి, మంత్రులకు దండాలు పెట్టారు. అయినా వారికి ఫలితం దక్కలేదు. వారి సమస్యల పరిష్కారానికి పోరాట మార్గాన్నే ఎంచుకున్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమం చేపట్టారు. ఆ ఆందోళనలను బాధ్యతాయుతంగా పరిశీలించి వారి డిమాండ్లను పరిష్కరిం చాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఎన్నికల సందర్భంగా సోనియా గాంధీ ఆరు గ్యారంటీలకు హామీనిస్తే, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం వంటి ఏడో గ్యారంటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీనిస్తున్నానని స్వయంగా ప్రకటించారు. 2023 డిసెంబర్ 7న ఒకవైపు ప్రమాణ స్వీకారం చేస్తూనే మరోవైపు ప్రగతి భవన్‌కు గత ప్రభుత్వం వేసిన ముండ్లకంచెలను కూలగొట్టిస్తూ ప్రజాస్వామ్య పునరుద్ధరణ ప్రారంభమైందని ప్రకటించుకున్నారు. ఇటీవల కాలంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే అవి ఆదిలోనే అంతమైనట్లు కన్పిస్తున్నవి. 2025 మార్చి 21న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా హమాలీ, బీడీ, భవన నిర్మాణం, ప్రయి వేటు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ తదితర అసంఘటితరంగ కార్మికులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు అనుమతిస్తామని చెబుతూనే చివరి నిమిషంలో నిరాకరించారు. ఆరోజు రాత్రి రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు కార్మికుల ఇండ్లపై పడి అర్ధరాత్రి బలవంతంగా పోలీస్ స్టేషన్‌లకు లాక్కెళ్లారు. హైదరాబాద్ చేరుకున్న కొద్దిమందిని భయభ్రాంతులకు గురిచేశారు. ఇది అత్యంత అప్రజాస్వామిక చర్య. ఇది కార్మికుల హక్కులపై జరుగుతున్న దాడికి నిదర్శనం. ఈ ఘటన ముఖ్యమంత్రి గారు ఇటీవల రవీంద్రభారతిలో మీడియా సాక్షిగా మాట్లా డుతూ తమ పాలనలో ఉద్యోగులకు, కార్మికులకు, ప్రజలకు తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకునే హక్కును, స్వేచ్ఛను ఇచ్చామని, నాయకుల ఇండ్లకు వెళ్లి తలుపులు బద్దలు కొట్టి అరెస్టులు చేయడం తమ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకమని" చెప్పి ఒక్కరోజు కూడా గడవక ముందే జరగడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

అనుమతిలిస్తూ..అరెస్టులు చేస్తూ...

ఈ ఒక్క ఘటనే కాదు, ఇలాంటి ఘటనలు తెలంగాణలో అనేకం చోటుచేసుకున్నాయి. 2024 డిసెంబర్ 17న గ్రామ పంచాయతీ కార్మికులు ఇందిరా పార్కు వద్ద ధర్నా చేసుకునేందుకు పోలీసులు అనుమతిచ్చారు. కానీ ఇచ్చిన అనుమతిని అర్ధరాత్రి రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది పంచాయతీ కార్మికులను అక్రమంగా ముందస్తు అరెస్టులు చేశారు. రైతు సమస్యల మీద ఆందోళన చేసేందుకు అనుమతి కోరిన రైతు సంఘాలకు కార్యక్రమం నిర్వహణకు ముందు రోజు రాత్రి పొద్దుపోయిన తర్వాత అనుమతిచ్చారు. అప్పటికే రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. వీఆర్‌ఏలు ధర్నా చేసుకునేందుకు అనుమతి సైతం నిరాకరించారు. 2025 మార్చి 22న కేంద్ర కార్మిక సంఘాలు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఇందిరా పార్కులో ధర్నాకు పిలుపునిచ్చిచ్చాయి. ఆ ధర్నాకు హైదరాబాద్‌లో అనుమతిచ్చి కొత్తగూడెం, ఇల్లందు, సంగారెడ్డి

> గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన సాగిస్తానని చెప్పిన కాంగ్రెస్ ఆచరణలో గత ప్రభుత్వం లాగే కార్మిక పోరాటాలు, ఆందోళనలపై నిర్బంధం, ఆంక్షలు విధించడం దుర్మార్గం. రాజ్యాంగం ప్రకారం నిరసన తెలిపే హక్కు పౌరులుగా కార్మికవర్గానికి ఉంది. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత. ఈ విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కార్మికవర్గ పోరాటాల పట్ల వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలి. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్బంధాన్ని, ఆంక్షలను ఎత్తివేయాలి. గతంలో అంగన్‌వాడీ పోరాటాన్ని అణచివేసి, గుర్రాలతో తొక్కించి, లాఠీఛార్జీ చేయించిన టీడీపీ ప్రభుత్వాన్ని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి నియంతృత్వ పాలన సాగించిన బీఆర్ఎస్‌ను కార్మికవర్గం గడగడలాడించి గద్దె దించిన చరిత్ర కార్మికవర్గ పోరాటాలకు ఉంది. ఈ చరిత్రను తెలుసుకోవాలి. గత పాలకుల నుండి గుణపాఠం నేర్చుకోవాలి.

ప్రాంతాల్లో కార్మికులను అరెస్టులు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని, తమ గోడు ప్రభుత్వానికి విన్నవించుకోడానికి వచ్చిన ఆశాలను హైదరాబాద్ నడిరోడ్డుపై కర్కశంగా అణచివేశారు. పోలీసుల తోపులాటలో స్పృహ తప్పిపోయిన మహిళా కార్మికులకు వైద్య చికిత్స కూడా అందించలేదు. మార్చి 24న మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నాకు అనుమతిచ్చారు. కానీ ముందు రోజు మధ్యాహ్నం నుండే జిల్లాల్లో అరెస్టుల పర్వం కొనసాగించారు. రాష్ట్రంలో సీఎం ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా అక్కడ సీఐటీయూ నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. రాష్ట్రమంతా అసెంబ్లీ జరిగిన వారం,పది రోజుల పాటు సీఐటీయూ నాయకులతో పాటు కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేశారు. రాష్ట్రమంతా అన్ని జిల్లాల్లో పోలీస్ యాక్ట్-30ని అమలు చేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో సైతం ధర్నాలు, నిరసనలు నిషేధిస్తూ వైస్ చాన్స్‌లర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ అంశాలన్నీ తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

గతం నుంచి గుణపాఠం నేర్వరా?

గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన సాగిస్తానని చెప్పిన కాంగ్రెస్ ఆచరణలో గత ప్రభుత్వం లాగే కార్మిక పోరాటాలు, ఆందోళనలపై నిర్బంధం, ఆంక్షలు విధించడం దుర్మార్గం. రాజ్యాంగం ప్రకారం నిరసన తెలిపే హక్కు పౌరులుగా కార్మికవర్గానికి ఉంది. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత. ఈ విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కార్మికవర్గ పోరాటాల పట్ల వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలి. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్బంధాన్ని, ఆంక్షలను ఎత్తివేయాలి. గతంలో అంగన్‌వాడీ పోరాటాన్ని అణచివేసి, గుర్రాలతో తొక్కించి, లాఠీఛార్జీ చేయించిన టీడీపీ ప్రభుత్వాన్ని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి నియంతృత్వ పాలన సాగించిన బీఆర్ఎస్‌ను కార్మికవర్గం గడగడలాడించి గద్దె దించిన చరిత్ర కార్మికవర్గ పోరాటాలకు ఉంది. ఈ చరిత్రను తెలుసుకోవాలి. గత పాలకుల నుండి గుణపాఠం నేర్చుకోవాలి. ప్రజా, కార్మికోద్యమాలను గౌరవించి సమస్యల్ని పరిష్కరించాలి. రేవంత్‌రెడ్డి సర్కార్ ఇకనైనా తీరు మార్చుకోవాలి. లేకపోతే కార్మికవర్గం ప్రభుత్వాన్నే మార్చగలదు. తస్మాత్ జాగ్రత్త!

మెయిల్ @ నవతెలంగాణ

ప్రయాణ...ప్రయాస

రైల్వే ప్రయాణం సామాన్యుకి అందనంత దూరమవుతున్నది. ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలన్నా ఆన్‌లైన్‌లో చాలామంది టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు. ఇది తెలియని సామాన్య పేదలు అనేక అవస్తలు పడుతున్నారు. స్టేషన్‌కు వెళ్లి టికెట్ తీసుకుందాంటే దొరుకుతుందో లేదో, టిక్కెట్ తీసుకునేలోపే రైలు బండి వెళ్లిపోతుందో అనే సందేహాలు నెలకొన్నాయి. రైల్వేస్టేషన్‌లో ఎక్కడచూసినా కౌంటర్ దగ్గర పెద్ద క్యూ లైన్ ఉంటుంది. సరిపోనన్ని కౌంటర్లు ఉండవు. అక్కడ కొంతమందికే ముందుగా టికెట్స్ దొరుకుతాయి. జనాలను కంట్రోల్ చేసేందుకు రైల్వే పోలీసులు ఉండరు. మరి స్త్రీల పరిస్థితి చెప్పనలవి కాదు. స్టేషన్లలో అద్భుతమైన సౌకర్యాలను చదవడానికి బాగుంటాయి. ఉన్నోడు గొంతు తడుపుకోడానికి బాటిల్ నీరు కొనుక్కుంటాడు. సామాన్యునికి తాగునీరు నల్లాలుంటాయి. మంచిదే ! కానీ వచ్చే నీరు మంచిదో, కాదో? మనకంటే తాగినవారికి బాగా తెలుస్తుంది! చల్లని నీరు సౌకర్యం కల్పించాం కదా? అని కొంత మంది వాదించవచ్చు. అందరికీ ఇవి సరి పోతాయా? పొట్ట నింపుకోడానికి ఏది కొందామన్నా స్పెషల్ ధరలు. ఒకవేళ అడిగితే కొంటే కొను! లేకపోతే పో! అనే చూపులని మనం చూడడమే తప్ప ఏమీ చేయలేము. ఎవరికి చెప్పాలి? అంత తీరుబాటు ఉంటుందా? ప్లాట్‌ఫామ్ మీద కొన్నిసార్లు పులిసిపోయిన , పాడైపోయిన ఆహారం అమ్ముతారు. తినాల్సిందే తప్పదు! ఆకలికి ఏదో ఒకటి తినాలి కదా! ధరలు మాత్రం చాలా ఫ్రెష్‌గా ఉంటాయి. మూత్రానికి వెళ్లాలన్నా ' పే అండ్ యూజ్ ' అనే బోర్డులు కనిపిస్తాయి. దీనర్థం తెలియని సాధారణ ప్రయాణికునికి అక్కడికి వెళ్లేవరకూ వరకూ తెలియదు. దీనికి కూడా రుసుము చెల్లించాలా? అని! ఉచిత మూత్రశాలల గురించి చెప్పనవసరం లేదు! చెప్పనలవి కాదు ! అందుకే చాలా మంది బహిరంగ మల మూత్ర విసర్జన చేస్తారు.కొన్ని స్టేషన్లలో రైలు బండి వచ్చే ముందు మాత్రమే అనౌన్స్ చేస్తారు. బోగీ సంఖ్యని ప్రదర్శించే బోర్డు ఉండదు. బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియదు. జనరల్ బోగీ కోసం సామాన్యుడు పరుగులు పెట్టాల్సిందే. తప్పదు! ఎందుకంటే సామాన్యుడు పేదవాడు కదా! ఇటువంటి పరిస్థితుల్లో కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా బండి తప్పిపోయిన వారెందరో? ఈ పరుగు పందెంలో ఒక్కోసారి చనిపోయిన సందర్భాలూ లేకపోలేదు. సామాన్యుని వెతలు తీరాలంటే పాలకులు కూడా వారి స్థానంలో ఉండి ఆలోచించాలి. అప్పుడే సమస్యలకు కొంతైనా పరిష్కారం ఉంటుంది.

- జనక మోహన రావు దుంగ,
8247045230

వి.రాంభూపాల్

ఆర్థిక సంక్షోభం-ఐఐటిల్లో ఉపాధి తగ్గుముఖం

దేశంలోని 23 ఐఐటిల్లో క్యాంపస్ సెలక్షన్లు తగ్గడంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తాజా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటిల్లోనూ ప్లేస్‌మెంట్లు గణనీయంగా తగ్గాయని ఈ నివేదిక తెలిపింది. 2021-22లో 98.54 శాతం ఉన్న ప్లేస్‌మెంట్లు 2023-24 నాటికి 79.88 శాతానికి తగ్గాయి. ఇందులో దేశ రాజధాని ఢిల్లీ ఐఐటి లో 15 శాతం, ఆర్థిక రాజధాని ముంబయిలో 12.72, మద్రాసులో 12.42, కాన్పూర్‌లో 11.15 శాతం మేర తగ్గిపోవడం తీవ్ర ఆందోళనకరమని నివేదిక అభిప్రాయపడింది. ఈ పరిస్థితి కొత్తగా స్థాపించిన ఐఐటిలకే పరిమితం కాలేదని, 2015కు ముందు నుండి వున్న వాటిల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ప్రకటించింది. పరిస్థితిని వివరించిన స్టాండింగ్ కమిటీ ఇది సాధారణమేనంటూ, ఈ క్షీణతను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టాలంటూ సూచనలతో సరిపుచ్చింది. దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యాలయాలుగా వున్న ఐఐటి, ఎన్ఐటిలలో చదువుకున్న వారికే ఉద్యోగాలు రాకపోతే ఇతర ఇంజనీరింగ్ విద్యార్థుల పరిస్థితి ఏమిటి? ఈ పరిస్థితులకు కారణాలేమిటి? యువతకు ఉపాధి చూపే పరిష్కారాలు ఏమిటని కేంద్ర పాలకులు ఆలోచించడంలేదు. మరోవైపు ఐటి రంగంలో కొత్త కంపెనీలు రావడంలేదని, ఉన్నవే మూత పడుతున్నాయని సేవా రంగాల రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజా నివేదిక ప్రకటించింది.ప్లేస్‌మెంట్లు ఎందుకు లేవు? అంటే ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గడం. అవి ఎందుకు తగ్గాయంటే యూరప్, అమెరికాతోపాటు మన దేశ ఆర్థిక వ్యవస్థల సంక్షోభం కారణం. సంక్షోభం ఎందుకు వచ్చిందంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం, దీనికి మూలం అత్యధికమంది ఆధారపడిన వ్యవసాయం దివాళా తీయడం. లక్షల మందికి ఉపాధినిచ్చిన ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడం, కొత్త పరిశ్రమలను స్థాపించకపోవడం, దేశీయ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించకుండా అదానీ, అంబానీలను పెంచి పోషించడం. వీటి ఫలితంగా కోట్లాది యువత నిరుద్యోగంలో కూరుకుపోతుంటే, అతి కొద్దిమంది అత్యంత సంపన్న బిలియనీర్లుగా ఎదుగుతున్నారు. ఈ వాస్తవాలను ప్రజలు గుర్తించకుండా ఉండేందుకు మొన్నటి వరకు మహా కుంభమేళా, తాజాగా అమెరికా అధ్యక్షుడు మోడీని పొగిడిన వార్తలతో మీడియా హోరెత్తిస్తున్నది.

ఇంజనీరింగ్ క్రేజ్

1991 తర్వాత అనుసరించిన ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా ఇంజనీరింగ్ విద్యకు కొత్త క్రేజ్ వచ్చింది. ఇంజనీరింగ్ పూర్తయితే చాలు, ఐటి రంగంలో ఉద్యోగం, లక్షల వేతనం గ్యారంటీ అనే ప్రచారం పెద్ద ఎత్తున సాగింది. దీంతో ఇంజనీరింగ్ కోర్సులో చేరుతున్న విద్యార్థుల్లో అత్యధికమంది కొన్నేళ్ళుగా కంప్యూటర్స్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి విభాగాల్లో చదవడం పెరిగింది. రెండేళ్లుగా కంప్యూటర్ సైన్స్‌లో 85 శాతం పైగా సీట్లు భర్తీ అవుతుంటే, మెకానికల్‌లో 40-45 శాతం, సివిల్‌లో 25-30 శాతం సీట్లు కూడా భర్తీ కావడంలేదు. సాంకేతిక రంగంలో పరిశోధనలు గణనీయంగా తగ్గాయి. గత రెండు దశాబ్దాలుగా మన దక్షిణాది రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ విద్య అనేది ఒక దర్జాగా మారింది. 2022 నాటికి దేశవ్యాప్తంగా 12,47,667 బీటెక్ సీట్లు ఉంటే దక్షిణాది రాష్ట్రాల్లోనే 6,74,697 సీట్లు ఉన్నాయి. ఎంసీఏలో 70,065 సీట్లు వుంటే 30,812, ఎంబిఏ, పిజిడిఎం లాంటి మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించిన కోర్సుల్లో కూడా ఎక్కువ భాగం దక్షిణాది రాష్ట్రాల్లోనే వున్నాయి. అందులో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో అత్యధిక భాగం వున్నాయి. గత ఐదేండ్లుగా సంవత్సరానికి సగటున 4 లక్షల మంది విదేశీ విద్యకు వెలుతుంటే అందులో దక్షిణాది రాష్ట్రాల నుండి 2.8 లక్షల మంది ఉన్నారని ఏఐసిటిఇ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి) అధ్యయనంలో తేలింది.

ఐటి రంగంలో కొలువుల కొరత

ఐటిలో తమ పిల్లల భవిష్యత్ బాగుటుందనే ఆశతో లక్షల రూపాయలు ఖర్చు చేసి తల్లిదండ్రులు, తీవ్ర ఒత్తిడితో పిల్లలు కష్టపడుతున్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఆభరణంగా



> ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే సంపదలో కార్మికుల వాటా పెద్ద ఎత్తున తగ్గింది. ప్రపంచ జనాభాలో 300 కోట్ల మంది దారిద్ర్యరేఖ కంటే దిగువన జీవిస్తున్నారు. మన దేశంలో వ్యవసాయం, తయారీ రంగాలు గత రెండు దశాబ్దాలుగా సంక్షోభంలో వున్నాయి. పెద్దనోట్ల రద్దు, కోవిడ్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీశాయి. పదకొండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ దగ్గర ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన ఆర్థిక ప్రణాళిక లేదు. మతాన్ని, రాజకీయాలను మిళితం చేసి ప్రజల ఐక్యతను చీల్చి అధికారంలో కొనసాగడం, అధికార బలంతో కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెట్టడం వారి విధానంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నత విద్యావంతులు వాస్తవాల్ని గుర్తించడం ముఖ్యం.

పిలవబడిన ఐటి రంగం మన దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారింది. 2004లో ఆరు లక్షల మంది సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పొందుతుంటే నేడు సుమారు పది లక్షలకు పైగా పెరిగింది. ఈ రంగం నుండి దేశ ఆర్థిక వ్యవస్థకు 1990లో 197 మిలియన్ల ఆదాయం రాగా, 2020 నాటికి 8వేల మిలియన్లకు పెరిగింది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీలో సేవా రంగం వాటా 55 శాతం వుంటుందని పాలకులు అంచనా వేశారు. అయితే గత మూడేండ్లనుండి ఈ రంగం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నది. ప్రపంచ ఐటి అవుట్ సోర్సింగ్‌లో మన దేశం కీలక స్థానంలో వుందని ఇన్నాళ్లు గొప్పగా చెప్పుకున్నాం. మొదట్లో ఐటి రంగం కాల్ సెంటర్లకే పరిమితమైంది. క్రమంగా ఆరోగ్య సంరక్షణ, విద్య, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసులు, ఫైనాన్స్, వినోదం ఇలా అనేక రంగాలకు ఈ సేవలు విస్తరించాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం 6-8 శాతం మాత్రమే ఐటి రంగం వృద్ధి అయ్యే అవకాశం వుందని సేవ రంగాల రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజాగా అంచనా వేసింది. గత ఐదేండ్లల్లో కొత్తగా స్థాపించబడిన ఐటి కంపెనీల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా పార్లమెంట్‌లో ప్రకటించింది.

2020లో 16,338 ఐటి కంపెనీలు వుంటే 2025 నాటికి 2,419 కి అంటే 90 శాతానికి తగ్గడం దేశీయ ఐటి రంగం పట్ల ఆశలతో వున్న కోట్లాది యువతను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. తాజాగా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ఆధారంగా కార్పొరేట్ దగ్గిజాలుగా పిలవబడుతున్న ఇన్ఫోసిస్, విప్రో వంటి కంపెనీలకు కేంద్రంగా వున్న బెంగళూరులో కొత్త ఐటి కంపెనీలు రావడంలేదు. కర్నాటకలో 2020లో కొత్త ఐటి కంపెనీలు 2,544 స్థాపించగా, 2025 మార్చి నాటికి 212కు, మహారాష్ట్రలో 2,483 నుండి 375కు, తెలంగాణలో 2,077 నుండి 233 తగ్గాయని మంత్రితత్వశాఖ నివేదిక తెలిపింది. ఇది కేవలం కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాలేదని, దేశమంతటా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ప్రకటించింది. కొత్త సంస్థలు రాకపోగా వున్నవి మూత పడడం ఈ రంగాన్ని మరింత కలవరపరస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో 2,300 కంపెనీలు మూతపడ్డాయి. వీటిలో మహారాష్ట్రలో 459, కర్నాటకలో 440 మూతపడడం ఈ రంగంలో వున్న సంక్షోభానికి పరాకాష్ట. 2023 ఆర్థిక సంవత్సరంలో 2.40 లక్షల మందికి ఐటి రంగం ఉపాధి కల్పించగా, 2024 నాటికి ఇందులో 40 శాతం అంటే లక్ష మందికి కూడా ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయింది. దేశంలోని ఐదు పెద్ద ఐటి కంపెనీల్లో 21,838 మంది ఉద్యోగాలను కోల్పోయినట్లు మంత్రతత్వ శాఖ నివేదిక తెలిపింది. ఐటి ఉద్యోగాలు తగ్గడమంటే దానితో ముడిపడిన ఈ అన్ని రంగాలు కష్టాల్లో వున్నట్లే. అందుకే క్యాంపస్ నియామకాలు తగ్గిపోతున్నాయి. ఎంపికైన వారికి సంవత్సరాలుగా ఉద్యోగాలు ఇవ్వడంలేదు. పనిలో వున్నవారికి వేతనాల పెంపుదల నామమాత్రంగా జరుగుతున్నది. ఇదిలా వుండగా 18 గంటల పనిదినం కావాలని, ఆదివారం శెలవు ఎందుకని ఐటి యాజమాన్యాలు బహిరంగంగానే ప్రకటి స్తున్నాయి. దీంతో ఐటి ఉద్యోగుల్లో ఆందోళన పెరిగింది. ఇటీవల బెంగళూరులో వేలాది టెకీలు రోడ్డు మీదకొచ్చి 'మేము బానిసలం కాదు, మాకు కుటుంబాలు వున్నాయి' అని గర్జించారు.

ఈ పరిస్థితికి కారణాలు

2025లో ప్రపంచ ఆర్థికాభివఅద్ధి రేటు 3.2 శాతానికి మించి వుండదని, అభివృద్ధి చెందిన యూరప్ దేశాలతో పాటు, అమెరికా 1 నుండి 1.78 శాతానికి మించి అభివృద్ధి సాధించలేవని ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు అంచనా వేశాయి. 46 దేశాల అభివృద్ధి మరింత కనిష్టంగా వుంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా 13 శాతం మంది యువజనులు అంటే 6 కోట్ల 49 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే సంపదలో కార్మికుల వాటా పెద్ద ఎత్తున తగ్గింది. ప్రపంచ జనాభాలో 300 కోట్ల మంది దారిద్ర్యరేఖ కంటే దిగువన జీవిస్తున్నారు. మన దేశంలో వ్యవసాయం, తయారీ రంగాలు గత రెండు దశాబ్దాలుగా సంక్షోభంలో వున్నాయి. పెద్దనోట్ల రద్దు, కోవిడ్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీశాయి. పదకొండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ దగ్గర ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన ఆర్థిక ప్రణాళిక లేదు. మతాన్ని, రాజకీయాలను మిళితం చేసి ప్రజల ఐక్యతను చీల్చి అధికారంలో కొనసాగడం, అధికార బలంతో కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెట్టడం వారి విధానంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నత విద్యావంతులు వాస్తవాల్ని గుర్తించడం ముఖ్యం.

5
నవతెలంగాణ
కరీంనగర్
గురువారం | ఏప్రిల్ 10, 2025 | www.navatelangana.com

ముందస్తు రాయితీ.. 'ఎర్లీ'గా పొందండి...



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎర్లీబర్డ్ స్కీం కింద ఆస్తిపన్ను చెల్లిస్తున్న ప్రజలు



కొత్త ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను చెల్లింపుపై 5శాతం రిబేట్

- ఈనెల 1నుంచి 30వ తేదీవరకూ మున్సిపాలిటీల్లో 'ఎర్లీబర్డ్' స్కీం అమలు
- ముందస్తు పన్ను చెల్లింపుదారులకు సదావకాశం
- మొన్నటి ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూళ్లలో చివరిరోజుల్లో ప్రత్యేక దృష్టిసారింపు
- గతంతో పోల్చితే రూ.10కోట్లు అదనంగా వచ్చినా.. పర్సేంటేజీలో 11శాతం వెనుకంజే!
- ఒక మున్సిపాలిటీ, పలు గ్రామాల విలీనంతోనే పెరిగిన పాపర్టీటాక్స్ లక్ష్యం
- కొత్త ఆర్థికసంవత్సరంలో 'ఎర్లీబర్డ్' స్కీమ్‌పై విస్తృత ప్రచారం

మున్సిపాలిటీలకు సాధారణ నిధి కింద వచ్చే నల్లా పన్నులతోపాటు దుకాణాల అద్దె, వర్తక పన్ను, వాణిజ్య ప్రకటలపై వచ్చే ఆదాయంతోపోలిస్తే ఆస్తిపన్ను ఎంతో కీలకం. మున్సిపాలిటీ నిర్వహణ ఖర్చుకు అవసరమైన సాధారణ నిధి సమీకరణ కోసం మున్సిపల్ శాఖ గతంలోగానే ఈసారి కూడా 'ఎర్లీబర్డ్'స్కీమును తీసుకొచ్చింది. ఈనెల 1 నుంచి 30వతేదీ వరకూ గడివిచ్చిన సదరు శాఖ ముందస్తు పన్ను చెల్లింపుదారులకు 5శాతం రాయితీని కల్పిస్తోంది. అయితే పన్నువసూళ్లలో ప్రత్యేకదృష్టిసారించిన కరీంనగర్ మున్సిపల్ శాఖ 2023-24కంటే 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.10కోట్లకుపైనే వసూలు చేయగలిగారు. అయితే కొత్తపల్లి సహా పలు గ్రామాల విలీనంతో పన్నువసూలులక్ష్యం పెరిగి గతం కంటే పర్సంటేజీలో వెనుకబడినట్టు కనిపిస్తోంది. ఏదేమైనా ఆస్తిపన్ను వసూలులో ప్రస్తుతం మున్సిపల్ అధికారులు ప్రత్యేకదృష్టిసారించి 'ఎర్లీబర్డ్' స్కీమును సద్వినియోగం చేసుకోవాలని కరీం'నగర' ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కొత్త ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలుపై మున్సిపల్ శాఖప్రత్యేకంగా దృష్టిసారించింది. ముందస్తుగా ఆస్తిపన్ను వసూలు చేసేందుకు ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి ఏడాదిలాగేనే ఈసారి కూడారాయితీని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పథకం ద్వారా ఆస్తిపన్ను క్రమం తప్పకుండా చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాఇయతీ ఊరట కల్పిస్తోంది. ఈ నెల 2 నుంచి నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఆస్తిపన్ను ముదింపు డిమాండ్ ఇంటి నెంబర్ల వారీగా మున్సిపల్ వెబ్‌సైట్‌లోకి వచ్చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అంటే మార్చి 2026 వరకు పన్ను మొత్తం చెల్లిస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండకపోగా.. చెల్లించే మొత్తంలో 5శాతం రాయితీ కల్పిస్తోంది.

అర్హులు వీరే.. ఈ నెల 30వరకే అవకాశం

2024-25 ఆర్థిక సంవత్సరంలో నివాస, నివాసేతర ఆస్తులపై ఎలాంటి బకాయిలు లేకుండా పన్ను పూర్తిగా చెల్లించిన వారు ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ఎర్లీ బర్డ్ పథకానికి అర్హులు. రాయితీ పొందాలనుకునే వారు గతేడాది తమ ఆస్తి పన్నును పూర్తిగా చెల్లించి ఈ ఏడాదికి సంబంధించి ముందస్తుగా చెల్లించినా రాయితీ ఇవ్వనున్నారు. పన్ను రాయితీ ఐదు శాతం కేవలం రాబోయే సంవత్సరానికి ముందుగా చెల్లించిన దానికిమాత్రమే వర్తిసుండటంతో ఈ అవకాశానికి ఈనెల 30వరకు గడువు విధించారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు 'ఎర్లీ బర్డ్' పథకం కింద పన్నులు స్వీకరిస్తున్నారు. ఐదు శాతం రాయితీని సద్వినియోగం చేసుకుని ముందస్తుగా పెద్దమొత్తంలో పన్నులు చెల్లించేవారిని అధికారులు సత్కరిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

ప్రచారం కల్పిస్తేనే ముందస్తు వసూళ్లు...

'ఎర్లీబర్డ్' స్కీంకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఇప్పటి నుంచే ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలి. గతేడాది సరైన ప్రచారం లేకపోవడంతో చాలా మందికి ఈ పథకం, రాయితీ విషయం తెలియక పన్నులు చెల్లించలేదు. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూలు మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సవాలుగా మారింది. ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లకు సీడీఎంఏ అధికారులు ఆదేశించారు. ఈ సారి పాత బకాయిలు ఉన్నవారికి సైతం ఈ పథకం వర్తిసోంది. పూర్తి బకాయిలు చెల్లించి ఈ ఏడాది పన్నులు చెల్లిస్తేనే ఈ పథకానికి అర్హులనే విషయాన్ని ప్రజల్లోకి 'ఎర్లీబర్డ్' ద్వారా తీసుకువెళ్లేందుకు మున్సిపల్ అధికారులు సమాయత్తమయ్యారు.

గతం కంటే ఈసారి రూ.10కోట్ల అదనపు వసూలు



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్నుల విషయం లో 2023-24 సంవత్సరంతో పోల్చితే 2024-25 ఆర్థిక సంవత్సరం అదనంగా రూ.10కోట్లు అద నంగా వసూలు చేశారు. అయితే ఇది పర్సంటేజీ పరంగా చూస్తే గత సంవత్సరం కంటే మొన్నటి ఆర్థిక సంవత్సరంలో 11శాతం తక్కువే వసూళ్లు కనిపిస్తున్నాయి. ఇందుకు కారణాలేకపోలేదు. ఈసారి కొత్తగా పక్కనే ఉన్న కొత్తపల్లి మున్సిపాలిటీ సహా మరో నాలుగు గ్రామాలు విలీనం చేయడంతో పన్నుల వసూలు డిమాండ్ గతం కంటేపెరిగంది. 202-24 ఆర్థిక సంవత్సరంలో రూ.34.83కోట్ల ఆస్తిపన్ను వసూలు డిమాండ్‌గా ఉండగా.. రూ.31.78కోట్లు కలెక్షన్ అయింది. వసూలులో ఇంకా రూ.3.05కోట్లు రావాల్సి ఉండగా.. లక్ష్యంలో 91.24శాతం వసూలు చేశారు. అదే 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఆస్తిపన్ను వసూలు డిమాండ్ ఏకంగా రూ.52.45కోట్లుకాగా.. అందులో రూ.41.96కోట్లు వసూలు చేయగలిగారు. ఇంకా రూ.10.49కోట్లు బ్యాలెన్స్ ఉన్నప్పటికీ లక్ష్యంలో 80.1శాతం చేరుకోవడం గమనార్హం. ఈలక్ష్యసాధనలో ఆర్థిక సంవత్సరం చివరి రోజుల్లోనే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మొండ బకాయిదారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. మొండి బకాయిదారుల ఇండ్లు, సంస్థలకు వెళ్లి రెడ్ నోటీసు ఇచ్చి, నల్లా కనెక్షన్లు తొలగించి, ఆస్తులు సీజ్ చేశారు. ప్రభుత్వ సంస్థ నుంచి రూ.కోట్లలో బకాయిలు ఉండటంతో వాటిపైనా దృష్టిసారించి ఆస్తులు సీజ్ చేశారు. దీంతోచివరి వారం రోజులు కలెక్షన్ అనూహ్యంగా పెరిగింది. మార్చి 31 ఒక్కరోజే అర్ధరాత్రి వరకు సుమారు రూ.4కోట్ల వరకు వసూలు కావడం గమనార్హం.

'ఎర్లీబర్డ్'ను సద్వినియోగించుకోవాలి

- చాహాత్‌బాజ్‌పాయ్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్



ముందస్తుగా పన్నులు చెల్లించేవారికి 'ఎర్లీబర్డ్' స్కీం కింద ప్రభుత్వం అందిస్తున్న ఐదుశాతం రిబేటును ఇండ్లు, దుకాణాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. గడువు దాటితే వడ్డీతో చెల్లించాల్సి ఉంటుంది. రాయితీని అందరూ సద్వినియోగం చేసుకుని నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు మృతి

నారాయణపూర్‌లో విషాదం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన షేక్ అవేజ్ మృతి చెందిన మూడు రోజులకే అదే ప్రమాదంలో గాయపడిన షేక్ అఫ్రోజ్ (20) బుధవారం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత నెల 30న రంజాన్ షాపింగ్‌కు సిరిసిల్ల వెళ్తుండగా హరిదాస్‌నగర్ వద్ద ఆటో ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా సోమవారం అవేజ్ మృతి చెందగా, తాజాగా అఫ్రోజ్ కూడా మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతునికి తండ్రి రఫీక్ గల్ఫ్‌లో ఉండగా, సోదరులు కూడా అక్కడే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్వగ్రామానికి వచ్చిన సోదరులు హైదరాబాద్‌లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది.

డివిజన్ల ఏర్పాటు శాస్త్రీయంగా ఉండాలి

- బీఆర్ఎస్ నాయకుడు



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థలో కొత్త డివిజన్లను శాస్త్రీయ పద్ధతిలో ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు కంసాల శ్రీనివాస్ కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లను ప్రామాణికంగా తీసుకుని డివిజన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కమిషనర్ స్పందిస్తూ, ప్రజల అభిప్రాయాలు తీసుకుంటామని, రోడ్ల ఆధారంగానే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజా ప్రయోజనాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ రెహమాన్



నవతెలంగాణ - కరీంనగర్ : ప్రజా ప్రయోజనాల పరిరక్షణ సమితి కరీంనగర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా అబ్దుల్ రెహమాన్ బిన్ మహమ్మద్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అమీర్ ఉత్తర్వులు జారీ చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అవినీతిపై పోరాడుతానని రెహమాన్ తెలిపారు.

డిపో మేనేజర్లతో ఆర్ఎం సమీక్ష



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో ఆర్ఎం బి.రాజు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డిపోల పనితీరు, ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు. వేసవి దృష్ట్యా బస్టాండ్లలో తాగునీరు అందుబాటులో ఉంచాలని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు, అకౌంట్స్ ఆఫీసర్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం



నవతెలంగాణ - కరీంనగర్ : వక్ఫ్ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని టీపీసీసీ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ సైఫ్ ఉల్లా ఖాలీద్ అన్నారు. ఈ నెల 13న ట్యాంక్ బండ్‌పై మిలియన్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులను లాక్కోవాలని చూస్తోందని ఆరోపించారు. ఈ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పెద్దపెల్లి కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు ఎస్కే అక్బర్ అలీ, సిరిసిల్ల కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు ఎస్కే సాహెబ్, జిల్లా ఉపాధ్యక్షులు నెహాల్ అహ్మద్, లఏక్ ఖాద్రి, నాయకులు ఖాజా ఖాన్, ఎండీ కలిముద్దీన్, సయ్యద్ కరీం, ఎండీ ఫెరోజ్, జమాలుద్దీన్, వికార్ అహ్మద్ ఖాన్, జహంగీర్, రఫీక్, హనీఫ్ షబానా, మహమ్మద్ ఆరిఫ్ ఖాన్, షాకీర్, బషీర్, అల్తాఫ్, అహ్మద్ పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు గొప్ప కమ్యూనిస్టు యోధుడు

సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

నవతెలంగాణ - కరీంనగర్ : భారతదేశంలో అణగారిన వర్గాల కోసం జీవితాన్నే అర్పించిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కొనియాడారు. బుధవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆయన 31వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినా పేదల కోసం పోరాడారని, భూసంస్కరణల కోసం కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు, పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కిన్నెర మల్లవ్వ, పిట్టల సమ్మయ్య, మచ్చ రమేష్, బోనగిరి మహేందర్, కంది రవీందర్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ చారి, కొట్టే అంజలి, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మోడల్ ఎంసెట్, నీట్‌ను జయప్రదం చేయండి



నవతెలంగాణ - కరీంనగర్ : ఎస్ఎఫ్ఐ నిర్వహించే మోడల్ ఎంసెట్, నీట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ కోరారు. ఈ నెల 15నుంచి 19వరకు ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఇంటర్ తర్వాత విద్యార్థులకు ఈ పరీక్షలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విద్యావేత్త చుక్క రామయ్య ఆధ్వర్యంలో పేపర్ సిద్ధమవుతుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించాల్సిన నెంబర్లను తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరవింద్, పలువురు పాల్గొన్నారు.

రెండు లక్షల రుణమాఫీ చేయాలి

రైతు సంఘం నిరసన



నవతెలంగాణ - కరీంనగర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రుణమాఫీ చేయాలని కోరారు. పంటల బీమా పథకం అమలు చేయాలని, మిర్చి, పత్తికి మద్దతు ధర పెంచాలని, సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా గౌరవాధ్యక్షులు పొనగంటి కేదారి, జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కంది రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు అంది తిరుపతి, గోలి బాపు రెడ్డి, బందేల శ్రీనివాస్, ఎండీ ఉస్మాన్ పాషా, భాషవేణి మహేందర్, కనుకయ్య, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



9 ఫోటో 06 : కేక్ కట్ చేస్తున్న సుడా చైర్మెన్ నరేందర్ రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్ : ఎన్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. 1971లో ఇందిరా గాంధీ విద్యార్థి సమస్యల కోసం ఎన్ఎస్‌యూఐని స్థాపించారని నరేందర్ రెడ్డి తెలిపారు. ఎన్ఎస్‌యూఐ నుంచి గొప్ప నాయకులు ఎదిగారని అన్నారు. అంతకుముందు ఇందిరా చౌక్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి బైక్ ర్యాలీతో డీసీసీ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

నవతెలంగాన - గంగాధర : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గంగాధర మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ మండలాధ్యక్షులు కోల అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీపతి చంద్రశేఖర్, ఎస్సీ మోర్చా ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీణవంకలో బీజేపీ క్రియాశీల సభ్యుల సమావేశం

నవతెలంగాణ - వీణవంక : బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా వీణవంక మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యుల సమావేశం జరిగింది. కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు హాజరై మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగుల కోసం ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ - కరీంనగర్: కరీంనగర్ విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం సర్కిల్ కార్యాలయ గెస్ట్ హౌస్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదర్శ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (కరీంనగర్) సౌజన్యంతో జరిగిన ఈ శిబిరాన్ని సర్కిల్ ఎస్ఈ మేక రమేష్ బాబు ప్రారంభించారు. ఎస్ఈ రమేష్ బాబు మాట్లాడుతూ, విద్యుత్ ఉద్యోగుల ఆరోగ్యం కోసం ఇలాంటి శిబిరాలు అవసరమని తెలిపారు. శిబిరంలో 208 మంది ఉద్యోగులు బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, కష్టపడే విద్యుత్ కార్మికుల ఆరోగ్యం ముఖ్యమని, వారికి ఉపశమనం కలిగించేందుకే ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఆదర్శ హాస్పిటల్ గతంలోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజినీర్లు కె. ఉపేందర్, జె. రాజ్యం, ఏఈ పీవో చంద్రయ్య, ఆదర్శ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె. సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ బి. హృదయ రావు, డాక్టర్ మానస, డాక్టర్ సునీల్ రాజు, డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్, హాస్పిటల్ మేనేజర్లు దుర్గ ప్రసాద్, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా భద్రతకు 'షీ'టీమ్ ప్రత్యేక చర్యలు

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : మహిళలు, బాలికల భద్రతకు కరీంనగర్ కమిషనరేట్ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. విద్యా సంస్థలు, మహిళా కార్యాలయాల్లో షీ టీమ్ విస్తత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. గత నెలలో మహిళలను వేధించిన 8మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని, 15మంది పోకిరీలకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. 65 హాట్‌స్పాట్‌లపై నిఘా ఉంచామని, ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 16మంది వేధింపులకు పాల్పడుతున్న వారిని పట్టుకుని కౌన్సిలింగ్ నిర్వహించామని తెలిపారు. ఒంటరి మహిళలు టీ-సేఫ్ యాప్‌ను వినియోగించాలని సూచించారు. వేధింపులకు గురైన వారు షీ టీమ్ నెంబర్ 8712670759, డయల్ 100 లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన భరోసా ఇచ్చారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని సూచించారు. అనుచితంగా ప్రవర్తించేవారికి కఠిన శిక్షలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలి

జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



నవతెలంగాణ - సిరిసిల్ల : జిల్లాలోని వ్యవసాయ అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ స్పష్టం చేశారు. బుధవారం ఏవోలు, ఏఈవోలతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట కోతలు పూర్తయిన రైతులకు వెంటనే టోకెన్లు అందజేసి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. నీటి వనరుల మేరకు పంటల సాగు, పంట మార్పిడి విధానంపై రైతులకు దిశానిర్దేశం చేయాలని తెలిపారు. ఈ యాసంగిలో జిల్లాలో 1.81 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయని కలెక్టర్ వివరించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవేదం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ - కరీంనగర్ : లక్ష్మీపురంలోని శ్రీవేదం ఉన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తక్కువ ఫీజుతో కార్పొరేట్ విద్య అందిస్తున్నామని తెలిపారు. సెల్ఫీ పాయింట్ల వద్ద తల్లిదండ్రులు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఏవో ప్రతాపరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఐటీ నాగ్‌పూర్‌లో పారమిత విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ - కరీంనగర్ : ఎన్ఐటీ నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో పారమిత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 7, 8, 9 తరగతుల విద్యార్థులు రెండో రౌండ్‌కు అర్హత సాధించారు. 9వ తరగతి విద్యార్థిని రిషిత మొదటి స్థానంలో నిలిచి నగదు పురస్కారం అందుకుంది. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పారమిత పాఠశాలల డైరెక్టర్లు, ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోద రావు, హనుమంత రావు, టీఎస్వీ రమణ, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత, ప్రసాద్, సమన్వయ కర్తలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి

నవతెలంగాణ - కరీంనగర్ : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులు, సాంకేతిక సమస్యలపై చర్చించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. కొత్తగా విలీనమైన గ్రామాల్లోని దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఫీజులు చెల్లించని ప్రకటన బోర్డులను తొలగించాలని తెలిపారు.

కుల వివక్షపై పోరాటంలో భాగస్వాములు కావాలి



నవతెలంగాణ - కరీంనగర్ : కుల వివక్ష, అంటరానితనం నిర్మూలన పోరాటాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కేవీపీఎస్ నగర అధ్యక్షుడు పులిపాక సాయికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మంకమ్మ తోటలోని కార్యాలయంలో పూలే అంబేద్కర్ జన జాతర కరపత్రం ఆవిష్కరించారు. పట్టణాల్లో దళితులకు ఇళ్లు అద్దెకు ఇవ్వడం లేదని, అనేక రూపాల్లో వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్‌ను మహనీయుల మాసంగా ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా జాతరలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుల వివక్షపై ప్రత్యక్ష పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు కొమ్ముల కర్ణాకర్, గాసికంటి నవీన్, దాసరపు వంశీ తదితరులున్నారు.

ఆంగ్ల భాషకు విశిష్టత ఉంది : డాక్టర్ నరేందర్ రెడ్డి



నవతెలంగాణ -కరీంనగర్ : ఆంగ్ల భాషకు విశిష్టత ఉందని, దాని ద్వారా అంతర్జాతీయ ఖ్యాతి పొందవచ్చని ఈఫ్లోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. జాతీయ స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో ఆల్ ఇండియా 3వ ర్యాంకు సాధించిన విద్యార్థిని బుధవారం అభినందించారు. పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. విజేతను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గునుకుల కొండాపూర్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా రవికుమార్ గౌడ్



నియామక పత్రం అందుకుంటున్న తాళ్లపల్లి రవికుమార్ గౌడ్

నవతెలంగాణ - గన్నేరువరం : మండలంలోని గునుకుల కొండాపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా తాళ్లపల్లి రవికుమార్ గౌడ్‌ను నియమిస్తూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్ రెడ్డి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. రవికుమార్ గౌడ్ తనపై నమ్మకంతో నియామకం చేసిన ఎమ్మెల్యేకు, సహకరించిన మండల కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొమ్మెర రవీందర్ రెడ్డి, చింతల శ్రీధర్ రెడ్డి, మాతంగి అనిల్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మంథని



కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కే. విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి సునీల్ పిలుపునిచ్చారు. బుధవారం మంథనిలోని ఆర్కే ఫ్లెక్స్ ప్రింటింగ్ హాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి వారిపై దాడి చేస్తోందని ఆరోపించారు. మే 20న చేపట్టే సమ్మెలో మంథని నియోజకవర్గం నుండి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఉడుత శంకర్, యాదవ్, మల్లారెడ్డి, వైకుంఠం, ఆనందం, బూడిద గణేష్, రాపల్లి రాజు, చిప్పకుర్తి చందు, సింగారపు గట్టయ్య పాల్గొన్నారు.

భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ- జగిత్యాల

ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ సాలియా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, వాటి సపోర్టు వైర్లు, విద్యుత్ ఉపకరణాలను ముట్టుకోవద్దు అని సూచించారు. తెగి కిందపడిన, వేలాడుతున్న, వదులుగా లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకకుండా వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని, బట్టలు ఆరవేసే జి.ఐ. వైర్ల వల్ల విద్యుత్ షాక్ వచ్చే ప్రమాదం ఉందని, ప్లాస్టిక్ దండెములు వాడాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలకు సంబం ధించిన సమస్యల కోసం 1912కు కాల్ చేయవచ్చు.

రైతు కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-ఓదెల



ఓదెల మండలం పొత్కపల్లికి చెందిన రైతు యాసం రాజయ్య పంట రుణం తీసుకున్న అనంతరం ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించారు. సింగిల్ విండో సొసైటీలో పంట రుణం తీసుకున్న మృతుడికి వ్యక్తిగత ప్రమాద బీమా కింద మంజూరైన రూ. 1 లక్ష చెక్కును పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి మృతుడి భార్య యాసం మణెమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, గోపు నారాయణరెడ్డి, రెడ్డి రజినీకాంత్, ఆకుల మహేందర్, గోలి అంజి రెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

నవతెలంగాణ-ఎలిగేడు



గ్రామాల్లోని ప్రతి బీజేపీ కార్యకర్త అంకితభావంతో పని చేసి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు, ముఖ్య అతిథి కంకణాల జ్యోతిబసు, బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కమిటీ కన్వీనర్ గాదె రంజిత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎలిగేడులో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ, బూత్ స్థాయిల్లోని కార్యకర్తలందరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుజ్జుల మల్లారెడ్డి, గంగయ్య, సత్తిరెడ్డి, మల్లేశం, తిరుపతి, పరశురాములు గౌడ్, సతీష్, అంజయ్య, మనోహర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు

నవతెలంగాణ-రాయికల్:



మండలంలోని ఇటిక్యాల, మైతాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆయా సెక్టార్ల సూపర్వైజర్లు సువర్ణ,పద్మావతి ఆధ్వర్యంలో గర్భిణులు,బాలింతలు,ఐదు సంవత్సరాల లోపు పిల్లల తల్లులకు పోషకాహారం,ఐరన్, కాల్షియం, మిల్లెట్స్ వంటి ఆహారం విలువల గురించి తల్లులకు సలహాలు సూచనలు అందించి గర్భిణీలు, బాలింతలు, తల్లులతో పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంగన్వాడి టీచర్లతో కలిసి సూపర్వైజర్లు బాలింతల గృహ సందర్శన చేసి పోషకాహారం గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కుంట సుజాత, పద్మలత, బంతి, శాంత, మమత, ఆయాలు వెంకటమ్మ, సాయమ్మ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఓదెల మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ఓదెల




ఓదెల మండలంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ కార్యాలయం, బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, ధరణి దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఆయన, 9 లక్షల రూపాయలతో చేపట్టిన మౌలిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ సునీత, ఏఈ జగదీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల స్పాట్ బకాయిలు చెల్లించాలి

నవతెలంగాణ-జగిత్యాల

గత సంవత్సరం జగిత్యాల జిల్లాలో ఎస్సెస్సీ జవాబు పత్రాల మూల్యాంకనం చేసిన కేజీబీవీ ఉపాధ్యాయుల స్పాట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని పీఆర్టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనందరావు, యాల్ల అమర్‌నాథ్ రెడ్డిలు జిల్లా విద్యాధికారి రాముకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు జిల్లా విద్యాధికారి రామును కలిసి ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ క్యాంప్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఒడ్డెలింగాపూర్ గ్రామ శివారులో అక్రమ ఇసుక నిల్వలు



నవతెలంగాణ-రాయికల్:

ఒక వైపు ప్రభుత్వం ఇసుకను తక్కువ ధరకు అందించేందుకు మన ఇసుక పాలసీ తీసుకువస్తే, ఇంకొందరు అక్రమంగా ఇసుకను నిల్వ చేసి అధిక ధరకు అమ్ముతూ సామాన్యుల నుంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామ శివారులోని ఓ మామిడి తోట సమీపంలో ఉన్న అక్రమ ఇసుక నిల్వలు నవతెలంగాణ కెమెరా కు చిక్కాయి.ప్రభుత్వం మన ఇసుక పాలసీ ద్వారా తక్కువ ధరకే ఇసుకను ప్రజలకు అందించాలని ప్రయత్నిస్తుంటే కొంతమంది వ్యక్తులు సమీపంలోని వాగులు, గోదావరి తీర ప్రాంతం నుండి ఇలా ఇసుక తీసుకువచ్చి జాలి పట్టి డంపులు ఏర్పాటు చేసుకొని అక్రమ ఇసుక దందా వ్యాపారం చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.ఒక్కొక్క ట్రాక్టర్ కు ఐదు వేలు నుంచి నుంచి ఏడు వేల రూపాయలు తీసుకుంటూ అక్రమ ఆర్జనకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక నిల్వ చేసిన వారి పట్ల చర్యలు తీసుకొని, ఆ ఇసుకను స్వాధీనం చేసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- పెద్దపల్లి కలెక్టర్ సత్యప్రసాద్
- చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలపై సమీక్ష

నవతెలంగాణ-జగిత్యాల



కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ఈ నెల 11 నుండి 13వ తేదీ వరకు ఘనంగా నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీ బి. సత్య ప్రసాద్ తెలిపారు. బుధవారం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ బి.ఎస్. లతతో కలిసి హనుమాన్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జయంతి కార్యక్రమాలు ఈ నెల 11 నుండి ప్రారంభం కానున్నందున 10వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కింది స్థాయి ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని సూచించారు. మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో లైటింగ్, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ రాత్రి నుండి 13వ తేదీ ఉదయం వరకు సుమారు రెండు లక్షల మంది భక్తులు వస్తారని, దాదాపు 45 వేల మంది మాల విరమణ చేస్తారని అంచనా వేశారు. భక్తుల కోసం 14 కౌంటర్ల ద్వారా సుమారు 5 లక్షల ప్రసాదాలను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న 64 సీసీ కెమెరాలకు అదనంగా మరో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, ఆరు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని, ఇందుకోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి 100 మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.భక్తుల సౌకర్యం కోసం కొండపైకి వెళ్లే ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోనేరు వద్ద భక్తులు స్నానాలు చేసేందుకు అనువుగా ఎప్పటికప్పుడు నీటిని శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులను, తాగునీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ అధికారులను, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కేశఖండనకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా కళ్యాణ కట్ట వద్ద ఎక్కువ మంది నాయీబ్రాహ్మణులను నియమించాలని సూచించారు. పబ్లిక్ టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ రఘు చందన్, కొండగట్టు ఆలయ ఈఓ శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, కలెక్టరేట్ ఏఓ హకీం, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్ స్పందన, ఎంపీడీఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులురాలు బోగ శ్రావణి సవాల్

నవతెలంగాణ-జగిత్యాల



ప్రజల తీర్పును, కార్యకర్తల శ్రమను విస్మరించి స్వార్థంతో మరో పార్టీలోకి ఫిరాయించిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దమ్ముంటే తన పదవికి రాజీనామా చేసి ప్రజల తీర్పు కోరాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ భోగ శ్రావణి సవాల్ విసిరారు. బుధవారం జగిత్యాలలోని 'కమల నిలయం'లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. జీవన్ రెడ్డి టీడీపీకి, మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారని శ్రావణి గుర్తు చేశారు. తాను జగిత్యాల మున్సిపల్ చైర్మన్ పదవికి, అధికార టీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో గౌరవంగా చేరానని తెలిపారు. సంజయ్ కుమార్ దొంగచాటుగా కాంగ్రెస్ పార్టీలో చేరడం, కార్యకర్తలు, నాయకులకు చెప్పకుండా బీఆర్ఎస్‌ను వీడటం ఎంతవరకు న్యాయమని ఆమె ప్రశ్నించారు. 2018లో లక్ష ఓట్లు వచ్చాయని గర్వంగా చెప్పుకున్న సంజయ్ కుమార్ 2023లో 40 వేల ఓట్లు ఎందుకు కోల్పోయారని నిలదీశారు. సంజయ్ కుమార్ తనను నమ్మిన వారి ఆత్మగౌరవాన్ని, కార్యకర్తల నమ్మకాన్ని కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017లో భూమి పూజ చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఇప్పటివరకు పూర్తి కాకపోవడానికి కాంట్రాక్టర్లు అయిన తన బంధువులే కారణమా అని ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాంబరి కళావతి, మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, పట్టణ ఉపాధ్యక్షులు పవన్ సింగ్, సింగం పద్మ, కాశెట్టి తిరుపతి, గడ్డల లక్ష్మి, ఇట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యం

నవతెలంగాణ- కోరుట్ల

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కోరుట్ల నియోజకవర్గంలో "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం యూసుఫ్‌నగర్ గ్రామంలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం యూసుఫ్ నగర్ నుండి తిమ్మాయిపల్లి వరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ, రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదని, ప్రపంచంలోనే గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, ముక్కెర లింబాద్రి, గుగ్గిళ్ళ సురేష్, ప్రియాంక మండల మహిళా అధ్యక్షురాలు అచ్చ లావణ్య, నగునూరీ గంగాధర్, ఏలేటి శశిందర్ రెడ్డి, బొల్లె నర్సయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇంద్రాల హరీష్, గంగానర్సయ్య పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నేలమట్టం

నవతెలంగాణ-మేడిపల్లి



భీమారం మండల కేంద్ర సమీపంలోని మన్నెగూడెం వెళ్లే మార్గంలో 1308 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి, సంఘాల పేరుతో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయగా, పలు కుల సంఘాల నాయకులు, ప్రజలు సోమవారం భీమారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను నిరోధించాలని, ఇప్పటికే నిర్మించిన వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ రవి కిరణ్ ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో బుధవారం జేసీబీలతో పలు ప్రాంతాల్లో నిర్మించిన రేకుల షెడ్లు, భవనాలను కూల్చివేశారు. భవిష్యత్తులో ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ జి. శ్యామ్ రాజ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవి కిరణ్, మేడిపల్లి సీఐ జి. శ్యామ్ రాజ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజారాం, తోకల కిరణ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు బెంచీలు వితరణ

నవతెలంగాణ-మల్లాపూర్:



మండలంలోని వివి రావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్ కుమారుడు రుద్రాక్ష జన్మదిన సందర్భంగా బెంచీలను బల్లలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన కుమారుడు జన్మదిన సందర్భంగా విద్యార్థులకు బెంచీలను అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దత్తాత్రేయ, ఉపాధ్యాయులు రాజశేఖర్, జలపతి రెడ్డి, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-మల్లాపూర్:



గర్భిణులు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ శంకరమ్మ అన్నారు. బుధవారం మండలంలోని రాఘవపేట గ్రామంలో గర్భిణీ, బాలింతల ఇంటింటికి తిరుగుతూ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బాలింతలు పిల్లలకు ఐదు సంవత్సరాలలోపు మురుపాలు తాగించాలని అన్నారు. రాబోయే రోజులలో పిల్లలు తల్లి పాలు తాగడం ద్వారా మరింత బలంగా తయారై ఇలాంటి అనారోగ్య సమస్యలు రావని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుజాత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను నరేంద్ర మోడీ పాలనను ప్రజలకు వివరించాలి

నవతెలంగాణ-మల్లాపూర్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నరేంద్ర మోడీ పాలనను ప్రజలకు వివరించాలని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, మండల ఇన్‌చార్జి ధోనికెళ్ల నవీన్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రలో మల్లాపూర్ మండల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రియాశీలక సభ్యులకు నాయకులకు పార్టీ ఆవిర్భావం, బీజేపీ అంచెలంచెలుగా ఎదిగిన తీరు వివరించారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్స రాల పాలన గురించి క్రియాశీల కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి మండల ప్రధాన కార్యదర్శి గడ్డం నర్సిరెడ్డి, మండల మహిళా అధ్యక్షులు శాంతమ్మ, నాయకులు బుచ్చమ్మ, పట్టణ అధ్యక్షులు ముస్కెరి రాజు కుమార్, బూత్ అధ్యక్షులు రాజశేఖర్ మొరపు జలపతి, గుగ్లావత్ రాజేందర్, భూమా గౌడ్, రాజశేఖర్ , ఇల్లేందుల మనోజ్, కనుక రాకేష్ బండి స్వామి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.10వేల విరాళం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండల్ తొర్లికొండ గ్రామానికి చెందిన అక్క వత్రి సంతోష్ కుమారుడు జోయాన్ హర్ష పుట్టినరోజు సందర్భంగా రూ.10వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ విజయ భాస్కర్‌కు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్ ధన్యవాదాలు తెలిపారు

తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు బుధవారం నిర్వహించారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నినాదాలు చేశారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దూదిగాం గంగాధర్, మాజీ సర్పంచ్ గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ భూస రాజేశ్వర్, డబ్బా గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ జాన శంకర్, తెలంగాణ బీసీ ఉద్యమ యువ నాయకుడు దేశెట్టి జీవన్, తేలు రమేష్, దుద్దుల లింగన్న, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పోనకంటి వెంకట్, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

తాటిపల్లిలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

నవతెలంగాణ మల్యాల



మల్యాల మండలం తాటిపల్లిలో ఆయిల్ పామ్ పంట సాగు, లాభాలపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. అవకాశం ఉన్న రైతు లందరూ ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం టన్నుకు సుమారు 21,000 రూపాయల మద్దతు ధర లభిస్తుం డగా, ఎకరానికి 1.5 లక్షల నుండి 2 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. ప్రభుత్వం మొక్కలపై 90శాతం రాయితీ మరియు డ్రిప్ పరికరాలపై వర్గాల వారీగా 80శాతం నుండి 100శాతం వరకు రాయితీ అందిస్తోంది. ఆయిల్ పామ్ గెలలను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. చంద్ర దీపక్, లోహియా కంపెనీ ప్రతినిధి ఎన్. అనిల్, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల రూరల్ పరిధిలోని తాటిపల్లి సెక్టార్, వంజరిపల్లి గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మొదటి 1000 రోజుల్లో పోషకాహారం ప్రాముఖ్యతను గర్భిణులు, పాలిచ్చే తల్లులు, సంరక్షకులకు వివరించారు. గర్భం దాల్చినప్పటి నుండి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు తీసుకునే పౌష్టికాహారం బిడ్డ మెదడు, శారీరక ఎదుగుదలకు కీలకమని తెలిపారు. ప్రసవించిన వెంటనే ముర్రు పాలు పట్టడం, ఆరు నెలల వరకు తల్లి పాలే ఇవ్వడం, ఆ తర్వాత అనుబంధ పోషకాహారం అందించడం తప్పనిసరిగా టీకాలు వేయించడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లావణ్య, గ్రామ సెక్రెటరీ శ్వేత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లత, అంగన్వాడీ టీచర్ శోభారాణి పాల్గొన్నారు.

రవీంద్ర ప్లే స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

నవతెలంగాణ-జగిత్యాల



స్థానిక రవీంద్ర ప్లే స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. యూకేజీ పూర్తి చేసుకుని ఒకటో తరగతిలోకి అడుగు పెడుతున్న విద్యార్థులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎంఈఓ భీమయ్య మాట్లాడుతూ.. సాధారణంగా డిగ్రీ పూర్తయిన వారికే గ్రాడ్యుయేషన్ డే ఉంటుందని, కానీ ప్రీ ప్రైమరీ స్థాయిలో ఇలాంటి వేడుక నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అర్హులైన విద్యార్థులం దరికీ పట్టాలు అందజేసి సత్కరించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు, పాఠశాల డైరెక్టర్ బి. శ్రీధర్ రావు, ఇతర డైరెక్టర్లు కె. సుమన్ రావు, బి. హరిచరణ్ రావు, కె. కిషన్, జె. రాజు, జె. మౌనిక పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా సాయం విడుదల చేయాలి

నవతెలంగాణ-మంథని



వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం వెంటనే ఆత్మీయ భరోసా సహాయం విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం మంథని మండలం పుట్టపాకలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఆత్మీయ భరోసా ఇవ్వక పోవడంపై ప్రశ్నించారు. ఎండలో పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలైన నీరు, నీడ, ప్రథమ చికిత్స అందుబాటులో లేకపోవడం సిగ్గుచేటన్నారు. అధికారులు స్పందించి వెంటనే సౌకర్యాలు కల్పించకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రేషన్ షాపులో ప్రధాని మోడీ ఫొటో పెట్టాలి

నవతెలంగా-కమాన్‌పూర్



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నందున ప్రతి రేషన్ షాపులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోను పెట్టాలని బీజేపీ కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ డిమాండ్ చేశారు. కరోనా సమయం నుండి దేశ ప్రజలకు ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్న గొప్ప వ్యక్తి నరేంద్ర మోడీ అని ఆయన కొనియాడారు. అనంతరం కమాన్‌పూర్ మండల తహసీల్దార్ వాసంతికి బీజేపీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మట్ట శంకర్, జంగపల్లి అజయ్, మల్లారపు అరుణ్ కుమార్, బర్ల సదానందం, సాగంటి లక్ష్మణ స్వామి, కొమ్ము శ్రీనివాస్, పిడుగు రమేష్, బోగే రవితేజ, గోపు పర్వతాలు, మండల సంతోష్, జంగపల్లి శేఖర్, అగ్గి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

గాజులపల్లిలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ- మంథని



మంథని మండలం గాజులపల్లిలో శ్రీ ఫౌండేషన్, శ్రీవైద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కారింగుల సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో మెడికవర్, ఐకేర్ హాస్పిటల్ సౌజన్యంతో గుండె సంబంధిత ఈసీజీ, బీపీ, మధుమేహం, బ్లడ్ షుగర్, బరువు, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్తాల్మిక్ ఆఫీసర్ బుద్ధర్తి సతీష్ కుమార్, భీముని దేవేందర్, మెడికల్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

కన్నాలలో వాల్ రైటింగ్ వేసిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

నవతెలంగాణ-మంథని



మంథని నియోజకవర్గంలోని పాలకుర్తి మండలం కన్నాల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ వినూత్న ప్రచారం చేపట్టారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆయన స్వయంగా గోడపై వాల్ రైటింగ్ రాశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఈ సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి మేడిపల్లి సెక్టార్‌లో 'పోషణ పక్వాడ్'

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి, భీమారం సెక్టార్ల పరిధిలోని మేడిపల్లి, రాజలింగంపేట్, రత్నాలపల్లి, మోత్కరావుపేట, కొండాపూర్, పోరుమళ్ళ, దేశాయిపేట్, మన్నెగూడెం, లింగంపేట్, గోవిందారం, వల్లంపల్లి తదితర గ్రామాల్లో పోషణ పక్వాడ్ కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మేడిపల్లి, భీమారం సూపర్వైజర్లు షైనీ మాథ్యూ, భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి పోషకాహారం తీసుకోవడంపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పాలు, గుడ్లు వంటి పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పోషణ పక్వాడ్ కార్యక్రమంపై నేరుగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, భాగ్యలక్ష్మి, బాల భారతి, గంగ జమున, లక్ష్మి, రాజేశ్వరి, సుమలత, పద్మ లక్ష్మి, రజిత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
రాజన్న సిరిసిల్ల-కరీంనగర్
గురువారం | ఏప్రిల్ 10, 2025 | www.navatelangana.com

నీడ లేదు.. నీళ్లు లేవు..

- ఉపాధి హామీ పనుల్లో సౌకర్యాల కరువు..
- నీడ లేక, నీళ్లు లేక కూలీల అవస్థలు!
- ఇంటి నుంచి తెచ్చుకున్న బాటిల్ నీళ్లే దిక్కు
- కనిపించని ఫస్ట్ ఎయిడ్ కిట్స్
- సౌకర్యాల కల్పనలో అధికారుల వైఫల్యం
- చట్టంలోని నిబంధనలు కాగితాలకే పరిమితం


నీడ కోసం కాలువ మట్టి పెళ్లల పక్కన కూర్చొని సేద తీరుతున్న ఉపాధి కూలీలు

గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనోపాధికి భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం క్షేత్రస్థాయిలో నీరుగారుతోంది. నీటి కుంటలు, భూమి చదును, మట్టి రోడ్లు వంటి పనులు జరుగుతున్నప్పటికీ, పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. పెరుగుతున్న ఎండల తీవ్రతతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- నవతెలంగాణ, తంగళ్లపల్లి


టార్పలిన్ కవర్ తో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నీడలేని గుడిసె

ఎండ దెబ్బకు అల్లాడుతున్న కూలీలు:

వేసవి ఆరంభం నుంచే 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కానీ పూట గడవని నిరుపేద కుటుంబాలు మాత్రం ఈ భగభగమండే ఎండలోనూ పనులకు వెళ్లక తప్పడం లేదు. అయితే పని ప్రదేశాల్లో కనీసం నీడ కూడా లేకపోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నప్పటికీ, చాలా చోట్ల కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయి. తాగడానికి నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కూలీలు తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న నీళ్లే వారికి దిక్కవుతున్నాయి. ఎండ వేడి నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు నీడ కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల కరువు.. చట్టం ఉల్లంఘన:

ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలకు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని చట్టం స్పష్టంగా చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అవి కనిపించడం లేదు. పని ప్రదేశాల్లో సేద తీరేందుకు టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో కూలీలు చెట్ల నీడను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని చోట్ల అధికారులు ఏర్పాటు చేసిన చినిగిపోయిన టార్పాలిన్ కవర్లు ఏ మాత్రం ఉపయోగపడటం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా పనిముట్లు అందించాల్సి ఉన్నప్పటికీ, చాలా ఏళ్లుగా వాటి జాడ లేదని వారు వాపోతున్నారు.

ప్రమాదకర పరిస్థితుల్లో పని:

ఉపాధి హామీ పనులు కాలువల తవ్వకం వంటి ప్రమాదకరమైన ప్రదేశాల్లో జరుగుతున్నాయి. పది అడుగుల లోతు వరకు పనిచేస్తున్న కూలీలకు ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే వైద్య సహాయం అందించేందుకు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

కూలీల ఆవేదన:

"పని చేసే చోట మంచినీళ్లు, నీడ లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రమాదం జరిగితే కనీసం ప్రాథమిక చికిత్స కూడా అందే పరిస్థితి లేదు. గ్రామం నుంచి పని ప్రదేశాలు చాలా దూరంగా ఉంటున్నాయి. వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి" అని తంగళ్ళపల్లికి చెందిన ఉపాధి కూలీ ఎడ్ల బాలలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మరో కూలీ బలగం బాలలక్ష్మి మాట్లాడుతూ "తాగడానికి ఇంటి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం, అవి ఎండకు వేడెక్కి తాగలేకపోతున్నాం. పని మొదలై చాలా రోజులైంది కానీ పనిముట్లు ఇవ్వలేదు. కనీస సౌకర్యాలు కల్పించి పనిముట్లు అందించాలి" అని డిమాండ్ చేశారు.

కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం ...

కాగా, ఈ విషయంపై తంగళ్ళపల్లి ఏపీవో రాజనర్సును వివరణ కోరగా ఆయన స్పందిస్తూ "ఉపాధి కూలీలు పనిచేసే చోట అన్ని వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేశాం. మంచినీటి బాటిళ్లను కూలీలే తెచ్చుకోవాలి. ప్రమాదం జరిగితే ఫస్ట్ ఎయిడ్ కిట్ ద్వారా బ్యాండేజీలు ఏర్పాటు చేస్తున్నాం. ఎండ దెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నాం. నీడ కోసం చిన్నపాటి గుడిసెలు ఏర్పాటు చేస్తున్నాం" అని తెలిపారు.

అయితే క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం ఆయన చెబుతున్నదానికి భిన్నంగా ఉన్నాయని కూలీలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్
66వాహనాలపై కొరడా



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి పర్యవేక్షణలో కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచడం, రోడ్డు భద్రత మెరుగుపరచడమే లక్ష్యంగా కరీంనగర్ టౌన్-1 పోలీస్ స్టేషన్ ఎదుట ఈ తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్ల ఉల్లంఘన, శబ్ద కాలుష్య వాహనాలు, సరైన పత్రాలు లేని వాహనాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 66 వాహనాలను గుర్తించి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించడంతో పాటు, సరైన నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ పర్ష రమేష్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ల వినియోగం తప్పనిసరి అని, నెంబర్ ప్లేట్లను తారుమారు చేయడం లేదా అలంకరించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇలాంటి చర్యలు భద్రతకు ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ సీఐ పర్ష రమేష్, ఎస్ఐ ఉపేంద్రా చారి, ఎస్ఐ ప్రమోద్ రెడ్డి, ఇతర ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

రామ్మన్నపల్లెలో కాంగ్రెస్ పాదయాత్ర



నవతెలంగాణ - తంగళ్ళపల్లి : బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని రామన్నపల్లె గ్రామంలో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'జై బాపు జై భీమ్ జై సంవిదాన్' కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ, రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఉద్ఘాటించారు. అంబేద్కర్ వారసత్వం, విలువలను కాపాడటానికి దేశవ్యాప్తంగా ఐక్యత సాధించేందుకు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి
సిరిసిల్లలో సీపీఐ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : కేంద్రం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ, నిత్యావసరాల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిలిండర్ ధర పెంపు సామాన్యులపై భారమన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా కేంద్రం ధరలు పెంచడం ఆయిల్ కంపెనీలకు మద్దతు ఇవ్వడమేనని విమర్శించారు. మోడీ విధానాలు పెట్టుబడిదారులకు అనుకూలమన్నారు. పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


పాల్గొన్న విద్యార్థి సంఘ నాయకులు

నవతెలంగాణ - ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలో ఎన్ఎస్ యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్ఎస్ యూఐ మండల అధ్యక్షుడు మీదిదొడ్డి భాను కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత సాధికారత, సామాజిక సమానత్వం కోసం ఎన్ఎస్ యూఐ నిరంతరం పోరాడుతోందని అన్నారు. గత 55 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లోనూ విద్యార్థుల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాను, వెంకటేష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్ స్వర్ణకారులను రానివ్వొద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న స్వర్ణకారులు

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంలో రాజస్థాన్ కు చెందిన జ్యువెలర్స్ షాపులు పెట్టడానికి వస్తున్నారని, వారిని రానివ్వకుండా స్థానిక అధికారులు అడ్డుకోవాలని మండల స్వర్ణకారులు డిమాండ్ చేశారు. స్థానికంగా పనిలేక దయనీయ స్థితిలో ఉన్నామని, రాజస్థాన్ వారు వస్తే ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కానీ, గ్రామాల్లో కానీ రాజస్థాన్ స్వర్ణకారులకు షాపులు పెట్టడానికి అనుమతించవద్దని కోరుతూ గ్రామ పంచాయతీ, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల స్వర్ణకారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న మండల అధ్యక్షులు, నాయకులు

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి బుధవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలానికి 60 చెక్కులు వచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, యువజన అధ్యక్షుడు రంజాన్ నరేష్, జిల్లా నాయకులు బాల్ రెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు వనిత, మాజీ ఎంపీటీసీ స్వేచ్ఛ రాజు పాల్గొన్నారు.

మహిళా కొనుగోలు కేంద్రాల ప్రారంభం


ప్రారంభిస్తున్న చైర్మన్, కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని తురకపల్లె, రామలక్ష్మణపల్లె, గోపాల్‌పల్లె, చికోడు, ముస్తాబాద్ మహిళా ఐకేపీ సెంటర్లను మార్కెట్ కమిటీ చైర్మన్ రాణీ నరసింహులు, పార్లమెంటు కో కన్వీనర్ కనిమేని చక్రధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, తహసీల్దార్ సురేష్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజు, యువజన అధ్యక్షుడు నరేష్, ఎన్ఎస్ యూఐ మండల అధ్యక్షుడు భాను, జిల్లా నాయకులు రాజిరెడ్డి, బాల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శీలం ప్రశాంత్, మహేష్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రం వెంటనే వంటగ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలి

- బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ఖండించిన సీపీఐ(ఎం)
- గత 11ఏండ్లలో130శాతం వంటగ్యాస్ ధరల పెంపు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి


గ్యాస్ సిలిండర్ ఎత్తుకొని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్ : వంటగ్యాస్ ధరను రూ.50 పెంచిన కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గీతాభవన్ చౌరస్తాలో గ్యాస్ సిలిండర్‌ను నెత్తిపై పెట్టుకుని, ప్లేకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11ఏండ్లలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యులపై భారం మోపుతోందని విమర్శించారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న సమయంలో గ్యాస్ ధర పెంపు ప్రజలకు మరింత ఇబ్బంది కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పడిపోయినా, దేశీయంగా ధరలు తగ్గించకుండా ఆయిల్ కంపెనీల లాభాల కోసం కేంద్రం ప్రజలపై భారం వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.943కి పెరిగిందని గుర్తు చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు కూడా భారీగా పెరిగాయని తెలిపారు. తాజా ధర పెంపుతో కేంద్రానికి రోజుకు రూ.780 కోట్లు, సంవత్సరానికి సుమారు మూడు లక్షల కోట్లు ఆదాయం వస్తోందని వివరించారు. ఇంతవరకూ ధరలు తగ్గని అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, ధరల తగ్గింపుకు రాష్ట్రం కూడా కృషి చేయాలని కోరారు. కేంద్రం ఎక్సైజ్ సుంకం పెంచి ఖజానా నింపుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్ ధర తగ్గించే వరకు సీపీఎం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వర్ల వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమా సాహెబ్, యు.శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, డి.నరేష్ పటేల్, గజ్జల శ్రీకాంత్, జి.తిరుపతినాయక్, తిప్పారపు సురేష్, రాయికంటి శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య, కె.నరేష్, కొంపెల్లి అరవింద్, కనకరాజు, సందేశ్, రాజు, విజయ్, అరవింద్, రాకేష్, మహేష్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


వడ్లు తూకం వేస్తున్న ప్రభుత్వ విప్

నవతెలంగాణ - కోనరావుపేట : రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం కోనరావుపేట మండల కేంద్రంతో పాటు నిజామాబాద్‌లో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా తల్లులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం కొనుగోలు కేంద్రాలను వారికే కేటాయించారని వెల్లడించారు. సన్న వడ్లు పండించే రైతులకు ప్రోత్సాహకంగా ప్రతి క్వింటాల్‌కు అదనంగా రూ. 500 ఇస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. నిర్వాహకులు తగినంత టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తహశీల్దార్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని పదిర, బండలింగంపల్లి, దుమాల, అక్కపల్లి గ్రామాలలో బుధవారం తహశీల్దార్ డి. సుజాత కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, నాయకులతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తహసీల్దార్ సుజాత మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చే ధాన్యంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని నిర్వహకులకు సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర రూ.2320 ఉందన్నారు. సాధారణ రకం ధాన్యానికి రూ.2300 ధర ఉందన్నారు. సన్న వడ్లకు రూ.500బోనస్ ఇస్తున్నట్టు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు నిర్వహకులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, డైరెక్టర్లు మెండే శ్రీనివాస్‌యాదవ్, గణపతి, గంట బుచ్చాగౌడ్, లక్ష్మారెడ్డి, చెన్ని బాబు, కొత్తపల్లి దేవయ్య, చెట్టిపల్లి బాలయ్య, పొన్నాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు సన్నద్ధం కావాలి
బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్రియాశీలక సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం క్రియాశీలక సమావేశం నిర్వహించారు. హాజరైన మల్లికార్జున్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై నాయకులకు, కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీధర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి ఇటికల రాజు, మహిళా అధ్యక్షురాలు కోడం భవిత, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకుంటున్న ప్రభుత్వం
ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

నవతెలంగాణ - గన్నేరువరం : నిరుపేదల వైద్య సదుపాయం కోసం ప్రభుత్వం నిమ్స్ ఆస్పత్రిలో ఎల్ఓసీలు అందించి ఆదుకుంటోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి అధిక ఖర్చులు భరించవద్దని ఆయన సూచించారు. బుధవారం మండల కేంద్రంలో 46 మందికి కళ్యాణ లక్ష్మీ, 40 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎం సహాయనిధి ద్వారా వైద్య ఖర్చులు అందించి ఆదుకుంటోందని తెలిపారు. నిరుపేద ఆడబిడ్డల పెండ్లిళ్లకు కళ్యాణ లక్ష్మీ ద్వారా రూ. 1,00,116 అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చెక్కులు పొందినవారు సకాలంలో బ్యాంకులో సమర్పించి నగదు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఇప్ప నరేందర్, ఏవో కిరణ్మయి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసుకు ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీకి ఇల్లందకుంట ఆలయ కమిటీ చైర్మన్ కృతజ్ఞతలు



నవతెలంగాణ - హుజురాబాద్ టౌన్ : హుజురాబాద్ ఏసీపీ సిహెచ్ శ్రీనివాస్‌ను ఇల్లందకుంట ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హుజురాబాద్ లోని ఏసీపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రామారావు మాట్లాడుతూ, అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లంతకుంట సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకుని పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినందుకు ఏసీపీ శ్రీనివాస్‌ను కలిసి శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గోడిశాల పరమేష్, గోలి కిరణ్, కాంగ్రెస్ నాయకులు ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భాష చైతన్య సమితి వార్షికోత్సవానికి యువ కవి శ్రీనివాస్‌కు ఆహ్వానం



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువ కవి కట్ల శ్రీనివాస్‌కు మే 8న హైదరాబాద్‌లో జరిగే తెలుగు భాషా చైతన్య సమితి వార్షికోత్సవ సభకు బుధవారం ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా యువ కవి శ్రీనివాస్ మాట్లాడుతూ మే 18న హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జరిగే తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవ సభకు నిర్వహకులు ఆహ్వాన పత్రికను పంపించడం ఆనందంగా ఉందన్నారు. ఆ సభలో కవి సమ్మేళనం జరుగుతుందని అందులో తనను కవిత వినిపించాలని ఆహ్వాన పత్రికను అందించిన తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్, సమన్వయ కర్త డాక్టర్ వి. జయ ప్రకాశ్ కోరినట్టు శ్రీనివాస్ తెలిపారు.

ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు కావాలి
డీపీఓ షరీఫుద్దీన్


క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న డీపీవో

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : రాజీవ్ యువ వికాస్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు కావాలని జిల్లా పంచాయతీ అధికారి మహమ్మద్ షరీఫ్ ఉద్దీన్ అధికారులను ఆదేశించారు. తంగళ్ళపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పథకం కింద వచ్చిన దరఖాస్తుల వివరాల రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని దరఖాస్తులన్నింటినీ వెంటనే నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి, లబ్దిదారునికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. తప్పుగా నింపిన దరఖాస్తులను సరిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీఓ మీర్జా, సూపరింటెండెంట్ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ


పంపిణీ చేస్తున్న డిప్యూటీ తాసిల్దార్, కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిన్నటి రోజు 141 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసింది. బుధవారం గంధం అంజవ్వతో పాటు ఇతర లబ్ధిదారులకు కేకే యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అరుట్ల మహేష్ రెడ్డి చెక్కుతో పాటు చీరను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ అపర్ణ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు


మాట్లాడుతున్న కరీంనగర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు

నవతెలంగాణ - చొప్పదండి : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్‌రావు విమర్శించారు. బుధవారం చొప్పదండి మండల కేంద్రంలోని వరలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా మండల అధ్యక్షుడు మొగిలి మహేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సింగిరెడ్డి భూమిరెడ్డి, గంటల రమణారెడ్డి, మొగిలి సారయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవ సమావేశం



నవతెలంగాణ - హుజురాబాద్ టౌన్ : హుజూరాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. తూర్పాటి రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు కల్లెపు వాసుదేవ రెడ్డి హాజరయ్యారు. కల్లెపు వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై సూచనలు చేశారు. మాజీ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీల నిర్మాణం పార్టీకి స్థిరత్వాన్ని అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర
అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ స్పష్టం చేశారు. బుధవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, తమ పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాధా బాయ్, డీఏవో అఫ్జల్ బేగం, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుమల స్వరూప తిరుపతిరెడ్డి, మెప్మా అధికారి మీర్జా ఫసహత్ అలీ బేగ్, ప్యాక్స్ చైర్మన్ జిల కిషన్, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సిపిఐ అగ్రనేత చంద్ర రాజేశ్వర రావు 31వ వర్ధంతి

నవతెలంగాణ-గోదావరిఖని:



సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర రావు 31వ వర్ధంతి గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వర రావు చిత్ర పటానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోషిక మోహన్, ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కె.స్వామిలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, మాటేటి శంకర్, మడికొండ ఓదెమ్మ, శనిగరపు చంద్ర శేఖర్, మార్క పురి సూర్య, రేణుకుంట్ల ప్రీతం, చిలుముల రాజయ్య, ఆసాల నవీన్, పడాల కనక రాజు, బూడిద మల్లేష్, శనిగరపు తిరుమల, భాగ్య, రాజమ్మ కల్వల జగన్ తదితరులున్నారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి వినతి

నవతెలంగాణ-గోదావరిఖని:



కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను సింగరేణి రిటైర్డు ఉద్యోగి వంగ బాబు రావు బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దేశంలోని బొగ్గు గని ఉద్యోగులకు పెన్షన్ పెంపుదల చేసేలా కృషి చేయాలని కోరారు. ఢిల్లీకి వెళ్లిన తరువాత పెన్షన్ పెంపునకు సంబంధిత అధికారులతో మాట్లాడుతానని కేంద్ర మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-గోదావరిఖని:



పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శ్రీపతి శంకరయ్య అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులున్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

నవతెలంగాణ-మెట్‌పల్లి



జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉన్నత విద్య, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై వ్యక్తిత్వ వికాస నిపుణుడు పుప్పాల నవీన్ కుమార్ అవగాహన కల్పించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు కావాల్సిన నైపుణ్యాలు, ఉన్నత చదువులకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. ఆత్మవిశ్వాసం, స్వీయ ప్రేరణ పెంపొందించుకునే మార్గాలను సూచించారు. ఓటమి అంతం కాదని, ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, ప్రిన్సిపల్ సంతోష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ సత్యనారాయణను పరామర్శించిన జువ్వాడి

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ భర్త, డాక్టర్ సత్యనారాయణ ప్రమాదవశాత్తు గాయపడగా, కాంగ్రెస్ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు బుధవారం ఆయనను పరామర్శించారు. ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీ

నవతెలంగాణ-మెట్‌పల్లి



విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం మెట్‌పల్లి పట్టణంలో వీర హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కాశీ బాగ్ హనుమాన్ మందిరం నుండి అయ్యప్ప స్వామి మందిరం వరకు సాగిన ఈ యాత్రలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీజేపీ నాయకుడు సురభి నవీన్ పాల్గొన్నారు. హనుమాన్ దీక్షాపరులు, భక్తులు, విహింప సభ్యుల నినాదాలతో పట్టణం మార్మోగింది. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-మెట్‌పల్లి



మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పనుసూరి శ్రీనివాస్‌లను మెట్ల చిట్టాపూర్ విడిసి సభ్యులు సన్మానించారు. న్యాయపరమైన సేవలతో పాటు సామాజిక సేవల ద్వారానే గుర్తింపు వస్తుందని విడిసి అధ్యక్షులు దండిక శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో విడిసి ఉపాధ్యక్షులు అమ్మిగల్లా ఆంజనేయులు, కోశాధికారి సదిరెం పెద్ద గంగారాం, నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్‌తో కలిసి నడవాలి

జువ్వాడి నర్సింగ్ రావు

నవతెలంగాణ-మెట్‌పల్లి



దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, బీజేపీ దానిని నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి నర్సింగ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం మెట్‌పల్లి మండలంలోని రామ లచ్చక్క పేట, ఏఎస్ఆర్ తండా, రంగారావుపేట్ గ్రామాల్లో ఆయన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర నిర్వహించారు.

సింగరేణి ఆర్జీ 1 ఏరియాలో క్వార్టర్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-గోదావరిఖని:



సింగరేణి ఆర్జీ 1 ఏరియాలో విధులు నిర్వహిస్తున్న మంత్లీ గ్రేడ్ ఉద్యోగులు లోవర్, హైయర్ టైప్ క్వార్టర్ కౌన్సిలింగ్‌ను స్థానిక ఆర్‌సిఓఎ క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జీ 1 ఎస్ఓటూజీఎం గోపాల్ సింగ్ హాజరయ్యారు. ఈ క్వార్టర్ కౌన్సిలింగ్‌లో సిఎంసి, ఎస్‌సి, బిసిహెచ్, డి, టి-2, ఎంబి, ఎస్‌టి 2 టైప్ క్వార్టర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్హత, గ్రేడ్, పదవీని బట్టి క్వార్టర్‌లను కేటాయించామని, క్వార్టర్ కౌన్సిలింగ్‌ను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఆరెల్లి పోశం, సీనియర్ పర్సనల్ అధికారి శ్రావణ్ కుమార్, హనుమంత రావు, పిఓఎ దేవా చారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులున్నారు.

రేపు జ్యోతిబాపూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ-పెద్దపల్లి:

ఈనెల 11న నిర్వహించనున్న మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రేపు ఉదయం 10:30 గంటలకు మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బేకరీలో కాలం చెల్లిన పదార్థాల వినియోగం

- కనీస ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- అధికారుల తనిఖీల్లో విస్తుపోయే అంశాలు
- రూ.20 వేల జరిమానా

నవతెలంగాణ-కోల్‌సిటీ





రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, బెకరీల నిర్వాహకులు అధిక లాభాపేక్షతో అతి చవకైనా, కాలం చెల్లిన, నాణ్యత లేని ముడిపదార్థాలను వినియోగించి ఆహారపదార్థాలను తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో ఇటీవల ఈ కేసుల సంఖ్య ఎక్కువవు తోంది. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో నాణ్యతా ప్రమాణాలపై ఫిర్యాదులు వస్తుండడంతో ఇటీవల అధికారుల తనిఖీలు పెరిగాయి. తనిఖీల్లో అధికారులు విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలను తయారు చేయడం, గడువు ముగిసిన పదార్థాలను తయారీకి వినియోగించ డంతో పాటు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడాన్ని అధికారులు గుర్తిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారికి అధికారులు జరిమానా విధిస్తున్నా వ్యాపారస్తుల్లో మార్పు రావడం లేదు. అధికారుల తనిఖీల్లో విస్తుగొలిపే అంశాలు వెలుగుచూస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. బుధవారం గోదావరిఖని లక్ష్మీనగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న సిరి కేక్స్ అండ్ మోర్ బేకరీలో నగరపాలక అధికారులు హెల్త్ అసిస్టెంట్ కిరణ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గడువు దాటిన ముడి పదార్థాలు, పలు రకాల రసాయనాలు, అపరిశుభ్రమైన వంట నూనెలు, చెడిపోయిన ఇతర పదార్థాలను బేకరీ ఫుడ్, కేకులు, స్వీట్ల తయారీలో వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో పాటు అపరిశుభ్ర వంటశాల, దుర్గంధభరితంగా ఉండడం, బాత్ రూంలో బట్టీ ఉండడం, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులను సిరి బేకరీలో అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడు



తున్న బేకరీ నిర్వాహకుడికి అధికారులు రూ.20 వేల జరిమానా విధించడంతో పాటు చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్, రామగుండం కమిషనర్ అరుణ శ్రీ ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం హెల్త్ అసిస్టెంట్ కిరణ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో ఎన్వీరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామాలే లక్ష్యం

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి



జిల్లాలోని అన్ని గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం పంచాయతీ, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 11న 0-6 ఏళ్ల పిల్లల ఎదుగుదలను పరిశీలించాలని, ప్రతి శుక్రవారం వారిని అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చూడాలని ఆదేశించారు. తక్కువ బరువు, ఎత్తు ఉన్న పిల్లలకు పోషకాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వెయింగ్ యంత్రాలు సరిగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 30 లోపు వాటి పరిశీలన పూర్తి చేయాలని తెలిపారు. యువత ఏర్పాటు చేసే వ్యాపార యూనిట్లు ఆమోదయోగ్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్ క్యాంప్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో పిల్లలతో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న డిగ్రీ విద్యార్థులు వాలంటీర్లుగా ఏప్రిల్ 20 వరకు వివరాలు ఇవ్వాలని కోరారు. పైలెట్ గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. 32 వేల కొత్త రేషన్ కార్డుల పరిశీలన ఏప్రిల్ 20 లోపు పూర్తి చేయాలని తెలిపారు. సమ్మర్ సీజన్‌లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సమస్యలు వస్తే వెంటనే తెలియజేయాలని అన్నారు. ప్రతి వారం మండల స్థాయిలో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. అనాథ పిల్లల జాబితాను మే 10 లోపు అందిస్తే గురుకులాల్లో చేర్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంటి, వినికిడి సమస్యలున్న వారిని గుర్తించాలని, టీబీ నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, టీబీ నిక్షయ యాత్ర ద్వారా పరీక్షలు నిర్వహించి టీబీ రహిత గ్రామాలు తయారు చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, డీఆర్డీఓ ఎం. కాళిందిని, డీపీఓ వీర బుచ్చయ్య, జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాలరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ అన్న ప్రసన్నకుమారి, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యం

ఎస్‌సిఇయు ఆర్జీ -1 అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి

నవతెలంగాణ-గోదావరిఖని



సమాజంలో అన్ని రకాల దోపిడీ, అణచివేత వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి వీటి నుండు శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి, పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో సిఐటియు తన ఆవిర్భావం నుంచి పని చేస్తున్నదని సిఐటియు అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్జీ 1 అధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి అన్నారు. సామాజిక ఉద్యమాలను బలపరిచేందుకు ఆర్జీ-1 పరిధిలోని జీడీకే11వ గని ఉద్యోగుల నుంచి సిఐటియు ఫిట్ కమిటీ బృందం బుధవారం విరాళాలు సేకరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడ లేని కుల వ్యవస్థ మన దేశంలోనే ఉందన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని మనిషిలాగా చూడలేని దుర్మార్గపు స్థితి నేటికీ కొనసాగడం అమానుషమని, కులం, మతం, ప్రాంతం, లింగ భేదం లాంటి సామాజిక రుగ్మతలు మన దేశంలో ప్రజలను, కార్మిక వర్గాన్ని ఐక్యం కానివ్వకుండా దారికి అడ్డంగా, ముళ్లకంచలా ఉన్నాయని అన్నారు. ఈ నెల 6 నుంచి 14 వరకు తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయ సాధన క్యాంపియన్ నిర్వహించాలని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని, ఈ క్యాంపియన్‌లో సిఐటియు అనుబంధ సంఘాలన్నీ భాగస్వాములు కావాలని, రాష్ట్ర కార్మిక వర్గంలో సామాజిక న్యాయ సాధన క్యాంపియన్ సింగరేణిలో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు తోట నరహరి రావు, ఆర్జీ-1 సహాయ కార్యదర్శి జెల్ల గజేంద్ర, బోగ్గారం శ్రీనివాస రావు, పిట్ సెక్రటరీ జంగపల్లి మల్లేష్, సిహెచ్.దేవేందర్, మునుకుంట రామన్న, శివ తదితరులున్నారు.

'లైన్ క్లియరెన్స్' యాప్‌పై సిబ్బందికి అవగాహన



నవతెలంగాణ-మెట్‌పల్లి

క్షేత్రస్థాయిలో పని చేస్తున్న విద్యుత్ సిబ్బంది విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైన్లపై పని చేసేటప్పుడు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని మెట్‌పల్లి డీఈ గంగారాం సూచించారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి రూపొందించిన 'ఎల్.సీ- యాప్' (లైన్ క్లియరెన్స్- అప్లికేషన్)పై డివిజన్ స్థాయి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. గతంలో ఫీడర్‌పై పని చేయాలంటే సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చి క్లియరెన్స్ తీసుకునేవారని, కొన్నిసార్లు పొరపాటుగా మరో ఫీడర్ బంద్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగేవని డీఈ తెలిపారు. కొత్త యాప్ ద్వారా సిబ్బంది రిక్వెస్ట్ పెడితే, పని వివరాలు, బంద్ చేయాల్సిన సమయం, ప్రదేశం ఫోటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. సబ్‌స్టేషన్ ఆపరేటర్ బ్రేకర్ ట్రిప్ చేసి, ఐసోలేటర్ తెరిచిన ఫొటో అప్‌లోడ్ చేస్తేనే పని ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఒక ఫీడర్‌కు అడ్డంగా మరో ఫీడర్ వెళ్తే దానిని కూడా బంద్ చేస్తారని, లైన్ల మధ్య సరైన నిడివి లేని బలహీనమైన ప్రదేశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారని వివరించారు. ఈ యాప్ ద్వారా సిబ్బంది బృందంగా పని చేస్తారని, గంట కంటే ఎక్కువ సమయం క్లియరెన్స్ కావాలంటే ఏఈ అనుమతి తీసుకోవాలని తెలిపారు. యాప్ సమర్థ నిర్వహణకు అన్ని సబ్‌స్టేషన్‌లకు ఆండ్రాయిడ్ ఫోన్లు సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈలు మనోహర్, హరీష్, అంజన్ రావ్, రఘుపతి, ఏఈలు, సబ్ ఇంజనీర్లు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనాలి

పెద్దపల్లి అదనపు కలెక్టర్ వేణు

నవతెలంగాణ-పెద్దపల్లి



యాసంగిలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు స్పష్టం చేశారు. బుధవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తగినన్ని వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, గన్నీ సంచులు వంటి మౌలిక సదుపాయాలు ఉండాలని ఆయన ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, లైట్ల సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. వడదెబ్బ బాధితులకు ప్రథమ చికిత్స అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టెంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. నిర్దేశిత నాణ్యతా ప్రమాణాల ప్రకారమే కొనుగోళ్లు జరపాలని, కలెక్టర్ కేటాయించిన రైస్ మిల్లులకే ధాన్యం సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఎన్టీపీసీ స్వశక్తి సంఘంలో మహిళలకు అవగాహన

నవతెలంగాణ-గోదావరిఖని:



ఎన్టీపీసీలోని మహిళా స్వశక్తి సంఘంలోని మహిళలకు షీ టీం ఇన్‌ఛార్జి, ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో షీ టీం అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో, జన సమీకరణ ప్రాంతాల్లో, కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థినులు భయపడకుండా 6303923700 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, సిఓ శ్వేత, అధ్యక్షురాలు తిరుమల, ఆర్‌పి ధనలక్ష్మి తదితరులున్నారు.

భీమారం మండలానికి నూతన సమైక్య అధ్యక్షురాలు, ఏపీఎం నియామకం

నవతెలంగాణ-మేడిపల్లి



భీమారం మండలానికి నూతనంగా జిల్లా సమైక్య అధ్యక్షురాలుగా ద్యావనపల్లి సరోజన ఎన్నికయ్యారు. అలాగే, మండల ఇంచార్జ్ ఏపీఎంగా సంఘ రత్నాకర్ బాధ్యతలు స్వీకరించారు. వీరి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. సంబంధిత అధికార బృందం వీరిని శాలువాతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఏపీఎం గట్ల అశోక్ పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని



సమాజంలో విప్లవాత్మక మార్పు కోసం యువత ముందుకు రావడానికి ఎన్ఎస్‌యుఐ మంచి మార్గమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్ అన్నారు. కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యుఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని గోదావరిఖనిలోని రీగల్ చౌరస్తా వద్ద ఎన్ఎస్‌యుఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెంటం ఉదయ్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై ఎన్ఎస్‌యుఐ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి పెద్దెల్లి ప్రకాష్, గోదావరిఖని పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులున్నారు.

పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-పెద్దపల్లి



వేసవిలో ప్రయాణికులు, కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం బస్‌స్టాప్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్లాస్టిక్ గ్లాసులు వాడకుండా, చల్లని నీరు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డీ-83, డీ-86 కాల్వల ద్వారా ఎస్సారెస్పీ నీరు విడుదల

నవతెలంగాణ- పెద్దపల్లి



పెద్దపల్లి నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీటి కోసం డీ-83, డీ-86 ప్రధాన కాల్వల ద్వారా ఈ నెల 10 నుంచి ఎస్సారెస్పీ నీరు విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల అవసరం మేరకు మంత్రుల సహకారంతో సీఎంను ఒప్పించి చివరి తడి కోసం నీరు విడుదల చేస్తున్నామన్నారు. నాలుగు రోజుల పాటు నీరు సరఫరా చేస్తామని, రైతులు వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నీటి విడుదల చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-మేడిపల్లి



రైతులు పండించిన నాణ్యమైన ధాన్యాన్ని సరైన మద్దతు ధరకు విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం పోసాని పేట, భూషణ్‌రావు పేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ బి.ఎస్. లతతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సిరికొండలో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, పాలకవర్గ సభ్యులు, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, రైతులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

స్థలాలను పరిశీలించిన అధికారుల బృందం

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో మూతపడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ పరిసర ప్రాంతాల్లో సుమారు 6.26 హెక్టార్ల విస్తీర్ణంలో 7 ట్యాంకుల నిర్మాణం కోసం అనువైన స్థలాలను అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఇటీవల సింగరేణి సిఅండ్ఎండి ఎన్.బలరాం సింగరేణి నీటిబిందువు - జల సింధువు విశిష్ట కార్యక్రమం సింగరేణి వ్యాప్తంగా 50 మినీ చెరువుల ఏర్పాటు, అభివృద్ధి భూగర్భ జలాల పెంపుదలకు ప్రత్యేక ప్రణాళిక నీటి కుంటలుగా మూత పడిన ఓసి సంపులు, ఓవర్ బర్డెన్ గుట్టల మధ్య నీటి తటాకాలు ఏర్పాటు, సహజ చెరువులు, కుంటల్లో నీటి నిల్వకు చర్యలు, జీవావరణ వద్ధికి, జలచరాలు, పశు పక్ష్యాదుల పెరుగుదలకు చేపట్టటం జరిగింది. ఇందులో భాగంగా అధికారుల బృందం అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, ఎస్‌సి సివిల్ వర వరప్రసాద్, ఏరియా సెక్యూరిటి అధికారి వీరా రెడ్డి, మేనేజర్ మల్లికార్జున్ యాదవ్ తదితరులున్నారు.

విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీ

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం

నవతెలంగాణ-ముత్తారం



దేశంలో బీజేపీ కులం, మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టి విభజన రాజకీయాలు చేస్తుందని, రాజ్యాంగ విలువలను కాలరాస్తుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు గోవిందుల పద్మ అన్నారు. ముత్తారం మండలంలోని మచ్చుపేట, లక్కారం గ్రామాల్లో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో జై బాపూ, జై భీం, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ కోసం తరలింపు

నవతెలంగాణ-గోదావరిఖని



కంటి ఆపరేషన్ అవసరమున్న 45 మందిని హైదరాబాద్ నాన్నక్రాంగూడలోని సంకర ఐ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆలయ ఫౌండేషన్ నాయకులు లంక సురేష్ తెలిపారు. మార్చి 25న రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్‌లో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 45 మందిని గుర్తించి బుధవారం ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి పేద ప్రజలకు సేవ చేయాలని ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారని, ఇందులో భాగంగా అనేక సేవా కార్యక్రమాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సిఇఓ తీట్ల రమేష్ బాబు, కీర్తి నాగార్జున, ఎల్.సురేష్, డి.సుకుమార్, ఎల్.వెంకటేష్, బి.కిరణ్, జి.సదానందం, రాజకుమార్ తదితరులున్నారు.

గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 23 చివరి గడువు

నవతెలంగాణ-పెద్దపల్లి :తెలంగాణలోని గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు ఏప్రిల్ 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 35 గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ (టీజీఆర్‌జేసీ) సీఈటీ 2025 నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులని, మే 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో సీట్లు కేటాయిస్తారని, మొత్తం 2996 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పరీక్షలు ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారని, మరిన్ని వివరాలకు 040-24734899 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
కరీంనగర్-రాజన్న సిరిసిల్ల
గురువారం | ఏప్రిల్ 10, 2025 | www.navatelangana.com

11న అపెరల్ పార్క్‌లో యూనిట్ ప్రారంభం

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల : ఈ నెల 11న సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో టెక్స్‌పోర్ట్ యూనిట్‌ను రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. బుధవారం ఆయన అపెరల్ పార్క్‌ను పరిశీలించారు. ఈ నెల 11న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్లకు రానున్నారని కలెక్టర్ వెల్లడించారు. మంత్రుల రాక సందర్భంగా ఏర్పాట్లను రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ప్రారంభోత్సవం అనంతరం సభ ఉంటుందని ఆయన వివరించారు. ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, నాయబ్ తహశీల్దార్ విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఘనంగా వీడుకోలు వేడుకలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బుధవారం డిగ్రీ విద్యార్థుల వీడుకోలు వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకోగలరని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, కళాశాల మంచి ఫలితాలు సాధిస్తోందని, పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. విద్యార్థులు గొప్పగా చదివి కళాశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కొలిపాక రమేష్, జల్ల సుధాకర్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణిత ఒలంపియాడ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిన రుతిక్


విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి డి. శ్రీరుతిక్ గణిత ఒలంపియాడ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ, అల్ఫోర్స్ విద్యాసంస్థల సహకారంతో అందించిన శిక్షణను సద్వినియోగం చేసుకుని రుతిక్ ఈ ఘనత సాధించాడని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, పుష్పలత, సత్యనారాయణ, శారద, సుధారాణి, షరీఫ్, సమత, లక్ష్మి, వేణు, ఫర్జానా పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు


ప్రశంస పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ సరిత

నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ఒలింపియాడ్ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. 8వ తరగతికి చెందిన ఎస్. రక్షిత (గణితం), 9వ తరగతి విద్యార్థి కె. తేజేశ్వర్ (సైన్స్) ఒలింపియాడ్‌కు ఎంపికయ్యారు. వారికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ధ్రువపత్రాలు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రిన్సిపాల్ వి. సరిత అభినందించారు. ఒలింపియాడ్ విద్యార్థుల్లో సైన్స్, గణిత ప్రతిభను పెంపొందించడానికి ఒక మంచి వేదిక అని అన్నారు. ఉదయం పాఠశాల ప్రార్థన సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఎస్. రజిత, ఆర్. రజిత, స్వప్న, సైన్స్ ఉపాధ్యాయులు రాజు, సతీష్, శివశంకర్, వనజ, మధుకర్ పాల్గొన్నారు.

గన్నేరువరంలో కానిస్టేబుళ్లకు ఘన సన్మానం


సన్మానం చేస్తున్న పోలీసు బృందం

నవతెలంగాణ - గన్నేరువరం : గన్నేరువరం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లగా విధులు నిర్వహిస్తున్న నగేష్, మిత్ర హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఎస్ఐ తాండ్ర నరేష్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాధా కిషన్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మండలం కోరపల్లికి చెందిన కల్లేపల్లి మురళి అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి చిన్ననాటి మిత్రులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులు రూ.18,500 విరాళంగా ఇచ్చారు. గతంలో మురళి భార్య కూడా మృతి చెందడంతో వారి పిల్లలకు అండగా ఉంటామని మిత్రులు తెలిపారు.

తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు శిక్షణ

నవతెలంగాణ - జమ్మికుంట : ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల, స్థానిక కేవీకే ఆధ్వర్యంలో బుధవారం జమ్మికుంట మండలం మోతుకులగూడెంలో తేనెటీగల, పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సార్ యూనివర్సిటీ అధ్యాపకులు జి శ్రీకర్ రెడ్డి, డాక్టర్ డబ్ల్యూ సింగ్, డాక్టర్ గిరీష, విష్ణువర్ధన్, అశోక్ రైతులకు అదనపు ఆదాయం వచ్చే మార్గాల గురించి వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

గడువు దాటిన నిల్వలు ఉంచొద్దు

వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

నవతెలంగాణ - చొప్పదండి : ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో గడువు ముగిసిన నిల్వలు ఉంచరాదని కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి జే. భాగ్యలక్ష్మి డీలర్లకు సూచించారు. రానున్న వానాకాలం దృష్ట్యా బుధవారం మండల కేంద్రంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డీలర్లు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల రిజిస్టర్లను క్రమం తప్పకుండా నవీకరించాలని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని, ఎరువులను ఈ-పోస్ ద్వారానే అమ్మాలని స్పష్టం చేశారు. లైసెన్సులు ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకోవాలని తెలిపారు. సమావేశంలో గంగాధర ఏడీఏ ప్రియదర్శిని, మండల వ్యవసాయ అధికారి వి. వంశీకృష్ణ, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారంపై అవగాహన

చిన్నారులకు అసైన్‌మెంట్ కార్డులు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ 8వ డివిజన్‌లో గల అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం పోషణ్ పక్వాడ, ప్రీస్కూల్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం గురించి గర్భిణులకు, బాలింతలకు వివరించారు. ప్రీ స్కూల్ మేళాలో భాగంగా చిన్నారులకు అసైన్‌మెంట్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శ్రీమతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుల్తానా, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ ప్రణీత, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

జమ్మికుంట మార్కెట్‌లో పత్తికి గరిష్ట ధర రూ.7,520

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 75 క్వింటాళ్ల కాటన్ విడిపత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్ గరిష్ట ధర రూ. 7,520, మోడల్ ధర రూ. 7,390, కనిష్ట ధర రూ. 7,150 పలికిందని మార్కెట్ సెక్రటరీ ఆర్. మల్లేశం తెలిపారు. కాటన్ బస్తాల్లో 5 క్వింటాళ్ల పత్తిని నలుగురు రైతులు అమ్మకానికి తీసుకురాగా, గరిష్ట ధర రూ. 6,300, మోడల్ ధర రూ. 6,000, కనిష్ట ధర రూ. 5,600 పలికిందని ఆయన పేర్కొన్నారు.

అన్యాయాలను ఎండగట్టడమే బీఆర్ఎస్ లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - గంగాధర : తెలంగాణకు నీళ్లు, నిధులు, నియామకాల్లో జరిగిన అన్యాయాన్ని ఎదిరించి ప్రజల పక్షాన నిలిచిన బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం గంగాధర మండలం మధురానగర్‌లో జరిగిన చొప్పదండి నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణయుగం వంటిదని కొనియాడారు. రాబోయే భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ సభకు చొప్పదండి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్లు వీర్ల వెంకటేశ్వర్ రావు, దూలం బాలాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్న బియ్యం లబ్ధిదారులతో

ఎమ్మెల్యే సహపంక్తి భోజనం



నవతెలంగాణ - రామడుగు : మండలంలోని దశరాజుపల్లి గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పేద ప్రజలు దొడ్డు బియ్యం తినలేక ఇబ్బందులు పడేవారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ధనిక, పేద తేడా లేకుండా అందరూ సన్న బియ్యం తినేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దశరాజుపల్లి దళిత కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి ముదిరాజ్, వైస్ ఛైర్మన్ సత్యం రెడ్డి, మాజీ ఎంపీపీ జవాజి హరీష్ పాల్గొన్నారు.

మానేరు వాగులో చెక్ డ్యామ్ పునర్నిర్మించాలి


చెక్ డ్యామ్ పరిశీలిస్తున్న కలెక్టర్


నవతెలంగాణ - సిరిసిల్ల : సిరిసిల్ల మానేరు వాగులో దెబ్బతిన్న చెక్ డ్యామ్‌ను పునర్నిర్మించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం ఆయన ఈఎన్సీ శంకర్‌తో కలిసి సాయిబాబా ఆలయం సమీపంలోని దెబ్బతిన్న చెక్ డ్యామ్‌ను పరిశీలించారు. వెంటనే పునర్నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. మానేరు బ్రిడ్జి నుంచి సాయిబాబా ఆలయం వరకు మూడు కిలోమీటర్ల పొడవునా కరకట్ట పునర్నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈఈలు అమరేందర్ రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ - వీర్నపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్ సూచించారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ డైరెక్టర్ నరేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ. 2300 మద్దతు ధర లభిస్తుందని, సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్‌ను ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లేశం, ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మన్, మాజీ ఎంపీటీసీ అరుణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బాబు, శ్రీనివాస్, తిరుపతి, ఏపీఎం నర్సయ్య, డైరెక్టర్లు మదన్ లాల్, నర్సింగం, నరేష్, మాజీ సర్పంచ్ రాజు, గ్రామ సమైక్య సంఘం అధ్యక్షురాలు విజయ, రైతు సంఘం అధ్యక్షులు హరీష్, సీసీ రాధ, సీఏ జయ శీల పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


జెండాను ఎగురవేస్తున్న ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గండు ప్రశాంత్ యాదవ్

నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఎన్ఎస్ యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి గండు ప్రశాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ యూఐ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యూఐ అసెంబ్లీ అధ్యక్షుడు హనుమ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మోరే అజయ్, ప్రధాన కార్యదర్శి గుండారపు మహేష్, మండల అధ్యక్షులు బొంగురు కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేకల తిరుపతి, కాజీపేట శ్రీనివాస్, సొల్లు బాబు, మధు, కోలిపాక శంకర్, ఎడ్ల అఖిలేష్, కొలుపుల శ్రీకాంత్, సంపత్, బన్నీ, రామ్మోహన్, వైనాల వంశీకృష్ణ, మహిళా పాల్గొన్నారు.



నవతెలంగాణ - సిరిసిల్ల : సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సాయి ప్రసాద్ యాదవ్, ఉపాధ్యక్షుడు గండికోట సురేష్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట గాంధీ చౌరస్తాలో ఎన్ఎస్ యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిని రవి, మండల అధ్యక్షుడు పరుషురామ్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న మండల విద్యాధికారి

నవతెలంగాణ - చొప్పదండి : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి మండల విద్యాధికారి దీక్షితులు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుమ్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 40 మంది విద్యార్థులకు వర్క్ సైట్ స్కూల్ బ్యాగులను జిల్లా యంత్రాంగం అందించగా, వాటిని ఎంఈఓ శ్రీనివాస్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు డ్రాయింగ్ బుక్స్, స్కెచ్‌లు, మధ్యాహ్న భోజనం, ఇంగ్లీష్‌లో విద్యాబోధన వంటి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఇటుక బట్టీల యజమానుల సహకారంతో ప్రతి విద్యార్థికి స్పోర్ట్స్ కిట్ అందజేస్తామని కలెక్టర్ చెప్పినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక పండుగలు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


పోచమ్మ బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - గంగాధర : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు పండుగలు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం ఇస్లాంపూర్‌లో నిర్వహించిన రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, ఉప్పరమల్యాలలో జరిగిన పోచమ్మ బోనాలలో మహిళలు ఇంటింటి నుంచి బోనాలు ఎత్తుకుని రాగా, ఎమ్మెల్యే కూడా బోనం ఎత్తుకుని వారితో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ పాల్గొన్నారు.

హనుమాన్ పూజలో కేటీఆర్


స్వాములతో కలిసి భోజనం చేస్తున్న కేటీఆర్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షా స్వాములకు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు కేటీఆర్‌కు వేదాశీర్వచనాలు అందించిన అనంతరం, హనుమాన్ మాలధారులతో కలిసి ప్రత్యేక పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కేటీఆర్ హనుమాన్ దీక్ష స్వీకరించిన స్వాములతో కలిసి భోజనం చేశారు. సిరిసిల్ల పట్టణం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో హనుమాన్ మాలధారణ స్వాములు ఈ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్ర



నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ మండలంలోని రంగాపూర్ గ్రామంలో బుధవారం 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొల్లూరి కిరణ్, మండల అధ్యక్షురాలు రాధ, గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డబోయిన కొమరయ్య, మార్కెట్ డైరెక్టర్ రాజయ్య పాల్గొన్నారు.


యాత్రలో మాట్లాడుతున్న రవీంద్రా చారి

నవతెలంగాణ - మానకొండూర్ : ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్ర బుధవారం మండల పరిధిలోని ఖాదర గూడెం, ఈదులగట్టేపల్లి గ్రామాల్లో జరిగింది. ఈ యాత్రలో పాల్గొన్న రవీంద్రా చారి మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే


ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - గన్నేరువరం : మండలంలోని పారువెల్ల, కాసింపేట, చాకలివానిపల్లి గ్రామాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసుకు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జెల్లా రాజేశ్వరి పాల్గొన్నారు.



నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండలంలోని కిష్టంపేట, రెడ్డిపల్లి, కనపర్తి, వల్బాపూర్ గ్రామాల్లో బుధవారం 'జై బాబు, జై భీమ్, జై సంవిధాన్' రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కొనసాగింది. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి ఈ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదాసు సునీల్, కామెడీ శ్రీపతి రెడ్డి, నల్లగోని సతీష్, రషీద్ పాషా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమ్మిడి రాకేష్ రెడ్డి, చిన్నాల ఐలయ్య, ఎండి సాహెబ్ హుస్సేన్, గంగాడి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

తుమ్మనపల్లిలో తేనెటీగల దాడి

పలువురు విద్యుత్ ఉద్యోగులకు గాయాలు

నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామంలో బుధవారం విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు కొడుతుండగా తేనెటీగలు దాడి చేయడంతో పలువురు విద్యుత్ ఉద్యోగులు గాయపడ్డారు. తాడికల్ ఫీడర్‌పై తుమ్మనపల్లి వద్ద చెట్లు కొడుతుండగా అక్కడి తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఫోర్‌మెన్ తాండ్ర పురుషోత్తం, ఎల్ఐ శ్రీనివాస్, ఎల్ఎం రుద్రారపు స్వామి, ఏఎల్ఎం కే తిరుపతి, గట్టు బళ్ళు, షబ్బీర్, శాంతన్, జి రమేష్ గాయపడ్డారు. వారిని వెంటనే హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, ఎస్సార్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. గాయపడిన వారిని హుజురాబాద్ డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ శ్రీనివాస, టౌన్ ఏఈఎం శ్రీనివాస్ గౌడ్, రూరల్ ఏఈ పి జనార్ధన్, ఇతర ఉద్యోగులు పరామర్శించారు.

నిద్రిస్తున్న ఇద్దరిపైకి దూసుకెళ్లిన కారు

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలో కారును అజాగ్రత్తగా నడిపి ఇద్దరి కాళ్లకు గాయాలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వరగంటి రవి తెలిపారు. ఈ నెల 7న రాత్రి ఆదిత్య కాటన్ మిల్లు ఎదురుగా నిద్రిస్తున్న లారీ డ్రైవర్లు సుమన్ కుమార్ మహత్, పబిత్రలపై మోత్కులగూడెంకు చెందిన పొన్నగంటి సాత్విక్ తన కారును అతివేగంగా నడపడంతో వారికి గాయాలయ్యాయని ఫిర్యాదు అందిందని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

సిలిండర్ ధరల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అరుణ్ కుమార్



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ - వీర్నపల్లి : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచడాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అరుణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రూ.50 మేర ధర పెంచడం సామాన్య ప్రజలపై మరింత భారం మోపడమేనన్నారు. పెట్రోల్, డీజిల్‌పై ప్రత్యేక ఎక్సైజ్ సుంకం విధించడాన్ని కూడా ఆయన నిరసించారు. ఈ ధరల పెంపుతో ప్రజలపై దాదాపు రూ.7వేల కోట్ల భారం పడుతుందని ఆయన ఆరోపించారు. ద్రవ్యోల్బణం కారణంగా ప్రజల జీవితాలు ఇప్పటికే కష్టంగా మారాయని, తాజాగా గ్యాస్ ధరల పెంపు మరింత ప్రభావం చూపుతుందని ఆయన విమర్శించారు. అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు తగ్గినప్పటికీ, ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించకుండా ప్రభుత్వం భారాలు మోపుతోందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ ధరలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజెల్లయ్య, నరేందర్ పాల్గొన్నారు.

పేదలకు భారం, కార్పొరేట్లకు లాభాలే కేంద్ర ప్రభుత్వ విధానం


చెల్పూరి రాములు

నవతెలంగాణ - జమ్మికుంట : కేంద్ర ప్రభుత్వ విధానాలు పేద ప్రజలకు భారంగా, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయని ఇల్లంతకుంట సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చెల్పూరి రాము విమర్శించారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో ధరలు పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఈ ధరల పెంపు మరింత భారం మోపుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మొద్దు


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కానిస్టేబుల్

నవతెలంగాణ - వీర్నపల్లి : సైబర్ నేరగాళ్లు చెప్పే మాటలను ప్రజలు నమ్మవద్దని హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య సూచించారు. వీర్నపల్లి మండల కేంద్రంలో పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య మాట్లాడుతూ, 80శాతం సైబర్ నేరాలు మొబైల్ ద్వారానే జరుగుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు చెప్పరాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కార్తిక్, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


సీసీ రోడ్ నిర్మాణానికి భూమి పూజలో

నవతెలంగాణ - హుజురాబాద్ : రాష్ట్రంలో ఏ అభివృద్ధి పనులు జరగాలన్నా అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ కౌన్సిలర్ తోట రాజేంద్రప్రసాద్ అన్నారు. హుజురాబాద్ పట్టణం 30వ వార్డులోని గాంధీ నగర్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి మాజీ కౌన్సిలర్ తోట రాజేంద్రప్రసాద్ అభ్యర్థన మేరకు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేయించారు. ఈ రోడ్డు పనులకు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈ సాంబరాజుతో కలిసి తోట రాజేంద్రప్రసాద్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నూతన ఏఈ సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

రోడ్డెక్కిన శంకరపట్నం రైతులు



నవతెలంగాణ - శంకరపట్నం : మండల కేంద్రం బుధవారం ఉదయం ఉద్రిక్తంగా మారింది. కరీంపేట, కేశవపట్నం గ్రామాలకు చెందిన రైతులు సాగునీరు అందక తమ కళ్లెదుటే పంటలు ఎండిపోతుండటంతో ఆందోళనతో మండల కేంద్రానికి చేరుకున్నారు. చేసేది లేక వారంతా జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. "మా వరి పంటలు ఎండిపోతున్నాయి సారూ... ఎస్సారెస్పీ నీళ్లు చివరి తడి ఇస్తే బతికిపోతాయి," అంటూ రైతులు నినాదాలు చేశారు. రహదారిపై రైతులు బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. శంకరపట్నం ఏఎస్ఐ సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారి సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే, తక్షణమే సాగునీరు అందించకపోతే మళ్లీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేరెళ్ల ఘటన బాధితులకు న్యాయం చేయాలి

కోల హరీష్ డిమాండ్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : నేరెళ్ల ఘటనలో తమకు న్యాయం జరగాలని, కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బాధితుడు కోల హరీష్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరెళ్ల ఘటన జరిగినప్పటి నుండి తాము ఎంపీ బండి సంజయ్‌ను నమ్ముకున్నామని, కానీ ఇప్పటి వరకు న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కమిషన్ రిపోర్ట్ పంపించి న్యాయం చేయాలని వేడుకున్నా పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. బండి సంజయ్ అనుచరుడు తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల బాధితులు పసుల ఈశ్వర్, పసుల రాజయ్య, కోళ్ల వినయ్ పాల్గొన్నారు.

ఫిట్టర్ సంపత్ రావుపై విచారణ పూర్తి

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఫిట్టర్ సంపత్ రావుపై వచ్చిన ఫిర్యాదుపై ఆర్డీఎంఏ షాహిద్ మసూద్ బుధవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు పబ్బు శ్రీనివాస్‌ను, సంపత్ రావును విచారించారు. ఫిట్టర్ విధులు నిర్వహించడానికి సరైన పత్రాలు లేవన్న ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపినట్లు ఆర్డీఎంఏ తెలిపారు. పూర్తి నివేదికను సీడీఎంఏ అధికారికి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మొహమ్మద్ ఆయాజ్, మేనేజర్ జి రాజిరెడ్డి, మేనేజర్ ఆర్డీ ఆఫీస్ గుర్రపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీలు.. ప్రజాస్వామానికి విరుద్ధం

- రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వీడీసీలపై చర్యలు తీసుకోవాలి
- తాళ్లరాంపూర్ గీత కార్మికుల బహిష్కరణ అమానుషం : కేజీకేఎస్ రాష్ట్ర నాయకులు పెద్ది వెంకట్‌రాములు, రమేష్ గౌడ్



నవతెలంగాణ-ఏర్గట్ల

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ)లు నడుస్తున్నాయని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వీడీసీలపై చర్యలు తీసుకోవాలని కేజీకేఎస్ రాష్ట్ర నాయకులు పెద్ది వెంకట్ రాములు, రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గౌడ సంఘ సభ్యుల బహిష్కరణ ఆటవిక చర్య అన్నారు. బుధవారం వారు తాళ్లరాంపూర్‌లో గౌడ సంఘం సభ్యులను కలిసి మాట్లాడారు. వీడీసీ ఆంక్షల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ సామాజిక తరగతి మహిళలను వీడీసీ సభ్యులు కుంకుమార్చనలో పాల్గొననీయకుండా అవమానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా గ్రామకమిటీలు సమాంతర ప్రభుత్వ పాలన చేస్తున్నాయని అన్నారు. గ్రామాల్లో కల్లు గీసుకునే వారు, చిన్నా చితక వ్యాపారాలు చేసుకునే వారు గ్రామ కమిటీలకు ఎందుకు డబ్బులు కట్టాలి..? ప్రభుత్వానికి పన్నులు కడుతున్నాం కదా.. అవి సరిపోదా అని ప్రశ్నించారు. గౌడ సామాజిక తరగతి వారిని బహిష్కరించిన వీడీసీ సభ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు గౌడ సంఘ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోయేడి నర్సింహులుగౌడ్, శ్రీరామ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, తాళరాంపూర్ గౌడ సంఘ సభ్యులు ఉన్నారు.

ప్రజలను లూటీ చేయడానికే గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల పెంపు

నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు : సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేద ప్రజలను లూటీ చేయడానికే కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను తగులబెట్టాలనీ, వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జీఎస్టీపేరుతో ప్రజల జేబులను గుల్ల చేస్తున్న కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2 పెంచడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. మోడీ, షాలు కలిస్తే మోసాలు చేయడమే అని విమర్శించారు. దేశవనరులను కార్పొరేట్లకు కట్టబెడుతూనే మరోవైపు రాయితీలు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. మోసపూరిత విధానాలను కప్పిపుచ్చుకునేందుకే మతోన్మాదులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర తగ్గుతుంటే మన దేశంలో మాత్రం రేట్లు పెంచడం దుర్మార్గమని పేర్కొన్నారు.

టన్నెల్‌లో లోకో ట్రైన్ ట్రాక్ పునరుద్ధరణ

పరిశీలిస్తున్న అధికారులు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల ప్రమాద ప్రాంతం సమీపానికి లోక్ ట్రైన్ ట్రాక్ పునరుద్ధరణ పూర్తయింది. ఆ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. టన్నెల్ ఆఫీస్ వద్ద బుధవారం సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష నిర్వహించారు. టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలు ముమ్మరం చేసినట్టు, సొరంగం లోపల మట్టి తవ్వకాలకు అనుగుణంగా లోకో ట్రైన్ ట్రాక్‌ను పునరుద్ధరించినట్టు, మట్టి తవ్వకాలు, స్టీల్ కత్తిరింపు పనులు, డీ వాటరింగ్ ప్రక్రియ సమాంతరంగా కొనసాగుతున్నట్టు ప్రత్యేక అధికారి వివరించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మైన్స్ సీనియర్ శాస్త్రవేత్త జీసీ నవీన్, నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాసులు, కంపెనీ సీనియర్ ఇంజినీర్ సంజయ్ కుమార్ సింగ్ ప్రమాద ప్రదేశంలో పరిస్థితులను పరిశీలించినట్టు తెలిపారు. మట్టి తవ్వకాలకు అనుగుణంగా కన్వేయర్ బెల్ట్ వెంటిలేషన్ ప్రక్రియ ముందుకు కొనసాగిస్తున్నట్టు, నిరంతరం సహాయక చర్యలు చేపడుతున్నట్టు ప్రత్యేక వివరించారు. ఈ సమావేశంలో ఆర్మీ అధికారులు, జేపీ కంపెనీ ప్రతినిధులు, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారులు, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి తదితరులు పాల్గొన్నారు.

159 మంది నకిలీ డాక్టర్లపై కేసులు నమోదు

డీసీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా ఔషధాలను నిల్వ ఉంచి, విక్రయిస్తున్న 159 మంది నకిలీ వైద్యులపై జనవరి నుంచి కేసులు నమోదు చేసినట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) తెలిపింది. ఈ మేరకు బుధవారం డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. తాజాగా విశ్వసనీయ సమాచారం మేరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం, మేడారం గ్రామం హరిత కాకతీయ హోటల్ సమీపంలో అవసరమైన అర్హత లేకుండా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న నకిలీ వైద్యులు గడం మనోజ్ ప్రాంగణంపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ తదితర 35 రకాల ఔషధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.18 వేలు. అర్హత లేకుండా ఇష్టానుసారంగా స్టెరాయిడ్స్ వాడితే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని అధికారులు హెచ్చరించారు. నకిలీ వైద్యునిపై కేసు నమోదు చేశారు. చట్టవిరుద్ధంగా ఔషధాలు నిల్వ ఉంచుకోవడం, విక్రయించడం లాంటివి ప్రజలు గమనిస్తే పని రోజుల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 1800 599 6969కు టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని అధికారులు సూచించారు.





ఇరాన్‌లోని టెహ్రాన్‌లోని ఫెలెస్టిన్ (పాలస్తీనా) స్క్వేర్‌లో జరిగిన ఇజ్రాయిల్‌కు వ్యతిరేక ప్రదర్శనలో ఇరానియన్ నిరసనకారులు. మరో వైపు లిబియా రాజధాని ట్రిపోలీలోనూ నిరసన ప్రదర్శనలు కొనసాగాయి.

తాత్కాలికంగా ఆశ్రయమిస్తాం

- పాలస్తీనియన్లకు సాయపడేందుకు ముందుకొచ్చిన ఇండోనేషియా

జకార్తా : గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న సుదీర్ఘ దాడుల కారణంగా నిర్వాసితులైన పాలస్తీనియన్లకు తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి సిద్ధంగా వున్నట్లు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొ సుబియాంటో బుధవారం చెప్పారు. గాయపడిన వారికి సాదరంగా ఆశ్రయం కల్పించడానికి తాము సిద్ధమని చెప్పారు. మధ్య ప్రాచ్య దేశాల్లో పర్యటనకు బయలుదేరుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వారిని ఇక్కడకు తీసుకురావడానికి విమానాలు పంపేందుకు కూడా రడీగా వున్నామన్నారు. మొదటి దశలో వెయ్యి మందిని తీసుకురావచ్చని అంచనా వేసినట్లు చెప్పారు. గాయడిన వారికి, అనాధలైన చిన్నారులకు ముందుగా ప్రాధాన్యతనివ్వనున్నట్లు తెలిపారు. వారిని అక్కడ నుండి ఎలా తరలించాలనే విషయమై పాలస్తీనా అధికారులతో, అలాగే ఆ ప్రాంతంలోని ఇతర పక్షాలతో మాట్లాడాల్సిందిగా తమ విదేశాంగ మంత్రిని ఆదేశించానని చెప్పారు. వారు పూర్తిగా కోలుకునేవరకు ఇండోనేషియాలోనే వుంటారన్నారు. వారిని సురక్షితంగా తిరిగి పంపిస్తామన్నారు. గత నెల్లో ఇజ్రాయిల్ మిలటరీ దాడులను పునరుద్ధరించిన తర్వాత దాదాపు 4లక్షలమంది గాజావాసులు నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. కాగా ప్రపంచంలోనే అత్యధికంగా ముస్లిం జనాభా కలిగిన ఇండోనేషియా ఇజ్రాయిల్, పాలస్తీనా ఘర్షణలకు రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమని స్పష్టం చేస్తోంది.

గాజాలో 29మంది మృతి, 80మంది గల్లంతు

ఉత్తర గాజా ప్రాంతమైన షుజయె జిల్లాలో ఇజ్రాయిల్ మిలటరీ జరిపిన శక్తివంతమైన వైమానిక దాడుల్లో చిన్నారులతో సహా 29మంది పాలస్తీనియన్లు మరణించగా, 55మంది గాయపడ్డారు. మరో 80మంది గల్లంతయ్యారు. సీనియర్ హమాస్ నేతను లక్ష్యంగా చేసుకునే తాము ఈ దాడులు జరిపినట్లు ఆర్మీ ప్రకటించింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని నబ్లస్ ఏరియాలో ఇద్దరు పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకోగా, బలాటా శరణార్ధ శిబిర ప్రవేశ ద్వారాన్ని దాదాపు 300కి పైగా మిలటరీ వాహనాలు చుట్టుముట్టాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇజ్రాయిల్ సైనికులు పాలస్తీనియన్ల ఇళ్ళలోకి చొరబడి దాడులు చేస్తూ, ఐదుగురిని అరెస్టు చేశారని వార్తలందాయి. బెత్లెహామ్‌కు పశ్చిమాన గల హుసాన్ గ్రామంపై దాడి చేసి డజన్ల సంఖ్యలో గ్రామస్తులను అదుపులోకి తీసుకుని సైన్యం ఇంటరాగేట్ చేస్తోంది.

జీవో తెచ్చిన తంటా

ప్రశ్నార్థకంగా మారిన ఉద్యోగ భద్రత

- ఆయుష్ విభాగంలోకి అల్లోపతి ఫార్మాసిస్టులా?
- 20 ఏండ్ల కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఆందోళన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ జారీ చేసిన ఒక జీవో ఇప్పటికే కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు చేస్తున్న వారిని ఆందోళనకు గురి చేస్తున్నది. ఆయుష్ విభాగంలో ఫార్మాసిస్టుల పోస్టుల అర్హతను నిర్ణయిస్తూ మార్చి 28న వైద్యారోగ్యశాఖ జీవో నెంబర్ 65ను జారీ చేసింది. దీంతో ఆయుష్ విభాగంలో ఉన్న ఫార్మసిస్టు ఖాళీలకు అల్లోపతిలో డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా డి కోర్సులు చేసిన అర్హత లభిస్తున్నది. అవసరమైతే వీరికి ఎంపికైన తర్వాత ఆయుర్వేద, యునానీ, హోమియోలో ఆరు నెలల సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫార్మసీని ఒక సంవత్సరంలోపు మూడు ప్రయత్నాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంతో ఇప్పటికే ఆయుష్ విభాగంలో కాంపౌండర్లు (ఫార్మాసిస్టులు)గా పని చేస్తున్న 337 మంది కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఉద్యోగ భద్రత ప్రశ్నార్థంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆయుష్ విభాగంలో 520 మంజూరైన పోస్టులుండగా 308 ఖాళీలుండగా, 62 మంది రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ప్రాతపదికన పని చేస్తున్నారు. 2005 సంవత్సరంలో ఈ 62 మంది ఆయుష్ కాంపౌండర్లు కాంట్రాక్ట్ ప్రాతపదికన కాంపౌండర్ సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా 10వ తరగతి అర్హతతో తీసుకున్నారు. ఆ తర్వాత సవరించిన ఇంటర్మీడియట్ విద్యార్హతతో ట్రెజరీ ద్వారా వేతనాలు పొందుతున్నారు. ఒక సంవత్సరం ఇన్ సర్వీస్ ట్రైనింగ్ (ఆయుర్వేద, హోమియో, యునాని) సర్టిఫికెట్ తో 20 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. 2017లో గత బీఆర్ఎస్ సర్కారు కాంపౌండర్ పేరును ఫార్మసిస్టుగా మార్చి, ఈ పోస్టుకు 2 సంవత్సరాల ఆయుష్ డిప్లొమా ఫార్మసీ కోర్స్ (ఆయుర్వేద, హోమియో, యునానీ)గా నిర్ణయిస్తూ జీ.వో.నెంబర్ 147ను విడుదల చేసింది. అయితే జీవోకు అనుగుణంగా 2017 నుంచి 2025 వరకు రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో ఈ కోర్సును ప్రవేశపెట్టకపోవడంతో అభ్యర్థులకు ఈ కోర్సును చేసే అవకాశం అందుబాటులోకి రాలేదు. ఈ కోర్సును ప్రవేశపెట్టాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. వీరితో పాటు మరో 275 మంది నేషనల్ హెల్త్ మిషన్ కింద 2008 లో నియమితులై కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. వీరిలో 62 మంది ఉద్యోగాలు వెంటనే ప్రమాదంలో పడనుండగా, మిగిలిన 275 మంది సర్వీసులు కూడా భవిష్యత్తులో ఇబ్బందుల్లో పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఈ నేపథ్యంలో తాజాగా ఆయుష్ విభాగంలో ఉన్న ఫార్మసిస్ట్ పోస్టులకు అల్లోపతి ఫార్మసి కోర్సులు చేసిన వారిని అర్హులుగా నిర్ణయించడం నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ (ఎన్‌సీఐఎస్‌ఎం) నిబంధనలకు విరుద్ధమనే వాదన వినిపిస్తున్నది. దీంతో 20 ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇతర ఉద్యోగాలకు అర్హత లేక, వయో పరిమితి కూడా దాటిపోయిన దశలో ఉన్న ఉద్యోగాలు కోల్పోవడమే కాకుండా కొత్తగా వేసే నోటిఫికేషన్ ప్రకారం అర్హత లేకపోవడంతో పరీక్ష కూడా రాయలేని పరిస్థితిలోకి నెట్టబడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకుని తమకే ఇన్ సర్వీస్ శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ప్రభుత్వ సలహాదారు కేకేకు తెలంగాణ ఉద్యోగ జేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో బుధవారం ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావును కలిసి వినతి పత్రం అందించారు. ఉద్యోగుల కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలనీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులపై సీలింగ్ పెంచడంతో పాటు వెంటనే క్లియర్ చేయాలనీ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో ప్రస్తుతమున్న ధరల ప్రకారం చికిత్స అందించాలనీ, ఇ-కుబేర్ ద్వారా ప్రాధాన్యతా ప్రాతిపదికన గ్రీన్ ఛానెల్ ద్వారా రూ.10 లక్షల వరకు బిల్లులు చెల్లించాలని కోరారు. సాధారణ బదిలీలు ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో చేపట్టాలనే మొదలగు 37 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచామని లచ్చిరెడ్డి తెలిపారు. జేఏసీ వినతిపై సానుకూలంగా స్పందించిన కేశవరావు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే నిర్వహించనున్న క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. అంతకు ముందు జీఏడీ (పొలిటికల్) ముఖ్యకార్యదర్శి రఘునంధన్ రావును కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ, టీపీయూఎస్ ప్రెసిడింట్ హన్మంత్ రావు, తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు దర్శన్ గౌడ్, టీఈఏ అధ్యక్షులు డా.జి.నిర్మల, టీజీటీఏ ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, ఎస్టీటీయూ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి


- అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా రూ.25.41 కోట్ల వ్యయం
- వేగంగా కొనసాగుతున్న పనులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీం ద్వారా రూ.25.41 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి పనుల్ని చేపడుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. తెలంగాణలో ఈ పథకం ద్వారా రూ.2,737 కోట్ల అంచనా వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామనీ, వాటిలో కొన్ని స్టేషన్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దానిలో భాగంగానే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనుల్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో పునరాభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్‌కు గొప్ప చరిత్ర ఉన్నదనీ, దీనికి సమీపంలోని గనుల నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు రవాణా జరుగుతుందని వివరించారు. అలాగే హైదరాబాద్, విజయవాడ, వరంగల్ సహా పలు ప్రధాన నగరాలను కలుపుతూ కీలకమైన రవాణా కేంద్రంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. భద్రాచలంలోని ప్రసిద్ధ శ్రీ రామచంద్రస్వామి ఆలయానికి ప్రవేశ ద్వారంగా ఉంటూ, ఏటా లక్షలాదిమంది యాత్రికులు, పర్యాటకులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. ఇటీవలే ఈ లైన్లో విద్యుదీకరణ పనులు పూర్తిఅయ్యాయనీ, భద్రాచలం రోడ్ - సత్తుపల్లి మధ్య కొత్త రైల్వే లైన్‌ను సింగరేణి కాలరీస్‌తో కలిసి నిర్మాణం చేశామనితెలిపారు. ఉన్నాయి. ప్రస్తుతం రూ.25.41 కోట్ల అంచనా వ్యయంతో వెయిటింగ్ రూములు, ఎస్కలేటర్, లిఫ్ట్‌తో పాటు మెరుగైన ప్రయాణీకుల సౌకర్యాలతో ఆధునీకరిస్తున్నామన్నారు. నాన్-సబర్బన్ గ్రేడ్-4 (ఎన్ఎస్‌జి-4)గా వర్గీకరించబడిన భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. డోర్నకల్-మణుగూరు సెక్షన్‌లో ఈ స్టేషన్ రూ.7.61 కోట్ల వార్షిక ఆదాయంతో, సగటున రోజుకు 8,020 మంది ప్రయాణీకుల రాకపోకలతో సేవలను అందిస్తున్నదని వివరించారు. 12 మీటర్ల వెడల్పుతో పాదచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జి), లిఫ్ట్, ఎస్కలేటర్, వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ప్లాట్‌ఫామ్ ఎత్తును కూడా పెంచుతున్నామనీ, బయో టాయిలెట్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 45 శాతం పనులు పూర్తయ్యాయనీ, త్వరలోనే వందశాతం పనుల్ని పూర్తిచేసి, ప్రయాణీకులకు అందుబాటులోకి తెస్తామన్నారు.

అనంతకృష్ణన్ మృతికి సీఎం సంతాపం



(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తండ్రి, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సాహితీవేత్త హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గాంధీ మహాత్ముడి సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న అనంతకృష్ణన్ గొప్ప దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమికుడు అని కొనియాడారు. ఆయన మరణం బాధాకరమని సంతాపం తెలిపారు. అనంతకృష్ణన్ నాలుగుసార్లు శాసనసభకు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా సేవలు అందించారని గుర్తుచేశారు. తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న మాజీ గవర్నర్ తమిళసైకి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఆర్జీయూకేటీలో తాత్కాలిక అధ్యాపకుల నిరసన

- అదనపు బాధ్యతలకు రాజీనామా
- జీఓ 21ను రద్దు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-భైంసా

ఆర్జీయూకేటీ బాసరలో తాత్కాలిక అధ్యాపకులు ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 21కి వ్యతిరేకంగా వారి అదనపు బాధ్యతలకు బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఏఓ రణధీర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పరిపాలన కార్యాలయం ముందర ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు చదువులు చెబుతూ, పరిపాలనా బాధ్యతలు కూడా నిర్వర్తిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సేవలకు గుర్తింపు లేకపోవడమే కాకుండా క్రమబద్ధీక రణకు సంబంధించి ఎటువంటి నిర్ణయమూ తీసుకోకుండా ప్రభుత్వం నిర్ల క్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఓ 21ను రద్దు చేసి, ముందుగా తమను క్రమబద్ధీకరించాలని, ఆ తర్వాత మిగిలిన ఖాళీల్లో నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై తక్షణమే స్పందించకపోతే ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, కృష్ణప్రసాద్, శంకర్, దేవరాజ్, వినోద్, మందా సతీష్, విజయ్, శ్రీశైలం పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలి మృతి

నవతెలంగాణ-పరకాల




(ఫైల్)

పరకాల మున్సిపాలిటీలోని సీతారాంపురానికి చెందిన కుసుంబ మోతేరావు(50) రోజువారీ కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. మంగళవారం పనికి వెళ్లి వడదెబ్బకు గురయ్యాడు. అనంతరం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

డిజిటల్ విద్యతో శ్రేష్టమైన విద్యావకాశాలు

ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిజిటల్ విద్యా కార్యక్రమాలతో శ్రేష్ఠమైన విద్యావకాశాలు మెరుగవుతాయని ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇంటర్మీ డియట్ కార్యాలయంలో కమ్యూనికే షన్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై ప్రాజెక్ట్ సర్వ తొలి ఆన్‌లైన్ సెషన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అధ్యాపకుల కొరత, నైపుణ్యాల్లో లోపాలు, డ్రాప్ అవుట్ రేట్లు వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా డిజిటల్ విద్యా కార్యక్రమం తొలి దశలో పైలట్ కార్యక్రమంగా నాంపల్లి గవర్నమెంట్ వృత్తి జూనియర్ కాలేజ్, చంచల్‌గూడ గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో డిజిటల్ తరగతులను ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నిరంతర విద్యా అవకాశాలను అందించేందుకు పరిమిత విద్యా సిబ్బంది ఉన్న కాలేజీలకు భాగస్వామ్య డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా పాఠాలు ప్రసారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనికేషన్ స్కిల్ నిపుణులు వరప్రసాద్ సమర్థవంతమైన కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పాఠాలు అందించారు.

చిరుత దాడిలో ఆవు దూడ మత్యువాత

చిరుత సంచారంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



చిరుత దాడిలో నాలుగు నెలల ఆవు దూడ మృత్యువాతపడింది. ఈ ఘటన బుధవారం మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామంలో జరిగింది. ఆస రాజయ్య ఆవు దూడను పశువుల పాకలో కట్టేసి వెళ్లాడు. బుధవారం ఉదయం పాకలో నుంచి పశువులను బయటకు పంపిద్దామని చూసేసరికి ఆవు దూడ చనిపోయి కనిపించింది. సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు చిరుత పులి దాడిలో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పులి సంచారం చేస్తుందని ఫారెస్ట్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు.



హాట్ సమ్మర్‌లో కూల్‌గా..

మే నెల రాకముందే ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అలా కాసేపు బయటికి వెళ్లినా ఒంట్లోని శక్తి మొత్తం ఎవరో స్ట్రా వేసి పీల్చినట్టే అనిపిస్తుంది. ఇక వేసవి తాపం కారణంగా డీహైడ్రేషన్, వడ దెబ్బ, అతిసారం వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఇలా వేసవితో ముడిపడి ఉండే ఇటువంటి సమస్యలకు బార్లీ, మజ్జిగతో చెక్ పెట్టొచ్చు. అలాగే ఈ వేడిని తట్టుకోలేక పిల్లలు ఎక్కువగా ఐస్‌క్రీం అడుగుతుంటారు. అలాంటప్పుడు ఇంట్లోనే ఆరోగ్యకరంగా ఐస్‌క్రీం కూడా చేసి పెట్టొచ్చు.

బార్లీ జావ

ఉపయోగాలు: బార్లీలో శరీర వేడిని తగ్గించి తక్షణ శక్తిని అందించే గుణాలు పుష్కలంగా ఉంటాయి. దీనిలో కాల్షియం, ఫైబర్, ఇనుము, మెగ్నీషియం, మాంగనీస్, జింక్, కాపర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఈ పోషకాలు గుండె ఆరోగ్యం, అజీర్తి, డీహైడ్రేషన్, డయాబెటిస్ కంట్రోల్‌తో పాటు



బరువు తగ్గడానికి ఉపయోగపడతాయి.

కావాల్సిన పదార్థాలు: బార్లీ - ఒకటిన్నర గ్లాసు, నీళ్లు - 3 గ్లాసులు, ఉప్పు - రుచికి సరిపడా, పెరుగు - గ్లాసు, పచ్చిమిర్చి - 4, క్యారెట్ తురుము - కొద్దిగా, అల్లం - చిన్న ముక్క, కొత్తిమీర తరుగు - కొద్దిగా, నూనె - అర చెంచా, ఆవాలు - అర చెంచా, జీలకర్ర - అర చెంచా, ఇంగువ - చిటికెడు.

తయారీ విధానం: ముందుగా కుక్కర్‌లోకి బార్లీ తీసుకుని శుభ్రంగా కడగాలి. ఆ తర్వాత ఒక గ్లాసుకు బార్లీకి రెండు గ్లాసుల వాటర్ పోసుకోవాలి. అంటే ఇక్కడ గ్లాసున్నర కాబట్టి మూడు గ్లాసుల వాటర్ పోసుకోవాలి. తర్వాత రుచికి సరిపడా ఉప్పు వేసి మూత పెట్టి మీడియం ఫ్లేమ్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించుకోవాలి. ఈలోపు పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీరను సన్నగా కట్ చేసుకోవాలి. అలాగే క్యారెట్ సగ భాగాన్ని సన్నగా తురుముకుని పక్కన ఉంచాలి. బార్లీ ఉడికిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి పూర్తిగా చల్లార్చుకోవాలి. తర్వాత ఉడికించిన బార్లీని మిక్సీజార్‌లోకి తీసుకుని కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసుకోవాలి. ఒకవేళ ఈ మిశ్రమం కాస్త గట్టిగా అనిపిస్తే రుబ్బుకునేటప్పుడు కొన్ని నీళ్లు పోసుకోవచ్చు. బార్లీని గ్రైండ్ చేసుకుని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులోకి పెరుగు, మరో గ్లాస్ వాటర్ పోసి బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత కొత్తిమీర తరుగు, క్యారెట్ తురుము వేసి మిక్స్ చేసుకుని పక్కన ఉంచాలి. స్టవ్ ఆన్ చేసి కడాయి పెట్టి నూనె వేసుకోవాలి. ఆయిల్ కాగిన తర్వాత ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి. ఆ తర్వాత ఇంగువ వేసి మగ్గించాలి. చివరగా పచ్చిమిర్చి, అల్లం తరుగు వేసి ఓ నిమిషం వేపి బార్లీలో కలుపుకోవాలి. తాలింపును బార్లీలో కలిసేలా కలుపుకుని సర్వ్ చేసుకుంటే ఎండాకాలం ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే బార్లీ జావ రెడీ.

టిప్స్: బార్లీ గింజలను రాత్రంతా నానబెట్టుకుంటే త్వరగా ఉడుకుతాయి. జావను తయారుచేసేటప్పుడు గింజలు పూర్తిగా ఉడికేలా చూసుకోవాలి. జావను మరింత రుచికరంగా చేయడానికి నిమ్మరసం, పండ్ల ముక్కలు కూడా కలుపుకోవచ్చు.

కరివేపాకు మజ్జిగ

కావల్సిన పదార్థాలు: కరివేపాకు - గుప్పెడు, ఉప్పు - అరటీస్పూన్, జీలకర్ర పొడి - అరటీస్పూన్, అల్లం - అర అంగుళం ముక్క, పెరుగు - కప్పు.

తయారు చేసే విధానం: ముందుగా తాజా కరివేపాకును తీసుకొని శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత మిక్సీ జార్ తీసుకొని అందులో కడిగి పెట్టుకున్న కరివేపాకును కాడల నుంచి దూసి వేసుకోవాలి. అందులో ఉప్పు, జీలకర్ర పొడి, అల్లం, పెరుగు, తగినన్ని నీరు పోసుకొని మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఆ తర్వాత మిశ్రమం చిక్కగా ఉందనిపిస్తే మరికొద్దిగా నీళ్లు వేసుకొని కలుపుకోవాలి. అనంతరం గ్లాసులలో పోసుకొని చివర్లో కొద్దిగా కొత్తిమీర తరుగు వేసుకొని సర్వ్ చేసుకుంటే చాలు. అంతే ఎంతో రుచికరంగా ఉండే హెల్దీ 'కరివేపాకు బటర్ మిల్క్' మీ ముందు ఉంటుంది.

ఆరోగ్య ప్రయోజనాలు: కరివేపాకులో కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, జింక్, పీచు పోషకాలతో పాటు విటమిన్-సి, విటమిన్-బి, విటమిన్-ఇలు సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి దీన్ని తీసుకోవడం ద్వారా బోలెడన్ని ఆరోగ్య



ప్రయోజనాలు పొందవచ్చు. ముఖ్యంగా కరివేపాకులో విటమిన్-ఎ అధికంగా ఉండడం వల్ల కంటి చూపును మెరుగుపరచుకోవచ్చు. అలాగే దీనిలో చర్మాన్నీ, జుట్టునీ ఆరోగ్యంగా, అందంగా ఉంచే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. కాబట్టి జుట్టు ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేస్తుంది. బరువు తగ్గాలనుకునేవారూ కరివేపాకు తింటే మంచి ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా దీనిలో ఉండే 'కార్బజోల్ ఆల్కలాయిడ్స్' బరువు నియంత్రణలో ఎంతగానో సహాయ పడుతుంది. ఇంకా శరీరంలోని వ్యర్థాల్నీ బయటకు పంపిస్తూ, జీర్ణశక్తిని పెంచడంలోనూ కరివే పాకు ముందు వరుసలో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

సబ్జా క్యాండీ ఐస్‌క్రీమ్

కావాల్సిన పదార్థాలు: సబ్జా గింజలు - అర టీ స్పూన్, పటిక బెల్లం - అర కప్పు, నిమ్మకాయ - 1, ఉప్పు - చిటికెడు, వాటర్ - పావు లీటర్, పుదీనా ఆకులు - కొద్దిగా

తయారీ విధానం: ఓ బౌల్‌లోకి సబ్జా గింజలు తీసుకోవాలి. అందులో అర కప్పు నీళ్లు పోసుకుని సుమారు అర గంట సేపు నానబెట్టుకోవాలి. ఈలోపు మిక్సీజార్‌లోకి పటిక బెల్లం తీసుకుని మెత్తని పొడిలా చేసుకోవాలి. సబ్జా గింజలు నానిన తర్వాత మిగిలిన ప్రాసెస్ పూర్తి చేసుకోవాలి. మిక్సింగ్ బౌల్ తీసుకుని అందులోకి పటిక బెల్లం పొడి, నిమ్మరసం, ఉప్పు, నానబెట్టిన సబ్జా గింజలు, వాటర్, సన్నగా తరిగిన పుదీనా ఆకులు వేసి బాగా మిక్స్ చేసుకుని ఓ 10 నిమిషాలు పక్కన ఉంచాలి. పది నిమిషాల తర్వాత ఐస్‌క్రీమ్ మౌల్డ్స్ తీసుకుని ఈ వాటర్‌ను వాటిలో పోసి అల్యూమినియం పాయిల్‌తో క్లోజ్ చేసుకోవాలి. ఒకవేళ మీ దగ్గర ఐస్‌క్రీమ్ మౌల్డ్ లేకపోతే చిన్న చిన్న స్టీల్ గ్లాసులలో కూడా వీటిని పోసి పేపర్ చుట్టేసి ఫ్రీజర్‌లో పెట్టుకోవచ్చు. తర్వాత ఆ వాటర్‌లోకి ఐస్‌క్రీమ్ పుల్లలు గుచ్చి సుమారు 6 గంటలు లేదా రాత్రంతా ఫ్రీజర్‌లో పెట్టాలి. ఐస్‌క్రీమ్ తయారైన తర్వాత ఫ్రిజ్ నుంచి బయటికి తీసి ఓ నిమిషం తర్వాత డీమౌల్డ్ చేస్తే పుల్లగా, తియ్యగా ఉండే సబ్జా క్యాండీ ఐస్ రెడీ.

టిప్స్: పటిక బెల్లం ప్లేస్‌లో పంచదార లేదా



తేనెను కూడా యాడ్ చేసుకోవచ్చు. అలాగే నీళ్లకు బదులు ఇతర పండ్ల జ్యూస్‌లు ఉపయోగించినా టేస్ట్ మరింత బాగుంటుంది. ఆకర్షణీయంగా కనిపించడం కోసం చిన్నగా కట్ చేసి స్ట్రాబెర్రీ, చెర్రీ ముక్కలను కూడా వేసుకోవచ్చు.

జామకాయ ఐస్‌క్రీమ్

కావాల్సిన పదార్థాలు: జామకాయలు - 4, పాలు - అర కప్పు, బీట్‌రూట్ జ్యూస్ - 4 చుక్కలు, పటిక బెల్లం - 3 చెంచాలు, ఉప్పు - చిటికెడు, పాల పొడి - 1/3 కప్పు, డ్రైఫ్రూట్స్ పలుకులు - కొద్దిగా.

తయారీ విధానం: పాలను బాగా మరిగించి పూర్తిగా చల్లారిన తర్వాత అరగంట సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. జామకాయలను బాగా కడిగి, తడి లేకుండా తుడవాలి. ఆ తర్వాత వాటి పైభాగాన్ని అంటే కాడలు ఉన్నవైపు కొద్దిగా కట్ చేయాలి. స్పూను సహాయంతో జామకాయల లోపలి గుజ్జు, గింజలు తీసి, వాటిని ఒక బౌల్‌లో వేయాలి. మిక్సీజార్‌లోకి జామకాయ గుజ్జు, కాచి చల్లార్చిన చిల్డ్ మిల్క్, బీట్‌రూట్ జ్యూస్ డ్రాప్స్ వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులోకి పటిక బెల్లం, ఉప్పు, పాల పొడి వేసి మరోసారి బ్లెండ్ చేసుకోవాలి. ఈ జ్యూస్‌ను ఓ బౌల్‌లోకి తీసుకోవాలి. అనంతరం డ్రైఫ్రూట్స్ పలుకులు వేసుకుని కలుపుకోవాలి.



ఇప్పుడు ఈ మిశ్రమాన్ని జామకాయలలో నింపి, వాటి పైభాగాలను మూసివేయాలి. వాటిని ఫ్రీజర్‌లో 6 -7 గంటలు ఉంచి ఆ తర్వాత బయటికి తీసి పొడుగ్గా కట్ చేసుకుని తేనె, డ్రైఫ్రూట్స్‌తో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకుంటే సరి.

ఆరోగ్య ప్రయోజనాలు: జామకాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలోని విటమిన్లు, ఫైబర్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు సహా ఇతర పోషకాలు బరువు తగ్గడం, డయాబెటిస్ కంట్రోల్, చర్మంపై ముడతలు తగ్గించడం లాంటి ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ప్రస్తుతం మేకప్ ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగమైంది. అయితే ఈ విషయంలో కొంతమంది కొన్ని షార్ట్‌కట్స్ ఫాలో అవుతుంటారు. అవి ఎంతవరకు మనకు మంచిదో చూద్దాం...

ఆఫీస్ పూర్తవగానే అటు నుంచి అటే ఫంక్షన్‌కు వెళ్లాల్సి వస్తుంది. అపుడు ఉదయం వేసుకున్న మేకప్‌పై నుంచే తిరిగి టచప్ ఇస్తుంటారు చాలామంది. కానీ అలా చేయకూడదంటున్నారు నిపుణులు. ఎందుకంటే మేకప్ పైన వేసే మేకప్ సరిగా సెట్ అవ్వదు. పైగా ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. చర్మం బాగా ఎండిపోయినట్లు నిర్జీవంగా మారిపోవడమే కాకుండా మొటిమలు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువంటున్నారు.

సన్‌స్క్రీన్ తప్పనిసరి..!

చాలామంది మేకప్ వేసుకున్నాం కదా.. ఇంక సన్‌స్క్రీన్ అవసరం లేదనుకుంటారు. మిగతా సమయాల్లో ఎలా ఉన్నా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా సన్‌స్క్రీన్ రాసుకోవాలి. ఎందుకంటే సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షించగలిగేది సన్‌స్క్రీన్ మాత్రమే. సన్‌స్క్రీన్ రాసుకున్న తర్వాత దాని మీద మామూలుగా మేకప్ వేసుకున్నా సెట్ అవుతుంది.

బ్రష్‌లు శుభ్రం చేస్తున్నారా..?

మీరు ఉపయోగించే మేకప్ బ్రష్‌లను తరచూ శుభ్రం చేసుకోవాలి. శుభ్రం చేయకపోతే వాటిపై బ్యాక్టీరియా చేరుతుంది.. వాటిని తిరిగి ఉపయోగిస్తే లేనిపోని చర్మ సమస్యలు కొని తెచ్చుకున్నట్టే! అందుకే మేకప్‌కు ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

డ్రయర్‌తో తల ఆరబెడుతున్నారా?

పొద్దున్నే లేచి, తలస్నానం చేసే సరికే ఆఫీసు టైం దగ్గరపడుతుంది. ఇక తల ఆరబెట్టుకునే టైం ఎక్కడుంటుంది? అందుకే గబగబా హెయిర్ డ్రయర్‌తో ఆరబెట్టేసి, స్ట్రెయిట్‌నర్‌తో స్ట్రెయిట్ చేసేసి, నచ్చిన హెయిర్ స్టైల్ వేసేసుకుంటారు చాలామంది. కానీ దానివల్ల జుట్టు ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుంది. హెయిర్ డ్రయర్స్, స్ట్రెయిట్‌నర్స్, కర్లర్స్.. ఇవన్నీ ఎక్కువ వేడిని విడుదల చేస్తాయి. ఫలితంగా జుట్టులో ఉండే సహజ నూనెలు ఆవిరైపోతాయి. కాసేపటికే జుట్టు గరుకుగా, నిర్జీవంగా తయారవుతుంది.

నిద్రపోయే ముందు..

పార్టీకో, ఫంక్షన్‌కో వెళ్లొచ్చి బాగా అలసిపోయారు. ఇక, ఏ పనీ చేసే ఓపిక లేక అలాగే వెళ్లి మంచం ఎక్కేస్తారు. ఇలా చేస్తే మీ చర్మానికి మీరే హాని తలపెట్టినట్లవుతుంది. ఎందుకంటే ముందు మీ ముఖానికి ఉన్న మేకప్‌ను పూర్తిగా తొలగించుకోవాలి. లేదంటే మేకప్ అవశేషాలతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి మృతకణాలు, మొటిమల సమస్యలు వస్తాయి.

గడువు తేదీ గమనిస్తున్నారా?

మేకప్ సామగ్రి కొన్న తర్వాత అవి ఎన్ని రోజులు ఇంట్లో అలానే ఉన్నా వాటిని ఉపయోగిస్తూనే ఉంటాం. కానీ, వీటి గడువు తేదీ కూడా ఎప్పటికప్పుడు గమనించాలంటున్నారు నిపుణులు. ఒకవేళ ఎక్స్‌పైరీ దాటిన ఉత్పత్తులను ఉపయోగిస్తే అలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువంటున్నారు. కాబట్టి గడువు తేదీని బట్టి ఏడాదికోసారి మేకప్ ఉత్పత్తులు మార్చడం మంచిది.

వడ్డీ రేట్లు మరో పావు శాతం తగ్గింపు

(మొదటిపేజీ తరువాయి)

సుంకాల ప్రభావంపై మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు. భౌగోళికంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత వాణిజ్య యుద్ధ భయాలు, ముఖ్యంగా అమెరికా నుంచి సుంకాల పెంపు కారణంగా ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించవచ్చన్నారు. అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. తయారీ రంగం పునరుద్ధరిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గొచ్చన్నారు. ఇంతక్రితం అంచనాతో పోల్చితే 20 బేసిస్ పాయింట్లు తక్కువ కావడం గమనార్హం. తొలి త్రైమాసికం (క్యూ1)లో 6.5శాతం, క్యూ2లో 6.7శాతం, మూడు, నాలుగు త్రైమాసికాల్లో వరుసగా 6.6శాతం, 6.3శాతంగా ఉండొచ్చన్నారు. ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని.. ఇవి రాబోయే 11 నెలల దిగుమతులకు సరిపోతాయన్నారు.

ఫ్రాన్స్ నుంచి రాఫెల్ మెరైన్ జెట్‌లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన మంత్రి క్రిషి సించాయి యోజన (పీఎంకెఎస్‌వై) ఉప పథకంగా 2025-26 కాలానికి రూ.1600 కోట్ల తొలి కేటాయింపులతో ఇరిగేషన్ నెట్‌వర్క్ ఆధునీకరణను చేపట్టనున్నారు. నిర్దేశిత క్లస్టర్‌లో ప్రస్తుతమున్న కాలవల నుంచి లేదా ఇతర వనరుల నుంచి సాగునీటి సరఫరా కోసం నెట్‌వర్క్‌ను ఆధునీకరించడమే ఈ పథకం లక్ష్యంగా వుంది. దీనికి కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. దీంతో పాటు

తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రూ.1,332 కోట్లతో తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి వివరించారు.

ముదిరిన వాణిజ్య యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంటుంది.

అమెరికా బ్లాక్‌మెయిల్ : చైనా ఫిర్యాదు

అమెరికా చర్యలపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధిక సుంకాలు విధిస్తున్న అమెరికా తీరుపై చైనా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)కు ఫిర్యాదు చేసింది. చైనాపై విధిస్తున్న సుంకాలు అంతర్జాతీయ వాణిజ్యాన్ని అనిశ్చితిలోకి నెడుతాయని మంగళవారం యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో జరిగిన ఫోన్ కాల్‌లో చైనా ప్రీమియర్ లీ కియాంగ్ అన్నారు. సుంకాల పేరుతో అమెరికా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడు తోందన్నారు. ఎలాంటి అనిశ్చితులనైనా తట్టుకునేలా తమ ఆర్థిక విధానాలను రూపొందించినట్టు తెలి పారు. తమ దేశంపై అధిక సుంకాలు విధిస్తున్న అమె రికాకు తగిన విధంగా బదులిచ్చేందుకు తమ వద్ద విధానపరంగా అన్ని ఆయుధాలు ఉన్నాయని హెచ్చ రించారు. అమెరికా వాణిజ్య భాగస్వాములపై ట్రంప్ తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు.. ఏకపక్షవాదం, రక్షణవాదం, ఆర్థికపరంగా బలవంతపు చర్యలుగా అభివర్ణించారు. దీనిపై తమ నుంచి తప్పకుండా ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. అమెరికా ఉడత ఊపులకు భయపడేది లేదని చైనా స్పష్టం చేసింది.

ప్రపంచ దేశాలు చీలిపోవచ్చు

ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య నెలకొన్న ఈ వైరం ముమ్మాటికీ విచారకరమైనదే. ఎందుకంటే వాణిజ్య ప్రపంచంలో ఇప్పటికే తీవ్ర సంక్షోభం నెలకొని ఉంది. అమెరికాలో మాంద్యం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చైనా వస్తువులపై అమెరికా 104 సుంకం విధించడమంటే ఒక రకంగా వాణిజ్యపరమైన నిషేధం అన్న మాటే. ఇరు దేశాల మధ్య ఇక ప్రత్యక్ష వ్యాపార వాణిజ్యాలు కొనసాగే అవకాశాలు లేనట్లే. ఇప్పుడు రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదం స్వల్పకాలిక మార్కెట్ అస్థిరతకు దారి తీసే ప్రమాదం ఉంది. ఒకవేళ అది తీవ్ర రూపం దాలిస్తే దీర్ఘకాలంలో ప్రపంచమే రెండుగా చీలిపోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ దేశాలు ఇప్పుడు అమెరికాను విశ్వసించడం లేదని భావిస్తున్నారు.

చైనానే ప్రత్యామ్నాయం..

అమెరికా విధించిన సుంకాల నుంచి ఇతర దేశాలు ఎలా బయటపడతాయో ఇంకా స్పష్టంగా తెలియనప్పటికీ చైనా నుంచి కొన్ని వస్తువులు వియత్నాం లేదా మెక్సికో వంటి మూడో దేశం నుంచి అమెరికాలో ప్రవేశించే అవకాశం మాత్రం ఉంది. అంటే అమెరికా ఎంత గరిష్ట స్థాయిలో సుంకాలు విధించినా అక్కడి ప్రజలు చైనా వస్తువు లను కొనుగోలు చేయగలరు. గత సంవత్సరం చైనాతో అమెరికా 5,824 లక్షల కోట్ల డాలర్ల విలువ కలిగిన వస్తు వ్యాపారం చేసింది. చైనాకు 1,435 లక్షల కోట్ల డాలర్ల విలువ కలిగిన అమెరికా వస్తువులు ఎగుమతి అయ్యాయి. చైనా నుండి 4,389 లక్షల కోట్ల డాలర్ల విలువ కలిగిన వస్తువులను అమెరికా దిగుమతి చేసుకుంది.

త్వరలో ఔషధాలపై యూఎస్ టారిఫ్‌ల మోత

వాషింగ్టన్ : ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధానికి తెరలేపిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా ఔషధ రంగాన్ని టార్గెట్ చేసుకున్నారు. త్వరలోనే ఔషధ ఉత్పత్తులపై సుంకాల మోత మోగించనున్నట్టు ప్రకటించారు. అమెరికాకు దిగుమతయ్యే ఔషధ ఉత్పత్తులపై భారీ ఎత్తున సుంకాలు విధించనున్నట్టు తెలిపారు. మంగళవారం రాత్రి నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెషనల్ కమిటీ కార్యక్రమంలో మాట్లాడుతూ.. యూఎస్ ఫార్మా ఉత్పత్తులు తయారు కావడం లేదన్నారు. అందుకే ఇతర దేశాల నుంచి వచ్చే ఔషధ ఉత్పత్తులపై సుంకాలు విధించనున్నట్టు తెలిపారు. ఈ చర్యతో చైనా సహా వివిధ దేశాల్లోని ఫార్మా కంపెనీలన్నీ అమెరికాకు తరలివస్తాయని, ఇక్కడ తమ ప్లాంట్లను తెరుస్తాయని పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయంతో భారత్‌కు పెద్ద ఎదురుదెబ్బే అని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాకు భారత్ నుంచి 9 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.78వేల కోట్లు)విలువైన ఔషధాలు ఎగుమతి అవుతున్నాయి. భారత్ చేసుకుంటున్న దిగుమతులతో పోల్చితే ఇది 10 రెట్లు అధికం. అమెరికాలో లభించే జనరిక్ ఔషధాల్లో దాదాపు 70 శాతం దిగుమతి అయినవే. ఇందులో సుమారు 50 శాతం భారత్ నుంచి వెళ్లినవే కావడం విశేషం.

సాధారణ వర్షపాతమే

(మొదటిపేజీ తరువాయి)

సంకేతాలు ఇప్పుడు మసకబారటం ప్రారంభించాయి. సాధారణంగా రుతుపవనాలను ప్రభావితం చేసే ఎల్‌నినో సంభవించే అవకాశం తోసిపుచ్చబడింది" అని స్కైమెట్ మేనేజింగ్ డైరెక్టర్ జతిన్ సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సీజన్ రెండో భాగం.. మొదటి భాగం కంటే మెరుగ్గా ఉంటుందని భావిస్తున్నట్టు వివరించారు. లా నినా సాధారణంగా పెరిగిన వర్షపాతంతో ముడిపడి ఉంటుంది. ఎల్ నినో ఇందుకు విరుద్ధంగా ఉంటుంది.

దక్షిణ, పశ్చిమ భారతంలో తగినంత వర్షాలు

పశ్చిమ, దక్షిణ భారతంలో కావాల్సినంత చక్కటి వర్షాలు కురుస్తాయని స్కైమెట్ అంచనా వేసింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో 'తగినంత' వర్షపాతం నమోదు కానున్నది. పశ్చిమ కనుమల వెంబడి అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నది. కేరళ, తీరప్రాంత కర్నాటక, గోవాలలో అధిక వర్షాలు నమోదయ్యే పరిస్థితులున్నాయి. ఇక వాయువ్య ప్రాంతం, ఉత్తర భారతంలోని కొండప్రాంత రాష్ట్రాలలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

జూన్‌లో వానలు తక్కువే

వర్షాకాలం మొదటి నెల అయిన జూన్‌లో సాధారణం కంటే నాలుగుశాతం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నది. ఇక అత్యధిక వర్షపాతం



నమోదయ్యే నెలలైన జులైలో రెండు శాతం, ఆగస్టులో ఎనిమిది శాతం ఎక్కువ వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్‌లో నాలుగు శాతం అధికంగా వర్షాలు కురిసే అవకాశమున్నది. ఇక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) దేశంలో వర్షాభావ పరిస్థితుల గురించి తన అంచనాలను వచ్చేవారం తర్వాత విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024లో, భారత్‌లో జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సాధారణం కంటే 8 శాతం ఎక్కువగా వర్షాలు కురిశాయి.

జనాగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

నిరసన వ్యక్తం చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఘట్‌కేసర్‌లో ఆటోకు తాళ్ళు పట్టి లాగారు. షాపూర్‌నగర్‌లో రైతుబజార్ నుంచి శుభం హోటల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. షాపూర్ నగర్ ప్రధాన రోడ్‌పై రాస్తారోకో చేశారు.

మహబూబ్‌నగర్ పట్టణంలో సిలిండర్‌తో నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్ బస్టాండ్ సెంటర్‌లో కట్టెల పొయ్యి, సిలిండర్ పెట్టి నిరసన తెలిపారు. కల్వకుర్తి, వంగూరు, పెంట్లవెల్లి, ఉప్పు నుంతల మండలాల్లో నిరసనలు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా నందు గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా పానగల్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. వీపనగండ్ల, అమరచింత మండలాల్లో నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గీతాభవన్ చౌరస్తాలో గ్యాస్ సిలిండర్‌ను నెత్తిపై పెట్టుకుని, ప్లకార్డులతో నిరసన తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ధర్నాచౌక్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

బ్రిటిషర్ల కంటే బీజేపీనే ప్రమాదకరం

(మొదటిపేజీ తరువాయి)

ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారని చెప్పారు. మోడీకి వ్యతిరేకంగా పోరాడేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామనీ, సీడబ్ల్యూసీ చింతన బైఠక్ నుంచి అదే ఆశ, ఆదేశాలతో తిరిగి వెళ్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని ఓడించే బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

యూనివర్సిటీలపై ఆగని ట్రంప్ ప్రతీకార చర్యలు

- నిన్న ప్రిన్స్‌టన్.. నేడు కార్నెల్, నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయాలు
- 1 బిలియన్ డాలర్లకు పైగా నిధులను స్తంభింపజేసిన రిపబ్లికన్ గవర్నమెంట్
- పౌర హక్కుల ఉల్లంఘనల విషయంలో రెండు సంస్థలపై దర్యాప్తు

వాషింగ్టన్ : అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం అక్కడి యూనివర్సిటీలకు నిధులను నిలిపివేసే పరంపరను కొనసాగిస్తున్నది. ప్రతీకార చర్యలకు దిగుతోంది. డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కార్నెల్ విశ్వవిద్యాలయానికి 1 బిలియన్ డాలర్లు, నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీకి 790 మిలియన్ డాలర్లకు పైగా నిధులను స్తంభింపజేసింది. పౌర హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి ట్రంప్ యంత్రాంగం రెండు సంస్థలపై దర్యాప్తు చేస్తున్నది. ఈ నేపథ్యంలో నిధులను నిలిపివేసింది. పేరు వెల్లడించటానికి ఇష్టపడని యూఎస్ అధికారి ఒకరు ఈ విషయాన్ని తెలిపారు. "నిలిపివేయబడుతున్న నిధులలో ఎక్కువగా ఆరోగ్యం, విద్య వ్యవసాయం, రక్షణ సమాఖ్య విభాగాలకు సంబంధించిన గ్రాంట్లు, కాంట్రాక్ట్‌లు ఉంటాయి" అని సదరు అధికారి వివరించారు.

పాలస్తీనా అనుకూల క్యాంపస్ నిరసనలు, వైవిధ్యం, సమానత్వం, ఇన్‌క్లూషన్ ప్రోగ్రామ్స్, ట్రాన్స్‌జెండర్ పాలసీలపై ఆందోళనల కారణంగా ట్రంప్ యంత్రాంగం విశ్వవిద్యాలయాల నుంచి ఫెడరల్ ఫండ్స్ నిలిపివేస్తామని బెదిరించింది.



గతనెలలో, కార్నెల్, నార్త్‌వెస్టర్న్‌తో సహా 60 విశ్వవిద్యాలయాలకు ఒక లేఖను పంపింది. పాఠశాలలు తాను వర్ణించిన యాంటీసెమిటిజం (యూదువ్యతిరేకత) ను పరిష్కరించటంలో విఫలమైనట్టు సమీక్షలో తేలితే అమలు చర్యలు ఉంటాయని హెచ్చరించింది. మొత్తం నిధుల స్తంభన, విలువకు సంబంధించి అధికారిక నోటిఫికేషన్ అందనప్పటికీ.. రక్షణ, ఆరోగ్యం, సైబర్ భద్రతలో పరిశోధనలకు సంబంధించి రక్షణ శాఖ నుంచి పని నిలిపివేత ఉత్తర్వులు అందాయని కార్నెల్ విశ్వవిద్యాలయం పేర్కొన్నది. ప్రభుత్వం నుంచి మరిన్ని వివరాలు కోరుతున్నట్టు తెలిపింది. నిధుల స్తంభనపై మీడియా నివేదికలను నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయం అంగీకరించింది. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ రాలేదని వివరించింది. కొనసాగుతున్న దర్యాప్తునకు సహకరిస్తున్నట్టు విశ్వవిద్యాలయం వివరించింది.

ట్రంప్ తీరుపై మానవ హక్కుల కార్యకర్తల ఆందోళన

విశ్వవిద్యాలయాలపై ట్రంప్ సర్కారు కఠిన చర్యలు తీసుకోవటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ చర్యకు స్పందనగా మానవ హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులు వాక్ స్వాతంత్ర్యం, విద్యా స్వేచ్ఛపై ఆందోళన వ్యక్తం చేశారు. గతవారం, అమెరికా ప్రభుత్వం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి సంబంధించి 9 బిలియన్ డాలర్ల ఫెడరల్ గ్రాంట్లు, కాంట్రాక్టులను సమీక్షిస్తున్నట్టు ప్రకటించింది. సమాఖ్య నిధులను పొందటానికి విశ్వవిద్యాలయం తప్పనిసరిగా పాటించాల్సిన నిర్దిష్ట షరతులను విధించింది. అలాగే, ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం ప్రభుత్వం తన డజన్ల కొద్దీ పరిశోధన గ్రాంట్లను నిలిపివేసిందని వెల్లడించినట్టు రాయిటర్స్ ఉటంకించింది. గతనెలలో ట్రంప్ సర్కారు కొలంబియా విశ్వవిద్యాలయానికి 400 మిలియన్ డాలర్ల నిధులను రద్దు చేసింది. ఈ క్యాంపస్ గతేడాది పాలస్తీనా అనుకూల నిరసనలకు కేంద్రంగా ఉండటం గమనార్హం. ఇటీవల వివిధ క్యాంపస్‌ల నుంచి అనేక మంది విదేశీ విద్యార్థుల నిరసనకారులను ఫెడరల్ ఏజెంట్లు అదుపులోకి తీసుకున్నారు. వారిని బహిష్కరించటానికి చర్యలు తీసుకుంటున్నారు. నిరసనల్లో పాల్గొన్న అనేక మంది విదేశీ విద్యార్థుల వీసాలను కూడా ప్రభుత్వం రద్దు చేసింది. క్రీడలలో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనే అంశానికి సంబంధించిన విధానాల కారణంగా ట్రంప్ యంత్రాంగం పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయానికి 175 మిలియన్ డాలర్ల నిధులను నిలిపివేసింది.


నవచిత్రం



'కన్నప్ప' రిలీజ్‌కి సిద్ధం

హీరో విష్ణు నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయి. ఈ సినిమా నుంచి వచ్చిన పోస్టర్లు, టీజర్లు సినిమాపై అంచనాలు పెంచాయి. మరీ ముఖ్యంగా పాటలు సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ చేశాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్ర బృందం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది.

మోహన్ బాబు, విష్ణు, ప్రభుదేవా తదితరులు యూపీ సీఎంను కలిశారు. ప్రముఖ చిత్రకారుడు రమేష్ గోరిజాల గీసిన చిత్రపటాన్ని యూపీ సీఎంకు మోహన్ బాబు బహూకరించారు. అనంతరం ఈచిత్ర రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూపీ సీఎం ఆదిత్య నాథ్ రిలీజ్ చేసి, అభినందించారు. ఈ సినిమా జూన్ 27న విడుదల చేయ బోతున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు దీన్ని నిర్మించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్ వంటి భారీ తారాగణం నటించింది.



నాని

'వేటు వేసినా.. వేట సాగెనులె'

నాని, శ్రీ నిధి శెట్టి జంటగా నటిస్తున్న క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'హిట్ 3 : ది థర్డ్ కేస్'. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు.

తాజాగా బుధవారం ఈ చిత్రంలోని సెకెండ్ సింగిల్ ' వేటు వేసినా.. వేట సాగెనులె.. అబ్కీ బార్ అర్జున్ సర్కార్'ని రిలీజ్ చేశారు. ఈ పాట అర్జున్ సర్కార్ పాత్రకు ప్రాణం పోసింది.

కృష్ణకాంత్ రాసిన సాహిత్యంతో పాత్ర సారాంశాన్ని పాట ద్వారా అద్భుతంగా చూపించారు. మిక్కీ జె మేయర్ ఆకట్టుకునే ట్రాక్‌ను, ఎలక్ట్రిఫైయింగ్ ఆర్కెస్ట్రేషన్‌తో కంపోజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి డైనమిక్ వాయిస్ సాంగ్‌ని మరోస్థాయికి తీసుకెళ్తుంది. సాను జాన్ వర్గీస్ మ్యాజికల్ కెమెరా వర్క్ అందిస్తూ, ప్రతి మూమెంట్‌ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. అలాగే ఈనెల 14న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ పాట ద్వారా అనౌన్స్ చేశారు. మూవీ మే 1న విడుదలకు సిద్ధమవుతోంది.



'నారి నారి నడుమ మురారి'

శర్వానంద్ నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారి నారి నడుమ మురారి'. 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రామబ్రహ్మం సుంకర, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో సాక్షి వైద్య, సంయుక్త కథానాయికలుగా నటించారు. ఇప్పటికే ఈ సినిమా నుండి ఫస్ట్ లుక్, ఇతర పోస్టర్లు విడుదలై మంచి బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'దర్శనమే..'ను రిలీజ్ చేసి, మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు.

విశాల్ చంద్ర శేఖర్ ఈ పాట కోసం క్లాసిక్ మెలోడీని ఫ్రెష్ బీట్స్‌తో అద్భుతంగా కంపోజ్ చేశారు. మనసుని కట్టిపడేసే ట్రాక్ ఇది. యాజిన్ నిజార్ వోకల్స్ పాటను మరో స్థాయికి తీసుకెళ్ళాయి. ఆయన వాయిస్ మెస్మరైజ్ చేసింది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం శర్వా ఎమోషన్స్‌ని అద్భుతంగా వర్ణించింది. స్క్రీన్ పై శర్వా చరిస్మాటిక్ ప్రజెన్స్ కట్టిపడేసింది. సంయుక్త అందంగా కనిపించింది. వారు తమ ప్రేమకథను ప్రేక్షకులను అలరించే విధంగా పెర్ఫామ్ చేశారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

శర్వానంద్


ప్రదీప్ మాచిరాజు

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

హీరో ప్రదీప్ మాచిరాజు నటించిన నూతన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. డైరెక్టర్స్ నితిన్, భరత్ దర్శకత్వం వహించారు.

మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మించింది. దీపికా పిల్లి కథానాయికగా నటించిన ఈ చిత్రం ఈనెల 11న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరో ప్రదీప్ మాచిరాజు మీడియాతో ముచ్చటించారు.

ఇదొక చందమామ కథ..

ఈ సమ్మర్లో ఫ్యామిలీ అంతా కూర్చుని హ్యాపీగా చూసే సినిమా. పైగా వాళ్ళు మా నుంచి ఎలాంటి కంటెంట్‌ని ఆశిస్తారో అలాంటి కంటెంట్ ఇందులో ఉంది. ఇదొక చందమామ కథ. అనగనగా ఒక ఊరు. అక్కడ ఓ అమ్మాయి. ఆ ఊరికి వెళ్ళిన ఒక సివిల్ ఇంజనీర్. ఆ ఊర్లో కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. ఆ రూల్స్ మధ్య హీరో ఎలా ఇరుక్కున్నాడు? అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ప్రజెంట్ చేశాం. ఇది పవన్ కళ్యాణ్ సినిమా టైటిల్. అందుకే అన్ని జాగ్రత్తలు తీసుకుని ఈ సినిమా చేశాం.

నేను పడే కష్టాలు నవ్విస్తాయి

ఇందులో కృష్ణ అనే పాత్రలో కనిపిస్తాను. చాలా స్మార్ట్ క్యారెక్టర్. ఇందులో నేను పడే కష్టాలు చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటూ ప్రేక్షకుల్ని నవ్విస్తాయి. డైరెక్టర్స్ నితిన్, భరత్ ఈ కథని, నా క్యారెక్టర్‌ని చాలా బ్యూటీఫుల్‌గా డిజైన్ చేశారు.హీరోయిన్ దీపికా పిల్లి చాలా అద్భుతంగా నటించింది. ఆడియన్స్ డెఫినెట్‌గా సర్‌ప్రైజ్ అవుతారు. ఈ సినిమాలో మ్యూజిక్‌కి చాలా మంచి స్కోప్ ఉంది. ప్రతి సాంగ్‌ని ఒక డిఫరెంట్ జోనర్‌లో చేశాం. రథన్ బ్యూటీఫుల్ ఆల్బమ్ ఇచ్చారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమా చూశారు. సినిమా పూర్తవ్వగానే డీల్ క్లోజ్ చేశారు. ఇది సమ్మర్‌కి ఫ్యామిలీ అంతా కలసి చూడాల్సిన సినిమా అని, రిలీజ్ డేట్‌ని వారే లాక్ చేశారు. ఇది మాకు మరింత కాన్ఫిడెన్స్‌ని ఇచ్చింది.



విలన్లపై వినూత్న ప్రేమగీతం

దర్శకుడు బాబ్జీ రూపొందిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. ఈ చిత్రం నుంచి ఒక వినూత్నమైన ప్రేమగీతం ఆవిష్కరణ జరిగింది. ఈ పాటను రాజేంద్ర ప్రసాద్ లాంచ్ చేశారు. తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత బెల్లి జనార్ధన్ ఈ చిత్రాన్ని నిర్మించారు.


ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, 'సాధారణంగా సినిమాల్లో హీరో-హీరోయిన్లు ప్రేమగీతాలు పాడుకుంటారు. కానీ ఈ సినిమాలో విలన్లు డ్యూయెట్‌లు పాడుకోవడం ఒక వెరైటీ కాన్సెప్ట్. ఈ సినిమా విడుదలైన తర్వాత విలన్లకు కూడా డ్యూయెట్‌లు పెట్టే ట్రెండ్ మొదలవుతుందని నా నమ్మకం' అని అన్నారు.

'త్వరలో సెన్సార్ పనులు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధం చేస్తున్నాం' అని దర్శకుడు బాబ్జీ తెలిపారు. నిర్మాత బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో వీలైనన్ని ఎక్కువ థియేటర్లలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ప్రేక్షకులకు ఈ చిత్రం ఒక కొత్త అనుభవాన్ని అందిస్తుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

వక్ఫ్ నిరసనలపై యోగి సర్కారు ఉక్కుపాదం

- నల్లటి బ్యాండ్లు ధరించినందుకు పలువురిపై చర్యలు
- నిశబ్ద నిరసనలనూ సహించని యూపీ ప్రభుత్వం
- బీజేపీ సర్కారు తీరుపై విమర్శల వెల్లువ

పలు రాజకీయ, మత నాయకులకు నోటీసులు, బాండ్లు



లక్నో : వక్ఫ్ చట్టంలోని సవరణలపై విమర్శలను యూపీలోని యోగి సర్కారు సహించటం లేదు. అన్ని రకాల నిరసనలపై ఉక్కుపాదం మోపుతున్నది. ఆందోళనకారుల గొంతును అణచివేస్తున్నది. ఇందుకు ప్రభుత్వం తన వద్ద ఉన్న అధికారాన్ని వాడుకుంటూ వారి ప్రజాస్వామిక హక్కును హరించివేస్తున్నది. చట్ట సవరణలపై విమర్శలు, నల్లటి బ్యాండ్‌లు ధరించటం వంటి నిశబ్ద నిరసనలు చేసినా.. వారికి నోటీసులు పంపుతున్నది. పలువురికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు విలువ చేసే బాండ్లు అందుతున్నాయి. ఇప్పటికే పలువురు రాజకీయ, మత నాయకులపై యూపీ బీజేపీ సర్కారు ఈ విధమైన చర్యలు తీసుకున్నది. ఇప్పటి వరకు ముజఫర్‌నగర్, లక్నో, సీతాపూర్ వంటి ప్రాంతాల్లో ఇలాంటి చర్యలు తీసుకున్నారు.

ఎస్పీ నేతలు, కార్యకర్తలకు నోటీసులు, బాండ్లు

లక్నోలో.. యూపీలోని ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి చెందిన వ్యక్తులకూ నోటీసులు జారీ అయ్యాయి. బక్షీ కా తలాబ్ మేజిస్ట్రేటు.. తమ ముందు హాజరుకావాలంటూ నలుగురు ఎస్పీ కార్యకర్తలు మహేంద్ర యాదవ్, వహీయుద్దీన్, జావేద్, అంకిత్ యాదవ్‌లకు నోటీసులు పంపింది. వారు రూ.లక్ష చొప్పున వ్యక్తిగత బాండ్లను, సమాన మొత్తంలో రెండు ష్యూరిటీలను ఎందుకు సమర్పించకూడదో కారణం చూపాలని ఆదేశించింది.

ఎస్పీ నాయకురాలు, ప్రముఖ రచయిత మునావర్ రాణా కూతురు అయిన సుమైయ రాణాకు సైతం లక్నో పోలీసులు నోటీసులు పంపారు. రూ.10లక్షల బాండ్‌తో పాటు అదే మొత్తానికి ఇద్దరు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించారు. ఆమె ప్రజాశాంతికి విఘాతం కలిగించొచ్చనే కారణంతో నోటీసులు అందించటం గమనార్హం. "పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉన్నది. ఆమె శాంతిని ఉల్లంఘించే అవకాశం ఉన్నది" అని నోటీసు పేర్కొన్నది. కాగా, రాణా ఈ నోటీసును తిరస్కరించగా.. ఆ తర్వాత ఆమెకు వాట్సప్ ద్వారా దీనిని అందించారు. దీనిపై తాను కోర్టును ఆశ్రయిస్తాననీ, ఇది యూపీ ప్రభుత్వం, పోలీసుల నియంతృత్వమని రాణా ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు తీసుకునే ప్రతి చెడు చర్యకు వ్యతిరేకంగా తాను గొంతెత్తుతానని ఒక వీడియో స్టేట్‌మెంట్ ద్వారా రాణా వెల్లడించారు.

నల్లటి బ్యాండ్లు ధరించినందుకు నోటీసులు

నల్లటి బ్యాండ్ ధరించాడని ముజఫర్‌నగర్‌లోని మదర్సా వైస్-ప్రెసిడెంట్ నయీమ్ త్యాగికి నోటీసులు జారీ అయ్యాయి. అయితే, తనకు తన ప్రాంతంలోని అలాంటి నిరసనల గురించి తెలియదని నయీమ్ త్యాగి తెలిపాడు. "మదర్సాలోని మసీదు వద్ద నాలుగైదువేల మంది వరకు నమాజ్ చేస్తారు. ప్రతి ఒక్కరినీ నేనెలా గమనిస్తాను. ఇద్దరో, నలుగురో నల్లని బ్యాండ్‌లు ధరించి ఉండొచ్చు. నాకు దాని గురించి తెలియదు" అని నయీమ్ త్యాగి వివరించాడు. ఈద్-ఉల్-ఫితర్ రోజున నమాజ్ సమయంలో నల్ల బ్యాండ్లు ధరించినందుకు సీతాపూర్‌లో 60 మందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. నిరసన హక్కును హరించివేస్తున్న యోగి సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ముజఫర్‌నగర్‌లో 300 మందికి నోటీసులు

ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ముజఫర్‌నగర్‌లో 300 మందికి నోటీసులు అందించినట్టు ఒక సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఇందులో ముజఫర్‌నగర్‌లోని అయేషా మసీదు సంరక్షకుడైన ముజీబ్ శిబ్లి ఉన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నల్లటి బ్యాండ్‌లు ధరించినందుకు శిబ్లితో పాటు మరో ముగ్గురికి ఈ నోటీసులు అందాయి. ఈనెల 16న కోర్టు ముందు హాజరుకావాలంటూ శిబ్లికి ముజఫర్‌నగర్ సిటీ మేజిస్ట్రేటు నోటీసు పంపింది. అలాగే, ఆయన రూ.2 లక్షల బాండ్, అదే మొత్తానికి ఇద్దరు ష్యూరిటీలను ఎందుకు సమర్పించకూడదో వివరించాలని అందులో ఆదేశించింది. ఈద్-ఉల్-ఫితర్ నమాజ్, అల్విదా జుమ్మా సందర్భంగా ప్రార్థనల అనంతరం శిబ్లితో పాటు మరికొందరు నల్లటి బ్యాండ్‌లు ధరించారన్న పోలీసు నివేదిక ఆధారంగా ఈ నోటీసు జారీ కావటం గమనార్హం. వారు ప్రజలకు తప్పుడు సందేశాన్ని పంపుతున్నారని, శాంతి భద్రతలను ఉల్లంఘించారని పోలీసులు ఆరోపించారు.

శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా 300మంది 'సంఘ విద్రోహ శక్తులు'ను గుర్తించినట్టు ముజఫర్‌నగర్ నగర ఎస్పీ సత్యనారాయణన్ ప్రజాపత్ వెల్లడించటం గమనార్హం. శాంతికి విఘాతం కలిగించిన వారికి భారతీయ నాగరిక సురక్ష సంహితలని సెక్షన్ 126, సెక్షన్ 130 కింద నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. జామియత్-ఉలేమా-ఎ-హింద్ నగర కార్యదర్శిగా ముజీబ్ శిబ్లి వ్యవహరిస్తున్నాడు. అయితే, నిశబ్దంగా నిరసనలు తెలియ జేస్తున్నా.. ముస్లింలకు భారీమొత్తంలో బాండ్లను జారీ చేయటంపై శిబ్లి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. " ముస్లిం పర్సనల్ లా బోర్డు అప్పీలు మేరకు గత శుక్రవారం బ్లాక్ రిబ్బన్లతో మేము నిశబ్దంగా నిరసనలు చేశాం. ఆ సమయంలో ఎలాంటి శబ్దమూ, ప్రదర్శనా, నినాదాలూ, గొడవా జరగలేదు" అని శిబ్లి వివరించాడు. " ఇది ప్రజాస్వామ్యం. నిశబ్దంగా నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నది" అని అన్నాడు.

ఆటలు

సత్తా చాటిన సాయి సుదర్శన్

గుజరాత్ టైటాన్స్ 217/6

అహ్మదాబాద్: ఐపిఎల్ సీజన్-18లో గుజరాత్ జెయింట్స్ బ్యాటర్ల హవా కొనసాగుతోంది. నరేంద్ర మోడీ స్టేడియంలో రాజస్తాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్(82; 53బంతుల్లో 8ఫోర్లు, 3సిక్సర్లు) అర్ధసెంచరీకి తోడు బట్లర్(36), షారుక్ ఖాన్(36) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను ఆరంభం నుంచే కట్టడి చేయాలని రాజస్థాన్ భావించింది. మూడో ఓవర్‌లోనే తొలి వికెట్‌ను తీసింది. 2.1 ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్ వేసిన బంతికి శుభమన్ గిల్(2) బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జోస్ బట్లర్ (36)తో కలిసి సాయి సుదర్శన్ (82) చెలరేగాడు. జట్టును భారీ స్కోర్ దిశగా తీసుకెళ్లాడు. అయితే వీరిద్దరి విజృంభణకు10వ ఓవర్‌లో బ్రేక్ పడింది. ఆ ఓవర్‌లో చివరి బంతికి బట్లర్ ఎల్‌బీడబ్ల్యూ అయ్యాడు. తొలుత ఎంపైర్ దీన్ని ఔట్‌గా ప్రకటించలేదు. రాజస్థాన్ రాయల్స్ రివ్యూ కోరడంతో థర్డ్ ఎంపైర్ ఔట్‌గా నిర్ణయించింది. బట్లర్ తర్వాత క్రీజులోకి వచ్చిన షారుక్‌ఖాన్ కూడా దూకుడగా ఆడాడు. 20 బంతుల్లో 36 పరుగులు చేశాడు. కానీ తీక్షణ బౌలింగ్‌లో 15.4 బంతికి షారుక్ ఖాన్ స్టంపౌట్ అయ్యాడు. షారుక్ ఖాన్ తర్వాత వచ్చిన రూథర్‌ఫోర్డ్(7) వచ్చి రాగానే సిక్స్‌తో విరుచుకుపడ్డాడు. కానీ ఆ దూకుడు ఎక్కువసేపు కొనసాగించలేకపోయాడు. 16.1వ ఓవర్‌లో సందీప్ శర్మ బౌలింగ్‌లో వికెట్ కీపర్ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ఇక 19వ ఓవర్‌లో రెండో బంతికి సాయి సుదర్శన్ కూడా ఔటయ్యాడు. తుషార్ దేశ్‌పాండే వేసిన బంతికి శాంసన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ వెంటనే రషీద్ ఖాన్ (12) కూడా ఔటయ్యాడు. రాహుల్ తెవాటియా (24) ఫర్వాలేదనిపించాడు. ఫలితంగా నిర్ణీత 20ఓవర్లు ముగిసేసరికి ఆరు వికెట్ల నష్టానికి గుజరాత్ 217 పరుగులు చేసింది. రాజస్థాన్ బౌలర్లు తీక్ష ణ, దేశ్‌పాండేకు రెండేసి, ఆర్చర్, సందీప్ శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు :

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శ న్ (సి)సంజు (బి)దేశ్‌పా ండే 82, శుభ్‌మన్ గిల్ (బి)జోఫ్రా ఆర్చర్ 2, జో స్ బట్లర్ (ఎల్‌బి)తీక్షణ 36, షారుక్ ఖాన్ (స్టంప్)సంజు (బి)తీక్షణ 36, రూథర్‌ఫోర్డ్ (సి) సంజు (బి)సందీప్ శర్మ 7, రాహుల్ తెవాటియా 24, రషీద్ (సి)జైస్వాల్ (బి)దేశ్ పాండే ఆర్షాద్ ఖాన్ (నాటౌట్) 0, అదనం 18 217పరుగులు.

వికెట్ల పతనం: 1/14, 2/94, 3/156, 4/163, 5/187, 6/201

బౌలింగ్: జోఫ్రా ఆర్చర్ 4-0-30-1, ఫారుఖీ 4-0-38-0, తుషార్ దేశ్‌పాండే 4-0-53-2, సందీప్ శర్మ 4-0-41-1, తీక్షణ 4-0-54-2.

షూటర్ సురుచికి స్వర్ణం

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్



బ్యూనస్‌ఎయిర్ (అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్‌లో భారత్‌కు మరో స్వర్ణ పతకం దక్కింది. మంగళవారం రాత్రి జరిగిన మహిళల 10మీ. ఎయిర్ పిస్టోల్ విభాగంలో 18ఏళ్ల యువ షట్లర్ సురుచి ఇందర్ సింగ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆమె 583 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. ఫైనల్‌లోనూ సురుచి అదే జోరు కొనసాగించింది. ఆరంభంలో కాస్త వెనుకబడినా.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుంది. 8మంది షూటర్ల మధ్య జరిగిన ఫైనల్లో 244.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్,10 మీటర్ల ఎయిర్ రైఫిల్ కేటగిరీలో రుద్రాంక్ష్ పాటిల్ ఇప్పటికే గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.